

వెల్చేరు

# హాస్య కథలు



- వెల్చేరు చంద్రశేఖర్

శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 43





HAPPY HOME PUBLICATIONS

వెల్చేరు

# హాస్య కథలు




- వెల్చేరు చంద్రశేఖర్




హాపీహోమ్ పబ్లికేషన్స్
**HIG-II-39 SFS (Upstairs)**
**(Near Saibaba temple)**
**Housing Board Colony, P.M. Palem,**
**VISAKHAPATNAM - 530 041**
**velcherucs@rediffmail.com**

# హాస్య కథలు



వెల్చేరు చంద్రశేఖర్

**హాస్య కథలు**

వెల్చేరు చంద్రశేఖర్

ముద్రణ - సెప్టెంబర్ 2009

ప్రతులకు: హాపీహోమ్ పబ్లికేషన్స్
HIG-II-39 SFS (upstairs)
(Near Saibaba temple)
Housing Board Colony
P.M. Palem, VISAKHAPATNAM - 530 041
velcherucs@rediffmail.com

ముద్రణ :
ఆకాష్ ఆఫ్‌సెట్, సామర్లకోట.
ఫోన్ : 0884 - 2329454.

# వెల

పై కేప్షన్ వుండవలసిన స్థానంలో కాక, ఇలా వెలిసిందని ఆలోచిస్తున్నారా. ఇదే కథల సంపుట్ల ఫ్యూచరు.

ఈ పుస్తకాన్ని చాలామంది కొనరు, కొన్నా చదవరు. అందుకని దీనికి వెల పెట్టలేదు.

కొనని వాళ్ళది, చదవని వాళ్ళది తప్పుకాదు. ఈనాటి కథల్లో ఆ సత్తా లేదు, ఈ నాటి జనరేషనుకి అవసరం లేవు.

ఇది వొక మార్పు. దీన్ని నేను వొప్పుకున్నాను. కానీ ఏ కొద్దిమంది కోసమో రాసి, వాళ్ళకి అమ్ముదామనే తాపత్రయం నాకులేదు.

ఇంక ఈ కథల కొస్తే -

"జనాభా", మనుషులు, మానవ సంబంధాలు, దానవ పరిస్థితులు, ధన సామ్రాజ్యం, విలువల రెలిటివిటీ, నిజాయితీ కొడిగట్టుతనం చేసిన ఎలిమెంట్స్‌గా ఈ కథలు వుంటాయి.

వీటికి వెలలేదు. మీ ఇష్టం ఎక్కడైనా ఈ పుస్తకం కొనాల్సి వస్తే మీకు తోచిన వెల నిచ్చి తీసుకోండి. అది వుపయోగపడొచ్చు. కాని ఇది ఏ పుస్తకాల షాపుల్లో దొరకదు.

ఇది కొనదల్చుకోకపోతే ఈ పుస్తకం ఇంటర్నెట్‌లో దొరుకుతుంది. నన్ను పంపమంటే మీ e-mail address కి పంపుతాను. లేదా కౌముది అని e-పత్రిక వస్తోంది. దాని లైబ్రరీలో వుంటుంది.

- (velcherucs@rediffmail.com)

# హాస్యకథాక్రమము


| | | |
|---|---|---|
| 1. | కంప్యూటర్ కథ | 1 |
| 2. | బేసిక్ ఇన్‌స్టింక్ట్ | 12 |
| 3. | కోరికలే గుర్రాలైతే | 17 |
| 4. | మిస్టర్ అక్కయ్య | 27 |
| 5. | మధ్యతరగతి మందుభాగ్యం | 39 |
| 6. | కామెడీ ఆఫ్ కరెక్ట్స్ | 48 |
| 7. | క్లెవర్ గర్ల్ | 55 |
| 8. | ఇది నా తప్పుకాదు భాయి | 57 |
| 9. | ఖండిత | 60 |
| 10. | ముచ్చటగా ముగ్గురు | 62 |
| 11. | అసమర్థుడు - రొటీన్ | 69 |
| 12. | అసమర్థుడు - హనుమాన్లు | 73 |
| 13. | అసమర్థుడు - పి.ఎఫ్ లోను | 77 |
| 14. | అసమర్థుడు - టెలిఫోన్ | 81 |
| 15. | అసమర్థుడు - కలర్ టి.వి. | 84 |
| 16. | అసమర్థుడు - అపవిత్రత | 87 |
| 17. | అసమర్థుడు - అయిడెంటిటీ క్రైసిస్ | 91 |


velcherucs@rediffmail.com

# కంప్యూటర్ కథ

నేను జిల్లా పరిషత్ ఆఫీసుకి వెళ్ళేసరికి, సహజంగానే అక్కడ రద్దీగా ఉంది. ఆఫీసులో కంట్రాక్టర్లకున్న విలువ, నాలాంటి బడిపంతుళ్ళకు ఉండదు కదా? కానీ ఎండకీ, వానకీ, రోడ్డు నుంచీ వచ్చే ధూళికి గురై కష్టపడుతున్న పిల్లలని చూడలేక మేం స్కూలు బిల్డింగ్ కోసం పెట్టుకున్న ''అర్జీ'' ఏమైందో తెలుసుకోవడానికి, జిల్లా పరిషత్ ఆఫీసుకి వెళ్ళక తప్పలేదు. నేను వెళ్ళిన కాసేపటికి స్కూళ్ళ ఇన్స్పెక్టర్ ఆఫీసుకొచ్చాడు.

"అరె మాష్టారూ, మీరా! మూడు గంటలకి కొంచెం కనపడండి. మీతో పనుంది.'' అన్నాడు.

నాకు ఆనందం కలిగింది. స్కూలు బిల్డింగ్ శాంక్షన్ అయినట్టుంది. ఆ విషయం చెప్పడానికేమో రమ్మన్నారు. మాకున్న కష్టాలు సగం తీరాయి. అనుకున్నాను.

"అలాగేనండీ?'' అని ఆయనకు నమస్కరించి, ఆ పక్కనే మా తమ్ముడుంటే వాడింటికెళ్ళాను. అక్కడే భోజనం ముగించి చిన్న కునుకు తీసాను.

* * *

పద్మాసనం వేసుకుని బ్రహ్మ సృష్టి చెయ్యడంలో తనని తాను మరచిపోయాడు. నిమిషానికి పదిహేను బొమ్మలు ప్రాణాలు పోసుకుని "కేర్ కేర్'' అని పుట్టుకొస్తున్నాయి.

బ్రహ్మ ఏకాగ్రతని భగ్నం చేస్తూ పెద్దగా కోలాహలం వినిపించింది.

కళ్ళు తెరిచి చూసిన బ్రహ్మకు ఎదురుగా ఏడాది, రెండేళ్ళ పాపలు గోల చేస్తూ కనబడ్డారు.

వాళ్ళకు నాయకత్వం వహిస్తూ యముడు వాళ్ళ ముందు నిలబడ్డాడు.

బ్రహ్మకు కంగారు పుట్టి "ఏమైంది?'' అన్నాడు.

అయ్యా తమరు సృష్టించిన పిల్లలు పాలుదొరకక, దొరికిన పాలలో ఉన్న క్రిమికీటకాదులను హరాయించుకోలేక, చాలా మంది చచ్చి, నా దగ్గరకు వచ్చారు. "మేము అధర్మంగా ప్రాణాలు కోల్పోతున్నాం. మా సంగతేమిటి ధర్మరాజా?'' అని అడుగుతున్నారు. దీనిని బట్టి చూస్తే మీ సృష్టి అంతా వ్యర్థమని నాకు

అనిపిస్తోంది. మిమ్మల్ని అడిగి సలహా తీసుకుందామని వచ్చాను " వాపోయాడు యముడు.

మొదటిసారిగా బ్రహ్మకి భయం వేసింది. పెద్ద అలోచన సాగిస్తున్న వాడిలా బుర్ర వంచి తల గోక్కోబోయాడు. కింద ఆదినారాయణమూర్తి మంచి యోగ నిద్రలో కనిపించాడు. ఆయనను సలహా అడగాలంటే నిద్ర లేపాలి. లేపితే విసుక్కుంటాడేమో? వెధవది నిన్ను కమలంలో పెట్టి మోయడమే కాక నీబోడి సమస్యలకు సలహాలు కూడానా ?" అంటాడేమో అనే సందిగ్ధంలో పడ్డాడు బ్రహ్మ.

సరిగ్గా సమయానికి భక్తనారదుడు "నారాయణ నారాయణ" అంటూ వచ్చాడు.

ఆదినారాయణమూర్తి ఆవులించి " ఏం నారదా, ఇలా వచ్చావు ?" అన్నాడు.

నారదుడు "పైకి చూడండి " అంటూ వచ్చాడు.

ఇదే సమయం అనుకుని బ్రహ్మ "నాన్నా? నేను సృష్టించిన వాళ్ళంతా భూలోకంలో పాలు లేక వెంటనే చచ్చిపోతున్నారు. నా సృష్టి అంతా వృధా అయిపోతోంది. ఏం చెయ్యను?" అని నాలుగు ముఖాలతోనూ భోరుమని ఏడ్చాడు.

ఆదినారాయణమూర్తి కాసేపు ఆలోచించి "నాయనా? ఏడవకు. పాలు అనేవి ఎన్నాళ్ళ వరకు అవసరం ? మహా అయితే అయిదేళ్ళ వరకూ, అందుకుని డైరెక్టుగా ఆరో ఏట పుట్టే ఏర్పాటు చెయ్యి." అని సలహా ఇచ్చాడు.

వెంటనే భక్తనారద "భలే భలే ఆలోచన" అన్నాడు.

బ్రహ్మ నారదుణ్ణి ఒక్క కసురు కసిరి ఆదినారాయణమూర్తితో "అదెలా నాన్నా? అయిదేళ్ళ వాడు పుట్టడం అంటే తల్లి చావడమే కదా?" అని అడ్డుగా పాయింట్ లేవదీశాడు.

ఆదినారాయణమూర్తికి గాభరా పుట్టింది. ఇంతవరకూ తనిచ్చిన సలహాని కాదనడానికి దేవుళ్ళలో ఒక్కడికి సత్తా లేదు.

ఈ బెమ్మగాడికింత సాహసమా? అనుకున్నాడు..

"ఓరి నాయనా? నీకు మాత్రం బాల్యం ఏదిరా? నువ్వు అయిదు ముఖాలతో పుట్టేసరికి మీ అమ్మ లచ్చి (లక్ష్మి గాభరాపడింది) నాలుగు చేతులైతే ఉన్నైగాని నాలుగు ముఖాలకూ పాలు ఎలా? అప్పుడు నేను నిన్ను కమలంలో దాచి పెద్దయ్యాక బయటకు వదిలాను" అన్నాడు.



బ్రహ్మకి ఆదినారాయణమూర్తి పాయింట్ అర్థమైపోయింది.

"అయితే ఇప్పుడు నేను మొగాళ్ళ బొడ్లలో "కమలాలు సృష్టించాలా? " అని అడిగాడు అమాయకంగా.

ఆదినారాయణమూర్తి గాభరాగా "ఓరి నాయనోయ్ ! అది కాదురా దాని అర్థం. నువ్వుగాని మొగాళ్ళ బొడ్డుల్లో కమలాలు సృష్టిస్తే ఆ కమలాల్తో బస్సుల్లోనూ, రైళ్ళల్లోనూ, ఆఫీసుల్లోనూ మొత్తం సృష్టంతా గల్లంతైపోతుంది. నువ్వు పిల్లలని ఆరో ఏట పుట్టేట్టు చూడు. ఆ తర్వాత తల్లులు పోవడం చూసి సైంటిస్టులు కమలాల్లాంటివి వాళ్లే కనుక్కుంటారు. అందుకోసం వాళ్ళకి నోబుల్ ప్రైజులు, డాక్టరేట్లు, యు.జి.సి గ్రాంట్లు చాలా సౌకర్యాలు ఉన్నాయి. నువ్వేం బాధపడకు" అన్నాడు.

"మరి నాన్నా ?" అంటూ బ్రహ్మ ఏదో అనుమానం వెలిబుచ్చబోయాడు.

"పదిరకాల జన్మలెత్తి (అవతారాలు) తాతగారు అనుభవంతో చెప్తుంటే మధ్య నువ్వేంటి? చెప్పింది విను" అని తండ్రిని మందలించాడు భక్తనారద.

యముడు మాత్రం "అయ్యా? ధర్మం చెప్పేటప్పుడు నాకు చిక్కు కదా? నా ధర్మశాస్త్రంలో ఏం రాసుకోమంటారు?" అని అడిగాడు.

ఆదినారాయణమూర్తి కాసేపు ఆలోచించి "ఇన్‌ఫాన్సీ ఈజ్ నాట్ ఏ ప్రీరిక్విజేట్ ఇన్ హ్యూమన్ లైఫ్ ? అని రాసుకో." అన్నాడు.

అంటే బాల్య కౌమార, యౌవ్వన, వృద్ధాప్యాలలో బాల్యం కోసం కేటాయించిన చాప్టరు కొట్టేయ్ - అని అర్థం.

* * *

"అన్నయ్యా? అన్నయ్యా?" కుదుపుతో ఒక్కసారి తెలివి వచ్చేసింది.

నిద్ర లేచి చూద్దును గదా - మా తమ్ముడూ, మరదలూ మంచం చెరోపక్క నిలబడి నన్ను లేపుతున్నారు.

"ఏం జరిగింది ?" అని అడిగాను.

"నిద్రలో పెద్దగా నవ్వుతున్నావు. ఏం జరిగింది? కలేమైనా వచ్చిందా?" అని అడిగాడు మా తమ్ముడు.

"ఆ!" అన్నాను. మళ్ళీ నవ్వు వచ్చింది నాకు, నా కొచ్చిన కలంతా వాళ్ళకి చెప్పాను.

తనూ నాతో కలిసి నవ్వాడు. "అసలు కౌమారం కూడా లేకపోతే ఈ చదువులూ, బళ్ళూ అవసరం ఉండకపోను కదా?'' అన్నాడు నవ్వుతూ.

నాకు వెంటనే ఇన్స్పెక్టరు గుర్తుకొచ్చి గబగబా జిల్లా పరిషత్‌కి వెళ్ళాను. అక్కడ ఇన్స్పెక్టరు నాగురించే ఎదురు చూస్తున్నాడు.

"రావయ్యా రా! అదృష్టవంతుడివి. మీ స్కూలుకి రాష్ట్రప్రభుత్వం కంప్యూటర్ మంజూరు చేసింది. తీసుకో'' అని, దానికి కావలసిన పత్రాలు నా చేతుల్లో పెట్టాడు.

"అయ్యా? మరి స్కూలు బిల్డింగ్ మాటేమిటి?'' అన్నాను.

ఆయనకు నా మాట కొంచెం చిరాకు కలిగించింది. "ముందు ఇచ్చింది తీసుకోవయ్యా, లేనివి తరువాత చూసుకోవచ్చు'' అని నన్ను కసిరేశాడు.

నేను కంప్యూటర్ సెట్ పుచ్చుకుని మా ఊరు బయలుదేరాను. "ఇదెక్కడ పెట్టాలి?'' అన్న అలోచన తెగడం లేదు. ఇంతలో నాకొచ్చిన కలలో కమలం, అందులో బ్రహ్మ గుర్తుకొచ్చారు. కంప్యూటర్ ఎక్కడ పెట్టాలో నిర్ణయించుకున్నాను.

మర్నాడు ఊళ్ళో ఉన్న చెట్లన్నీ వెతికాను. ఎందుకంటే మేము ఎప్పుడూ పాఠాలు చెప్పుకుంటున్న చెట్టు తొర్ర చిన్నది. కంప్యూటరు పట్టదు.

ఊరికి కొంచెం దూరంగా పెద్ద మర్రిచెట్టు తొర్రతో సహా కనిపించింది. కాస్త ఊరికి దూరమైతే అయిందిలే చోటు దొరికింది కదా అని సంతోషించాను.

ఆరోజు ఊళ్ళో పెద్దలు, పిల్లలు ఆ మర్రిచెట్టు కింద సమావేశమయ్యారు.

ఎమ్. ఎల్.ఏ. గారి కోసం ఎదురు చూస్తున్నాం ఆయనొచ్చి కంప్యూటర్‌ను స్కూలుకి సమర్పిస్తారు. చెట్టుకింద నీడలో చాలా చల్లగా ఉంది. ఆకాశమంతా మబ్బులు పట్టి వాతావరణం ఆహ్లాదంగా ఉంది.

ఎమ్.ఎల్.ఏ. గారు వచ్చారు. అందరినీ ఉద్దేశించి మాట్లాడారు. ఆయనకు బహిరంగ సభలు అలవాటు కాబట్టి - "స్కూలు చెట్టు కింద ఉందేం?'' అన్న ఆలోచన రాలేదు.

కంప్యూటర్‌ని చెట్టు తొర్రలో ఆవిష్కరించి విద్యార్థులందరి చేతా చప్పట్లు కొట్టించుకున్నారు.

'ఈ శుభ సమయంలో నేనూ చాలా సంతోషిస్తున్నాను.' అన్నట్లు ఆకాశం కుంభవృష్టి కురిపించింది.

ఊరు దూరం అవడం వల్ల ఎవ్వరూ పారిపోలేకపోయారు. అందరూ తడిసిపోయారు.



కంప్యూటర్ చెట్టుతొర్రలోంచి వింత జనాన్ని నిమిత్తమాత్రురాలిలా చూస్తోంది.

* * *

ఆరోజు డి. ఇ. ఓ. ఇన్స్పెక్షన్ ఉంది. దాని కోసం వారం నుంచి విద్యార్థుల్ని తయారుచేస్తున్నాను. ఎంత తయారుచేసినా ఏదో బెదురు. ఈ రోజు దాటిపోతే మళ్ళీ రొటీనులో పడిపోతాను. ఫరవాలేదు. కానీ ఈ రోజు గడిచేదెలా ?

గబగబా తయారై స్కూలికి వచ్చేశాము. అంటే చింత చెట్టు కిందకి అప్పటికే తక్కిన మాస్టర్లూ (ఇద్దరే లెండి) పిల్లలూ వచ్చారు.

చుట్టుపక్కల అంతా శుభ్రం చెయ్యడం వల్ల చెట్టుకింద బడి అయినా చాలా కళగా ఉంది.

ఆ రోజు డి.ఇ.ఓ. గారి కని ఇంటి నుంచి తెప్పించిన కుర్చీ వేశాము. ముందున్న టేబులు ఒక కాలు బాగు చేసి నిలబెట్టడం వల్ల కొంచెం పొట్టిగా కనబడుతున్నా అందంగా ఉంది.

పిల్లల్ని నిలబెట్టి ప్రార్థన చేశాక కూర్చోమని చెప్పాను. పిల్లల చేత ఏదో వల్లె వేయిస్తున్నాము.

అంతలో డి.ఇ.ఓ. గారి జీపు వచ్చింది. అందులోంచి డి.ఇ.ఓ గారు, స్కూళ్ళ ఇన్స్పెక్టరు దిగారు.

డి.ఇ.ఓ. గారు హుందాగా నడిచి వచ్చి కుర్చీలో కూర్చున్నారు. కళ్ళ జోడు తీసి ముందున్న టేబులు మీద పెట్టారు. కాని టేబులు ఒక పక్కకి ఒరిగి, పొట్టిగా ఉండడం వల్ల, కళ్ళ జోడు జారుతూ వెళ్ళి కిందపడిపోయింది. కళ్ళ జోడు అలా పడిపోవడం చాలా అవమానం అనిపించింది డి.ఇ.ఓ. గారికి.

ఇన్స్పెక్టరు గారి వైపు తిరిగి పిల్లల్ని ప్రశ్నలు వేయమన్నట్టు చెయ్యి ఊపారు.

స్కూళ్ళ ఇన్స్పెక్టరు ఏవో ప్రశ్నలు వేశాడు. పిల్లలు వాటికి అటూ ఇటూ సమాధానం చెప్పారు.

డి.ఇ.ఓ. గారికి అసహనంగా ఉంది. ఇవన్నీ రొటీను పనులే ... ఆయనకి కావలసింది అది కాదు.

హెడ్‌మాస్టర్ని మాస్టర్లని, సీరియస్‌గా ఏదో వంకతో దెబ్బలాడి ఇన్స్పెక్షన్ రిపోర్టులో "నాట్ శాటిస్‌ఫైడ్ '' అని రాసుకుంటే తను పని చేస్తున్నట్టూ ఎదుటి వాళ్ళకు తనంటే కాస్త హడలు పుట్టేట్టూ - చేసినట్టు అవుతుందని అతని భావన.

కాని అలా చెయ్యాలంటే ఏదో వంక దొరకాలి కదా? అది దొరికింది.

స్కూళ్ళ ఇన్‌స్పెక్టరు ఇన్‌స్పెక్షన్ అంతా అయ్యాక ఆఖరున "మీ స్కూలుకి కంప్యూటర్ ఇచ్చాం కదా? ఏదీ?" అని అడిగారు.

నేను ఆయనకి సమాధానం చెప్పేలోపలే డి.ఇ.ఓ "ఈ స్కూలుకి కంప్యూటర్ సప్లై చేశారన్నమాట! ఏదయ్యా అది?" అని అడిగాడు. ఆయన గొంతులో దొరికాడ్రా వీడు అన్న భావన వ్యక్తం అవుతోంది. నాకు ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. కాని నిజం చెప్పాలి కదా? అందుకని - "మా ఇంట్లో ఉందండీ ..." అని నేను చెప్పడం పూర్తి కానేలేదు.

ఆయన అగ్గిరాముడైపోయాడు.

"స్కూళ్ళకి సప్లైచేసేవి ఇంట్లో పెట్టుకోవడానికి కాదోయ్! ప్రభుత్వం సొమ్ము నీ స్వంత సొమ్ము కాదు. నీ ఇష్టం వచ్చినట్టు వాడుకోడానికి! నీమీద డిసిప్లినరీ ఏక్షన్ తీసుకొవాలి.. ఒక్కడి మీద యాక్షన్ తీసుకుంటే మొత్తం నీలాంటి వాళ్ళందరికీ బుద్ధి వస్తుంది" అని సీరియస్‌గా జీపు ఎక్కి వెళ్ళిపోయాడు.

'ఇదెక్కడ లేనిపోని తద్దినం నెత్తిమీద కొచ్చిందిరా' అనుకుంటూ ఇంటికి వచ్చాను.

నాలుగు రోజుల తరువాత "ప్రభుత్వం సొమ్ము ఇంట్లో వాడుకుంటున్నందుకు నీ మీద చర్య ఎందుకు తీసుకోకూడదు.?" అంటూ డి. ఓ లెటర్ వచ్చింది.

అది పట్టుకొని డి. ఇ. ఓ ఆఫీసుకు వెళ్ళాను. ఆయన నాకు కలుసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ని కలిశాను. ఆయన నన్నొక దేశద్రోహిలా చూసి, నే చెప్పేది వినకుండా ఆయన చెప్పేది వినేటట్లు చేశాడు. ఆయన మాటల్లో నాకు అర్థమయ్యింది ఏమిటంటే ఈ విషయం ఎమ్. ఎల్. ఏ గారి దగ్గరకు పోయిందనీ, ఈ విషయంలో ఎవ్వరూ ఏమీ చెయ్యలేరనీను!

నాకు మనుషుల మీద అసహ్యం వేసింది. ఏం జరిగితే అది జరుగుతుంది లెమ్మని నోరు మూసుకుని కూర్చున్నాము.

ఎమ్. ఎల్. ఏ గారు ఈ విషయంలో విచారం వెలిబుచ్చాడు. దేశానికి తాము తమ పార్టీ ఎంతో చేద్దామనుకుంటున్నామనీ, కాని కొందరు (నాలాంటి) స్వార్థపరులు పూర్తిగా ప్రజలకు సహాయాలను అందకుండా చేస్తున్నారనీ, ఈ విషయాన్ని ఇంతటితో వదలదలుచుకోలేదనీ. ప్రజలందరికీ తెలియాలంటే - ప్రజాప్రతినిధుల సభలో - అసెంబ్లీలో - ఈ విషయాన్ని పెడుతున్నామనీ, తెలియజేస్తూ - ఈ విషయం తీవ్రమైనదిగా పరిగణించడమైనదంటూ - పత్రికాముఖంగా ప్రకటించారు. జరుగుతున్నవన్నీ చూస్తూ స్తబ్దుగా ఉండడం మినహా నేనేమీ చెయ్యలేకపోతున్నాను.

అసెంబ్లీ మొదలైంది. రెండురోజుల తరువాత అసెంబ్లీలో ఈ విషయం ప్రస్తావనకొచ్చింది. ప్రతిపక్ష సభ్యులు పాలకపక్షం చేతకానితనం వల్లే ప్రజల సొమ్ము కొందరు స్వంత ఆస్తుల్లా వాడుకుంటున్నారని తీవ్రంగా అధిక్షేపించారు.

పాలకపక్షం 'మా ఘనత వల్లే ఇలాంటి దేశద్రోహుల్ని పట్టుకోవడం జరిగిందని' బెట్టుపోయారు.

మొత్తానికి అసలు విషయం వదిలేసి పాలకపక్షం, ప్రతిపక్షం చెప్పులు విసురుకున్నారు. ఒకరిమీద ఒకరు కలబడ్డారు. చొక్కాలు చింపుకున్నారు. సభాపతి అందరినీ శాంతంగా ఉండమన్నందుకు రెండు పక్షాల సభ్యులు కలిసి ఆయన్ని తగిన విధంగా సత్కరించారు.

ప్రతిపక్ష సభ్యులు, గత ముప్పై ఏళ్ళుగా సంప్రదాయానుసారంగా చేసే పని - సభ నుంచి వాకౌట్ చేశారు.

మర్నాడు ముఖ్యమంత్రి కలుగజేసుకుని - ఈ విషయంలో తప్పు జరిగిందనీ, ప్రజల సొమ్ము దోచే స్వార్ధపరుల్ని ప్రభుత్వం క్షమించదనీ, ఆ స్కూలు మాస్టారు చేత సభాముఖంగా క్షమాపణ చెప్పిస్తామనీ, ఈ విషయం మీద తగు చర్య తీసుకుంటామనీ, హామీ ఇచ్చారు.

ఇది జరిగిన నాలుగు రోజులకు నేను అసెంబ్లీలో ప్రజాప్రతినిధుల మధ్య నిలుచున్నాను. నేను కంప్యూటర్ ఇంట్లో పెట్టుకోడానికి కారణాలు చెప్పాలని ప్రతిపక్ష సభ్యులూ, అక్కర్లేదు- క్షమాపణ చెప్పాలని పాలకపక్ష సభ్యులూ, వాగ్వివాదాలు, పాదరక్షల సరసాలు, వాకౌట్‌లతో రెచ్చిపోయారు. ఆ రోజు నాకు క్షమాపణ చెప్పుకునే అవకాశం రాలేదు.

మర్నాడు ముఖ్యమంత్రి నేను సంజాయిషీ చెప్పుకోడానికి అవకాశం ఇచ్చారు.

"అయ్యా! మాది ఒక పల్లెటూరు. మాకున్న బడి రెండేళ్ళ క్రితం కూలిపోయింది. ఆరోజు నుంచి మాకు బడి లేదు. మేము చెట్టుకింద పాఠాలు వెళ్ళదీస్తున్నాం... పెద్దలందరూ బడి కట్టడానికి అనుమతి ఇచ్చారు. కాని బడి కట్టే కాంట్రాక్టు కరణంగారి కాంట్రాక్టరుకి రావాలని కరణంగారు, ప్రెసిడెంటుగారి కాంట్రాక్టరుకి రావాలని ప్రెసిడెంటుగారు ప్రయత్నించారు. అందులో వారి ప్రయత్నం ఏమిటంటే ఎదుటి వాడికి రాకుండా చూడడమే! ఈ విధంగా మాకు కొత్త బడి కట్టడం కుదరలేదు.

ఈలోగా ప్రతి స్కూలుకూ మంత్రిమహోదయులు ఒక కంప్యూటర్ బహూకరించారు. మా స్కూలు కంప్యూటర్ నేను తీసుకున్నాను. దానిని ఎక్కడ పెట్టాలో తెలియక ఊరికి దూరంగా మర్రిచెట్టు తొర్రలో పెట్టి ఆవిష్కరించాము. దాని ఆవిష్కరణ మాన్య ఎమ్.ఎల్.ఏ. గారు చేశారు. కంప్యూటరు పని చెయ్యాలంటే దానికి పవరు సప్లై - కరెంటు కనెక్షన్- ఉండాలి. మాఊరిలో ఏ చెట్టు తొర్రకి ఆ సౌకర్యం లేదు. అందుకని విద్యార్ధులకి దాని ఉపయోగం తెలియరాలేదు. కంప్యూటర్ పాడవకుండా దాన్ని నా ఇంట్లో భద్రంగా దాచాను. స్కూలు బిల్డింగ్ తయారవగానే స్కూలుకి తరలిస్తాను. ఈ విషయంలో నావల్ల ఏదైనా తప్పు జరిగి ఉంటే నన్ను క్షమించగలరు.''

నా క్షమాపణ విన్న అసెంబ్లీ - నేను కంప్యూటర్ ఇంట్లో పెట్టుకుని - సమర్ధించుకునేందుకుకే స్కూలు బిల్డింగ్, పవర్ సప్లై అంటూ సాకులు వెతికాననీ, ఇది ప్రభుత్వాన్ని ధిక్కరించడమేననీ, నా తలపొగరు అణిచే చర్యగా నన్ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తీర్మానించి- ఇది అవినీతి మీద పాలకపక్ష విజయంగా పొగిడి ఆ రోజు సభ చాలించారు.

మర్నాడు పాలకపక్షం దేశంలో అవినీతిని ఏ విధంగా నిర్మూలించిందీ పేపరు ప్రకటన చేసింది.

ప్రతిపక్షం తమ ఒత్తిడి వల్లే అవితీతి నిర్మూలితమైందని పేపరులో ప్రకటించింది.

ఇంటికెళ్ళిపోతే రేపటి నుంచి ఏం తినాలో అర్ధంకాక నేను మాత్రం నిరాశతో, అవమానంతో టాంక్‌బండ్ వైపు నడిచాను.

★ ★ ★

హుస్సేన్‌సాగర్‌లో దూకిన నేను తెలివి వచ్చేసరికి మా ఇంట్లో ఉన్నాను. నా మంచం చుట్టూ నా భార్యా పిల్లలు ఉన్నారు. దూరంగా నా తమ్ముడు కూర్చుని ఉన్నాడు. నేను దూకడం చూసిన ఒకతను తనూ దూకి నన్ను ఒడ్డుకి చేర్చాడుట. నా జేబులో ఉన్న అడ్రసు తీసుకుని టాక్సీమీద మాఊరు చేర్చాడుట. మా తమ్ముడు కూడా ఆ వెనకే వచ్చాడనీ, నాకు స్పృహలేక మంచం మీద రెండు రోజులుగా ఉన్నాననీ - అంది మా ఆవిడ కాస్త బెక్కుతూ, కాస్త ముక్కుచీదుతూ..

"అదేంటన్నయ్యా - అలా చేసావు? ఉద్యోగం పోతే పోయింది. ఎలాగోలా బతకవచ్చు. నువ్వు చార్జీ అప్పజెప్పి టౌన్ వచ్చేయ్. నీకు నేను ఒక ఇల్లు అద్దెకు చూస్తాను. నీకు బ్రతుకు తెరువు దొరికే దాకా నేను లేనా? బాధపడకు'' అని నన్ను ఓదార్చి మర్నాడు పట్నం వెళ్ళిపోయాడు నా తమ్ముడు.



కొత్త మాస్టారు వచ్చారు. వచ్చిన అతనికి చార్జి ఇచ్చేసాను. అన్నీ అప్పజెప్పి కంప్యూటర్ అప్పజెప్పాను. అతను కంప్యూటర్ తీసుకోవడానికి నిరాకరించాడు.

చూడండి మాస్టారూ! మీ ఉద్యోగం ఎందుకు పోయింది? కంప్యూటరు ఇంట్లో ఉంచుకోవడం వల్ల! ఇప్పుడు అది మీరు నాకు ఇస్తున్నారు. నేనెక్కడ పెట్టుకోను. స్కూలు బిల్డింగ్ ఏదీ? కాబట్టి నేను దాన్ని ఇంట్లో పెట్టుకోవాలి. అంటే నేనూ ఉద్యోగం పోగొట్టుకోవాలి. మిమ్మల్ని చూసి బుద్ధి తెచ్చుకోకపోతే నాకు బుర్ర లేనట్టే కదా! అందుకని దయతో ఈ విషయంలో నన్ను ఇబ్బంది పెట్టకండి.'' అని ఆయన కంప్యూటరు పుచ్చుకోలేదు.

అది ఎవరికి అప్పజెప్పాలి? ఏంచెయ్యాలి? ఇదే పెద్ద సమస్య అయి కూర్చుంది.

రెండుసార్లు డి.ఇ.ఓ. ఆఫీసుకు వెళ్ళాను కాని డి.ఇ.ఓ కాని, స్కూళ్ళ ఇన్‌స్పెక్టరు కానీ లేరు.

అన్నింటికీ శరణ్యం ఊరి ప్రెసిడెంటు... ఆయన దగ్గర కెళ్ళి విషయం చెప్పాను.

"చూడు పంతులూ! నువ్వన్నది నిజమే. కాని అది నా దగ్గరుందనుకో- ప్రజలు నువ్వూ, నేనూ, కూడబలుక్కున్నామంటారు. వచ్చేసారికి అపోజిషనోళ్లు ఈ కంప్యూటరుని అడ్డు పెట్టుకుని నన్ను ఓడించేస్తారు. నీకు ఉద్యోగం లేకపోతేనే చచ్చిపోదామని చూశావు కదా? మరి పదవి పోతే నేనేం చెయ్యాలి? నీలాగే.. అది సరేలే కానీ, నువ్వు ఇంత బతిమాలుతున్నావు కాబట్టి - ఒక పని చెయ్యి. వెళ్ళి కరణాన్ని బతిమాలు - కరణం దగ్గర సగం సామాను- నా దగ్గర సగం సామాను పెట్టు - నాకు అపోజిషను కరణం కాబట్టి నామీద ఏమైనా అంటే సగం నీ దగ్గరా ఉందిగా అనచ్చు ... ఇద్దరూ సమతూకంలో ఉంటాం'' అన్నాడు తాపీగా.

ఇది జరిగే పని కాదని నాకు అర్ధమయింది. ఎందుకంటే కరణం, ప్రెసిడెంటుతో కలవడానికి ఒప్పుకోకపోవచ్చు. అయినా నాకు రెండోదారిలేక.. ఏమైతే అదే అవుతుందని కరణంగారి దగ్గరకు వెళ్ళాను. ఆయనకీ విషయం చెప్పాను. కానీ నేను ప్రెసిడెంటు గారి దగ్గరకి వెళ్ళిన విషయం చెప్పలేదు. కరణం కాసేపు ఆలోచించి - 'చూడు పంతులూ! నువ్వన్నది నిజమే. అది నా దగ్గరుందనుకో ప్రజలు..' అంటూ - ప్రెసిడెంటు ఏమన్నాడో అదే విధంగా ప్రెసిడెంటును ఇరికిద్దామని చూశాడు. ఆలోచన విషయంలో కవల పిల్లల్లాగా - రాజకీయాల్లో బద్ధ శత్రువుల్లా ప్రవర్తించారు.

సరే - ప్రెసిడెంటు నడిగి చెప్తానని చెప్పి ప్రెసిడెంట్‌గారింటికి వెళ్ళి కరణం

గారి సమ్మతి తెలియజేసాను.

మర్నాడు సి.ఆర్.టి. డిస్ప్లే వగైరా - సగం వస్తువులు కరణంగారి ఇంటి దగ్గరా, సగం వస్తువులు - కంప్యూటరు బోర్డు వగైరా ప్రెసిడెంటు గారి ఇంటి దగ్గరా ఇచ్చేసి తేలికపడ్డ హృదయంతో ఇంటికొచ్చేసాను. రెండు మూడు రోజుల్లో ఊరు వదిలేసి వెళ్ళిపోవాలి అనే నిర్ణయానికి వచ్చేసాను. కాని మర్నాడు పొద్దున్నే పది గంటలకి - ప్రెసిడెంటుగారూ, కరణంగారూ మా ఇంటికి వచ్చారు. వాళ్ళ వెనుక కంప్యూటరు సెట్టు పట్టుకుని పాలేర్లు ఉన్నారు.

రాగానే అందుకున్నాడు ప్రెసిడెంటుగారు. "ఏం పంతులువయ్యా? నువ్వు చెడిందే కాకుండా ఊళ్ళో అందరినీ చెడగొడదామనుకున్నావా? ఏ మూహుర్తాన ఈ కంప్యూటరు పట్టుకొచ్చావో ఆ నిముషం నుంచి అన్నీ కష్టాలే! నీ ఉద్యోగం ఊడగొట్టుకున్నావు. అక్కడితో ఊరుకున్నావా? అది మా ఇద్దరికీ అంటగట్టి మా కొంపలు కూల్చావు."

"అదెలాగండీ?'' అన్నాను అదుర్దాగా

అదెలాగేటయ్యా? కరణాల్ని పంచాయతీల్ని రద్దుచేస్తూ శాసనం చేసిందయ్యా రాష్ట్రప్రభుత్వం! ప్రభుత్వానికి ఎలా తెలిసిందో, కంప్యూటర్ మా ఇంట్లోకొచ్చిందని? నాయనా ఈ కంప్యూటరు మా ఇళ్ళల్లో ఉంటే ఇంకే అనర్థాలు జరుగుతాయో? నువ్వే పుచ్చుకో ... నీకు నష్టపోవడానికేం లేదుగా?'' అని చెప్పి కంప్యూటర్ని నా మొహానికి కొట్టిపోయారు ఇద్దరూ.

కథ మళ్ళీ మొదటికొచ్చేసింది. కంప్యూటర్ని ఏం చెయ్యాలి? దాంతోనే తెగింపు వచ్చేసింది. 'వెళ్ళి ఎమ్.ఎల్.ఏ. గారికిస్తే ? అది మంచిపని' అనుకుని మర్నాడు ఎమ్.ఎల్.ఏ. గారింటికి వెళ్ళాను. ఆయన లేరు. కాబట్టి విషయం మాట్లాడడం కుదరలేదు.

అక్కడ దగ్గరలోనే ఎమ్. ఎల్. సి గారుంటే వాళ్ళింటికి వెళ్ళాను. ఆయన చాలా మంచివాడు. రాజకీయాల్లో బాగా పండిపోయినవాడు. అందునా మాస్టర్ల తరుపున ఎన్నికైన ఎమ్.ఎల్.సి! నా కష్టమంతా విని చాలా సానుభూతి చూపించాడు.

"సర్లే - నేనెలాగో సర్దిచెప్పుకుంటాను, తీసుకొచ్చి నా ఇంట్లో పెట్టు '' అన్నాడు.

అంత తొందరగా ఈ కంప్యూటరు వదుల్తుందని నేను అనుకోలేదు. సంతోషంతో అన్ని సామాన్లు సర్దుకుని రెండురోజుల తరువాత కంప్యూటరు తీసుకుని ఆయన ఇంటికెళ్ళాను.



ఆయన వరండాలో కూర్చుని ఉన్నాడు. గేటు వేసి ఉంది. దర్వాన్ వచ్చి - వెళ్ళిపొమ్మన్నట్లు చెప్పాడు. నాకు అర్థం కాలేదు. నసుగుతూ అక్కడే నిలబడ్డాను. అతి సౌమ్యుడూ, రాజకీయవేత్తా అయిన ఎమ్.ఎల్.సి మండిపోతూ గేటు దగ్గరకి వచ్చాడు.

"నిన్ను రానివ్వడం నాదే తప్పు పంతులూ? నిన్నేదో ప్రజాప్రతినిధులు అవమానం చేశారని వాళ్ళ మీద కక్ష ఇలా సాధిస్తావన్నమాట? నీకు తెలుసుకదా అదెంత దరిద్రపు వస్తువో? - అది తెచ్చి నాకంటగడతావా? అది పుచ్చుకుంటా నంటేనే ఇంత అనర్థం జరిగిందే - అది పుచ్చుకుంటే ఇంకేం జరిగేదో? వెళ్ళు వెళ్ళు - నీముఖం నాకు చూపించకు!'' అని గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపో యాడు.

అసలేం జరిగిందో అర్థంకాలేదు. కంప్యూటరు పట్టుకుని వెనక్కి తిరిగాను. నాకేం తెలుసు, లెజిస్లేటివ్ కౌన్సిలు ముందు రోజే రద్దయిందని?

ఇంకెవర్నీ ఈ విషయంలో అడగదలుచుకోలేదు. మర్నాడు తిన్నగా డి.ఇ.ఓ. ఆఫీసుకు వెళ్ళాను. చాలాసేపు చూసిన తరువాత డి.ఇ.ఓ గారిని కలిసే అవకాశం కలిగింది. ఆయనతో విషయమంతా చెప్పాను.

ఆయన చాలా ఇబ్బందిగా మొహం పెట్టి ఇలా అన్నాడు.

"చూడు పంతులూ ! ఆ కంప్యూటరు ఏ ముహుర్తాన తీసుకున్నావో అన్నీ అపశకునాలే! అది తీసుకున్న నెల రోజులకి నీ ఉద్యోగం పోయింది. అది పుచ్చుకున్న నాలుగు రోజులకి ప్రెసిడెంటు, కరణాల పోస్టులు పోయాయి. అది పుచ్చుకుందామని అనుకున్నందుకే ఎమ్.ఎల్.సి గారి పదవిపోయింది. ఇవన్నీ చూస్తుంటే ఆ కంప్యూటరు ఉండడమే అపశకునమేమో! ఇప్పుడు నువ్వు దాన్ని తెచ్చి డి.ఇ.ఓ. ఆఫీసులో అప్పచెప్తే మొత్తం ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు రద్దయ్యే అవకాశం ఉంది. చూడు- నీ ఉద్యోగం పోయినా నలుగురికి ప్రయివేట్లు చెప్పి బ్రతకగలవు. కాని నా ఉద్యోగం పోతే?....నాకు చదువు చెప్పడం కూడా రాదు!.. గత పదేళ్ళుగా సాటిస్‌ఫాక్టరీ, అన్‌సాటిస్‌ఫాక్టరీ అని రాయడం, సంతకం చెయ్యడం తప్ప నాకు ఏం రాదు. నన్నెందుకు బాధపెడతావు? ఈ కంప్యూటరు నువ్వే ఉంచుకో .... ఆ విషయంలో నేను ఇక ముందు కలుగజేసుకోను. నేనే కాదు. ఎవరూ కలుగుజేసుకోరు. సరేనా? అది నీ దగ్గరే ఉంచుకో''... అంటున్న డి.ఇ.ఓ గారిని అవాక్కయి చూడడం తప్ప నేనేం చెప్పలేకపోయాను.

ఈ విధంగా ఆ కంప్యూటరు నాతో పాటు మా తమ్ముడి ఇంటికి చేరింది.

★

# బేసిక్ ఇన్‌స్టింక్ట్

శ్రీవారి సొద.

శ్రీమతి పుట్టింటికి వెళ్ళింది. అంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తిరిగి ఇంటిలో జన్మిస్తాయి.

అంటే స్నేహితుల్ని పిలిచి ఇంటిలో పేకాట పెట్టడం, పేకాటలో గెలిచిన వాళ్ళ చేత మూడొందలో నాలుగొందలో ఖర్చు పెట్టించి, చిన్న మందు పార్టీ ఏర్పాటు చేయడం, స్నేహబృందంతో కలిసి చేసే సామాన్య కాలక్షేపపు పనులు!

కాని పేకాటకి కూడా కోరమ్ ఉండాలి. మినిమమ్ ఐదుగురు ఉంటేగాని ఆటకి మజారాదు. ఏ ఇద్దరో మాత్రమే వచ్చి కోరమ్ పూర్తికాకపోతే, పక్కనున్న వీడియోషాపుకి వెళ్ళి డెమిమూర్, స్టోన్ సినీమాలు తెచ్చుకు చూడడం పరిపాటి... ఆ సినీమాలు స్నేహితుల మధ్య కూర్చుని చూస్తున్నంత సేపూ మజాగానూ, మస్తుగానూ ఉంటుంది.

కాని ఆ స్నేహితులు మనల్ని వదలి వెళ్ళిపోయాక.. ఇంటిలో వంటరితనం మనస్సుని కుమ్మరి పురుగులా దొలిచేస్తుంది.

డెమిమూర్ టాప్‌లెస్ డాన్స్ మనసుని పీడిస్తుంది. స్టోన్ బ్రాసియర్ మృదుత్వం మురిపిస్తుంది. అపుడు నిస్సహాయత అంటే ఏమిటో అర్థం అవుతుంది.

ఇంక పేకాటవల్ల గాని, మందువల్లగాని, కాలం గడవదు అని అర్థం అవుతుంది. ఒకపుడు తొందరగా పెళ్ళి చేసేసారని విసుక్కోబడ్డ పెద్దవాళ్ళు... ఈ రోజు దేవతల్లా కనిపిస్తారు. ఈ సమయంలోనే పోస్టుమేన్ గ్రేట్‌మేన్‌లా కనబడతాడు. ఆఫీసునుండి ఇంటికొచ్చి తలుపు తీస్తున్నపుడల్లా ఒక కార్డో కవరో నేలమీద పడి ఉండకపోతుందా? శ్రీమతి.. సమాచారం లేకపోతుందా? అన్న ఆశ మనసులో మొదలై ఆ కార్డో, కవరో నేలమీద కనబడకపోయేసరికి మనసులో ఆత్రం నరాలకి చేరుకుంటుంది. అది విసుగ్గా మారి, మావగారి మీద కోపంగా మారుతుంది.

ఇవన్నీ నెమ్మదించి ఆరాటం అనే రోగానికి స్వస్థత చేకూరాలని, ఫోటోలు అనేవి భగవంతుడు పెట్టాడు. ప్రతివాడి పెళ్ళాం మొగుడికి అందకత్తే కదా,



అక్కచెల్లెళ్ళ మధ్య, ఆవిడ అలవోకగా నవ్వినట్టు అనిపిస్తుంది. అపుడు వొదినెలు మరదళ్ళ హాస్యాలు జ్ఞాపకం వచ్చి మనసుని మురిపించి, వాళ్ళమీద మనసుపోయే ప్రమాదం ఉంది.

కొంతసేపటికి తిరగవేస్తున్న ఆల్‌బమ్ అంత తృప్తి కలిగించకపోవచ్చు, ఎందుకంటే అందులో జీవంలేదు కదా? అపుడు శ్రీమతి మంచం మీద కూర్చుని చిలిపిగా "ఏంకావాలి"? అని అడిగే ప్రశ్న జ్ఞాపకం వస్తుంది.

ఏం కావాలన్నా వందమైళ్ళ దూరంలో ఉన్న శ్రీమతికి తెలీదు కదా అని విచారించక తప్పదు.

ఈపైన చెప్పిన ఎఫెక్ట్స్ అన్నీ ఆఫీసుపని మీదపడి, రాసిన డ్రాఫ్టుల్లో తప్పులు దొర్లి, ఆఫీసరు దృష్టికివెళ్ళి, చివాట్లుగా రగిలి, నిజం తెలిసి జాలిగా కరిగి, మనమీద రెండ్రోజుల సెలవు రూపంలో వర్షించే సరికి, మనకి సిగ్గేస్తుంది 'పర్వాలేదుసార్' అని, ఆఫీసర్ బలవంతంమీద లీవు పుచ్చుకుని అత్తారింటికి వెళుతున్నట్టు ఆఫీసులో ఫోజుకొట్టి గబగబా ఇంటికొచ్చి, తలుపులాగితే... కనబడింది ఉత్తరం... కొంచెం కిందకి వంగేసరికి అర్థం అయింది అది మావగారి చేతిరాత అని.

తీసి చదివితే ఇంకేముంది. 'రేపు సింహాద్రికి వస్తోంది... స్టేషన్‌కు రా, మర్చిపోకు' అని ఉంది.

మర్నాడు స్టేషన్‌కు నేను తొందరగా వెళ్ళానో తెలీదు, రైలు ఆలస్యంగా వచ్చిందో అర్థంకాదు. మొత్తానికి రైలు వచ్చింది.

అందులోంచి సూటుకేసు, వైరుబుట్ట పట్టుకొని దిగిన పైలెట్‌లాంటి బావమరిదిని చూసి వళ్ళు మండింది. భీముడి దగ్గర గద అరువుచ్చుకుని వీడి బుర్ర పగలగొట్టాలని అనిపించింది. తోడు లేకుండా ఆడపిల్లని రైలుప్రయాణం చెయ్యనివ్వని మావగారి ఆదర్శం మీద చిందులేసేంత చిరాకు వేసింది.

వీడి వెనకాలే మెల్లగా దిగిన శ్రీమతిని చూసేసరికి, అప్పటివరకూ కోపం తెప్పించిన వాళ్ళందర్నీ క్షమించేసాను.

మావగారు కొత్తచీర పెట్టినట్టున్నారు. అది కట్టుకుని వాలుజడ తలనిండా మల్లెపూలు పెట్టుకుని, భోజనం తర్వాత తాంబూలం వేసినట్టుగా ఉంది, ఆ ఎరుపు ఇంకా పెదాల్ని విడలేదు. చిగురుటాకులా ఉన్న శ్రీమతిని చూసి ముచ్చటేసింది. నవ్వి తల ఎగరేసాను. తనూ నవ్వుతూ 'ఓకే' అంది.

"ఏమిటక్కా ఓ.కే అంటున్నావ్" అని అడిగాడు..... బావమరిది రాక్షసుడు

వెనక్కి తిరిగి.

"ఎదురుగా చూసుకు నడూ, ఎవర్నైనా గుద్దేస్తావ్" అంది శ్రీమతి వాడివేపు చూసి, అంతేగాని ఓ.కే కి అర్థం చెప్పలేదు. అపుడు నాకు ఒళ్ళుమండి-

"ఏంవొయ్ బామ్మరిదీ ఇక్కడనుండి ఇలాగే వెళ్లిపోతావా"? అని అడిగాను.

"లేదు బావా మూడ్రోజులుండి వైజాగ్‌చూస్తా" అన్నాడు బూచి బామ్మరిది.

"మీ కుటుంబంలో మీ అక్కతప్ప, పోజిటివ్ ఆటిట్యూడ్ ఉన్నవాళ్ళు ఒక్కరూ లేరోయ్" అన్నాను కసిగా.

మొత్తానికి 'ఓ.కె' సంకేతాన్ని మర్చిపోయాడు బండబామ్మరిది. కాని ఓ.కె, సంకేతం గురించి చెప్పకపోతే ఎలా? సస్పెన్స్ అయిపోదూ? అలా కాకుండా ఉండాలంటే చెప్పాలి. తేనెమనసులు చిత్రంలో ఒక మహాకవిగారు రాసిన పాటుంది. నెలకు ముప్పై రోజులు జీతం పూటపూటకు పని ఉంటుంది. నాలుగు రోజులు సెలవుంటుంది. "ఆ సెలవుల్లో మేం ఏంచేయాలి?" అంటూ పళ్ళు ఇకిలిస్తాడు కృష్ణ" "మా కనుసన్నలలో మెలగాలి" అంటూ చిలిపిపోతుంది సుకన్య.

అంటే వాళ్ళు మనకి సెలవు పెట్టేసినా సరే మనం వాళ్ళ కనుసన్నలలో మెలగాలి. ఇక్కడా అంతే. శ్రీమతి సెలవు పెట్టేసిన రోజున, ఈ కూర తరగండి... ఇవాళ నేను వండలేను... హోటలుకి పదండి. ఇది చెయ్యండి. అది చెయ్యండి అని మన ప్రాణాలు తోడేసి అంతా అయాక, మంచం మీద మీకు మీరే మాకు మేమే అన్నట్టు దూరంగా జరిగి పడుకుంటుంది. ఏ ముద్దూ ముచ్చటా ఉండదు. అదే నా బాధ. అందుకే ముద్దూ ముచ్చటకీ ఓ.కే... అనే సంకేతం పెట్టుకున్నాం. లేకపోతే ఇంతా కష్టపడి స్టేషనుకి వెళతే, ట్రాజిడీ అవడం నేను భరించలేనని, శ్రీమతికి బాగా తెలుసు.

శ్రీమతి యెద

వంట వండుతున్నంతసేపూ కిచెన్ దగ్గర తారట్లాడే ఆయన్ని చూస్తే నవ్వు వచ్చేది. ఎందుకంటే, ఏదో వంకతో ఆయన పట్టిన పట్టు విడిపించుకోడానికి చాల కష్టపడుతున్నట్టు ప్రవర్తించవలసి వచ్చేది. స్నానం చేస్తున్నంతసేపూ బాత్రూము చుట్టూ తారట్లాడడం చూసి అనేకమైన చిలిపి ఆలోచనలు వచ్చేవి.

అందులో ఒకటి చటుక్కున బాత్రూము తలుపు తీసి నీళ్ళు చల్లడం. నీళ్ళుమీద పడ్డ తర్వాత ఆయన మొండితనం పెరిగి తారట్లాడడం ఆపేసి బాత్రూమ్ డోరుదగ్గరే 'బైటకిరా చెప్తాను' అని మొండిగా బైటాయించేవారు.

ఆయన్ని యేమార్చి వంటికి చీర చుట్టుకుని చటుక్కున బెడ్‌రూములో దూరి తలుపేసుకోవాలి. ఈ విషయంలో ఏమాత్రం ఏమరిపాటుచూపినా ఆయన కూడా బెడ్‌రూములోదూరి ఈ చీర కట్టుకో, ఈ జాకెట్టు వేసుకో ఎక్కువగా ఎలాస్టిక్ వాడడం వల్ల శరీరం మీద నల్లగా కమిలినట్టు మచ్చపడుతుంది. కాబట్టి బ్రా లేకుండా జాకెట్టు వేసుకో, నీకు హాయి నాకూ హాయి' అంటూ సలహాలతో చీర కట్టుకునే కార్యక్రమాన్ని ఒకంతట పూర్తికానివ్వరు.

అఫ్‌కోర్స్ ఏరోజైనా ఆయన తారాట్లాడకపోయినా, చీర తొందరగా కట్టేసుకున్నా ఏదో వెలితి మనసుని దొలిచేసేది.

ఆఫీసుకు తయారై స్కూటరు తాళాలు తీసుకుని బైటకి వెళ్ళి 'తలుపేసుకో వెళుతున్నాను' అని చెప్పే ఆయన్ని వెళ్ళనివ్వకుండా చెయ్యాలి అనిపించి, 'ఉండండి వస్తున్నా' అని ఆయన్ని ఆపి పరిగెత్తుకువచ్చి "ఏమిటి ఇలా దువ్వుకున్నారు, అని క్రాపు చెరిపేస్తే సీరియస్‌గా నన్ను చూసి మళ్ళీ లోపలికి వెళ్ళి జుత్తు దువ్వుకుని బైటకి వచ్చి...

"హాస్యాలాడకు టైమైపోతోంది" అంటూ నా రెండు జబ్బలూ పట్టుకుని పక్కకి లాగి గుమ్మందాటి వెళ్ళే ఆయన్ని చూస్తే ఒలంపిక్స్‌లో పోల్‌వాల్ట్ చేసేవాళ్ళు జ్ఞాపకం వస్తారు. 'వచ్చి వారం రోజులైంది. వచ్చేయమని ఆయనా ఉత్తరం రాయరు, పంపేద్దామని నాన్నా అనుకోరు. సాయంకాలం మల్లెపూలు తలకెక్కేసరికి మనసు శ్రీవారి వడిలోకి పారిపోతోంది. గతంలో శ్రీవారు చేసిన ఎన్ని చిలిపి పనులు తలుచుకున్నా, నిద్రకి దూరమవడమేగాని ఒరిగేదేమీ లేదు.

కేర్‌ఫ్రీ టి.వి ఎడ్వర్‌టైజ్‌మెంటులో 'ఎంత డ్రై ఫీలింగ్ నిస్తుందో అన్న దానికి...

సమాధానంగా శ్రీవారు 'మీకేకాదు డ్రై ఫీలింగ్ మాకు కూడా' అనేవారు చిలిపిగా. 'స్నానించి' రెండ్రోజులైంది. ఇంతకు ముందు మల్లెపువ్వులు పెట్టుకునే టైముకి మాత్రమే శ్రీవారు మనస్సులో ప్రత్యక్షం అయ్యేవారు. ఇపుడు అమ్మకి కూర తరుగుతున్నా నాన్నకి బాత్రూములో నీళ్ళు పెట్టి తువ్వాలు అందించినా, ఇల్లూ, శ్రీవారూ జ్ఞాపకం వచ్చేస్తున్నారు. నాన్నకి పని తొందర్లో పంపేద్దామని తట్టకపోవచ్చు. మరి అమ్మ !

అమ్మకి తట్టేటట్టు వంటింటిలో "ఇంట్లో పేకాట పెట్టారో ఏమిటో! ఇల్లంతా అడవి చేసేస్తారు. వచ్చిన స్నేహితులందరికీ కాఫీ పెట్టి ఇచ్చే నెపంతో గిన్నెలన్నీ మాడపెట్టేస్తారు" అన్న కామెంట్లు అమ్మమీద ప్రభావం చూపి 'కూతుర్ని త్రోవమని చెప్పవే' అన్న సందేశం నాన్నకి చేరింది. నాన్న రెండ్రోజుల తర్వాత ప్రయాణం ఫిక్స్ చేసి ఆ విషయం శ్రీవారికి ఉత్తరం రాశారు.

ప్రయాణం రోజున భోజనంచేసి, నాన్న పెట్టిన చీర కట్టి, తమలపాకులు వేసుకుని నోరుపండిందో లేదో అని ఓసారి పెదవి విరచి చూసుకుని,

మల్లెపూలు వాడిపోకుండా అరిటాకులో కట్టి, బుట్టలో పెట్టేసరికి, తమ్ముడు కాస్తా రిక్షా తెచ్చాడు.

"తమ్ముడు అక్కర్లేదు నాన్నా, నేనొక్కర్తెనే వెళ్ళగలను'' అన్నా, నాన్న వినిపించుకోకుండా తమ్ముడిని నాతో పంపారు. నీకు తెలుసు వీడ్ని చూసి, తన ఏకాంతం పాడవుతుందని ఆయన విసుక్కోక మానరు. ఆయన్ని కాస్త 'కూల్' చెయ్యాలంటే ఆయనకి ఓ.కె. సంకేతం అందించక తప్పదు. లేకపోతే ఆ స్టేషన్‌లో వదిలేసి వెళ్ళిపోతారు. ఆ తిక్కే అంత !

అసలుకథ

ఓ.కె. సంకేతం అందిన అయిదు అందమైన సాయంత్రాలూ, ముచ్చటైన సమాగమాల తర్వాత...... ఆరోజు ఉదయం

"స్టీలు గ్లాసులో కాఫీ ఇస్తున్నావ్. అంతనిండా ఇస్తే చెయ్యి కాలిపోదా?'' శ్రీవారి చిరాకు.

"తక్కువ ఇస్తే తక్కువ ఇచ్చానంటారు. ఎక్కువ ఇస్తే చెయ్యి కాలిపోతుం దంటారు. ఈసారి నుండీ మీ కాఫీ మీరు పెట్టుకుతాగండి'' శ్రీమతి విసురు.

"ఏమిటి స్నానానికి నీళ్ళెట్టావా? పులుసుపెట్టావా''? శ్రీవారి వెటకారం.

"కూర కడుగుతున్నప్పుడు కూరముక్కలు రెండు వేన్నీళ్ళ బక్కెట్టులో పడ్డాయి కాబోలు, దానికే వేన్నీళ్ళు, పులుసయిపోతుందా?'' శ్రీమతి కినుక.

"ఇదేమిటి రెండుకూరలు వండావు. ఇంకొక కూర ఎక్స్ట్రా వండితే తద్దినం పెట్టేద్దుము కదా'' శ్రీవారి పొదుపు పథకం.

"పప్పు లేదని, రెండు కూరలు వండా, అంత మాత్రానికే తద్దినం పెట్టే యాలా?'' శ్రీమతి మూతి విరుపు.

"నీ మంద్రస్వరం బావుందోయ్ సంగీతం ప్రాక్టీసు చేయరాదూ '' శ్రీవారి హాస్యం.

"నా మంద్రస్వరం మండినట్టే ఉంది. మూడురోజులనుండీ పడిశంతో చస్తున్నాను పట్టించుకోరు కదా'' శ్రీమతి కస్సు ఇలాంటివి ఎన్నెన్నో .... జ్ఞాపకం తెచ్చుకోండి.

★



# కోరికలే గుర్రాలయితే

"తాతగార్ని తీసుకుని బదరీ వెళ్ళరా వెంకూ'' అన్నారు ..... నాన్న.

బి.ఎ. పాసై ఇంట్లో కూర్చున్నానేమో, తీర్థయాత్రలు, పుణ్యం కాకపోయినా, హిమాలయాలు వాటి అందచందాలూ చూడొచ్చని, తాతయ్యని తీసుకుని బదరీ బయలుదేరాను. ఇద్దరం ఢిల్లీ వెళ్ళి, అక్కడ నుండి హరిద్వార్ వెళ్ళి, అక్కడ ఒకరోజు గడిపి, తాతయ్య సెలవిచ్చినట్లు, హరిద్వార్‌లో గంగలో తాతయ్యనొకసారి ముంచి, మర్నాడు బస్సులో బదరీకి ప్రయాణం అయ్యాం..

ఎత్తుగా వెండి కొండలు, సూర్యుడి నీరెండకి మిలమిలా మెరుస్తున్నాయి. ప్రకృతిలో జడత్వాన్ని, ప్రయాణంలో మోనాటనస్‌ని కనబడనివ్వకుండా, దారి పోతున్న వయ్యారాలు, ప్రయాణీకుల్ని ఆహ్లాదపరుస్తున్నాయి. ఎత్తులు ఎక్కి, లోతుల్లోకి దూసుకుపోయి, మలుపుల్లో మెలి తిరిగి, బస్సుపోతున్న వయ్యారాలు మస్తుగా ఉన్నాయి.

బస్సు వొంకల్లోకి వొరిగిపోతున్నప్పుడల్లా తాత, "నారాయణ, నారాయణ'' అనడం నవ్వు తెప్పిస్తోంది. ఇన్ని కష్టాలూ పడి సాయంత్రానికి జోషిమఠ్ చేరుకుంది బస్. ఆ రాత్రి అక్కడ పడుకొని, మర్నాడు బయలుదేరాలి. సాయంకాలం చల్లదనం, పొగమంచుతో సంగమించి, కొండల్లో విశ్రమించింది.

"తాతా నువ్వు పడుకో, నేనలా తిరిగివస్తాను'' అని బయలుదేరాను.

"ఎక్కడా దూరంగా పోకు, అసలే కొత్తప్రదేశం'' అన్నాడు తాత రగ్గులో మునగతీసుకు పడుకుంటూ.

"అలాగే'' అంటూ ప్రకృతి సంధ్య వొడిలోకి నడిచాను.

సత్రం పక్కగా ఉన్న దుకాణంలో 'టీ' తాగి సిగరెట్ వెలిగించి, కొండ అంచుల దగ్గరకి వెళ్ళాను. కొండలోతుల్లో అందాన్ని చూస్తున్నాను. అప్పటికి సంధ్యకి శెలవిచ్చి, చీకట్లు ముసురుకుంటున్నాయి. అదే సమయంలో వెనకాల అలికిడి అయితే వెనక్కి తిరిగి చూసాను.

వెనకాల సాధువు నిలుచున్నాడు. కళ్ళు ఎర్రగా డైయోడ్‌ల్లా దేదీప్యమానంగా ఉన్నాయి. అంత చలి లోనూ వొంటికి బట్టలేం కట్టుకోలేదు. వొంటినిండా తెల్లగా

బూడిద పూసి వుంది. అతను నన్ను చూసి నవ్వుతూ... "హమ్ అఘోరీ బాబా మాలూమ్ హై" అన్నాడు.

నాకు అంతగా హిందీ రాదు కాని అర్థం అవుతోంది. అఘోరీఅంటే ఏమిటో అర్థం కాలేదు. ఎందుకొచ్చిన గొడవ అని రెండు చేతులూ ఎత్తి దండం పెట్టాను.

"మా భైరవీకా దర్శన్ కరోగే" అన్నాడు.

నాకేమీ అర్థంకాక, మౌనంగా ఉన్నాను.

రెండు నిముషాలు నన్ను దీర్ఘంగా చూసి, నా మౌనంలో కన్‌ఫ్యూషన్ని అర్థం చేసుకున్న యోగి "ఠీక్ హై ఠీక్ హై" అని తల ఆడించి 'తుమారా పాస్ కాగజ్ హై' అని అడిగాడు.

నేను జేబులు వెదికాను. బస్సు టికెట్ కనిపించింది. అది రెండు అంగుళాల పొడవు రెండు అంగుళాలు వెడల్పు ఉంది.

దాన్నిచూసి, "బహుత్ చోటాహై ఫిర్‌భి చలేగా" అంటూ... తన నుదిటిమీద విభూతి తీసి ఆ కాగితంలో పోసాడు. చాలా తక్కువ పట్టింది. దానిని మడిచి తిరిగి ఇచ్చేస్తూ "అంగ్రేజ్ సమజ్‌తాహై " అని అడిగాడు.

"ఊ" అన్నట్టు బుర్ర ఊపాను.

"యు కీప్ దిస్ విభూతి... మదర్ భైరవి ఫుల్‌ఫిల్ యువర్ విషెస్, యు పుట్ దిస్ విభూతి ఆన్ యువర్ ఫోర్‌హెడ్. యువర్ విషెస్ విల్ బి ఫుల్‌ఫిల్డ్" అన్నాడు స్వచ్ఛమైన ఇంగ్లీష్‌లో, ఆ విభూతిని తీసుకుని కళ్ళ కద్దుకుని జేబులో పెట్టుకున్నాను.

"జై మా భైరవీ" అంటూ వెనక్కి తిరిగి "లా ఆఫ్ నేచర్ నెవ్వర్ బ్రేక్స్' అన్నాడు గట్టిగా ....... మెల్లగా నడుచుకుంటూ కొండలోయల్లోకి వెళ్ళిపోయాడు.

విభూతిలో మహత్యం ఉందా? ఇది పెట్టుకుంటే కోరికలు తీరుతాయా? అన్న ఆలోచన మనసంతా ఆక్రమించి బదరీనాథ్ యాత్రను సరిగ్గా ఎంజాయ్ చేయలేకపోయాను.

ఇంటికి వచ్చిన దగ్గర్నించీ, ఆ విభూతి ఎలా ఉపయోగించాలి అనే ఆలోచనతో సతమతమయ్యాను. అన్నిటికన్నా ముఖ్యమైంది ఉద్యోగం, బి.ఏ చదువుకి, క్లర్కు ఉద్యోగం కూడా రాదు. దాని వల్ల నాకోరికలు ఏమీ తీరవు కూడా.. ఈ విభూతిని ఉపయోగించి మంచి ఉద్యోగం సంపాదించాలి అనుకున్నా.... అయితే ఎలా కోరుకోవాలి అని, రెండు మూడురోజులు ఆలోచించాను.



ఈ రెండు మూడు రోజులు ఆలోచన కన్న కలలు ఎక్కువగా కన్నాను. నేను పెద్ద స్వివల్ చైరులో కూర్చున్నట్టూ, పెద్ద ఆఫీసులో ఉద్యోగం చేస్తున్న వాళ్ళందరూ నన్ను భయ భక్తులతో చూస్తున్నట్టూ.

నేను కారులో వెళుతుంటే కార్మికులు "ఈబాబే మాకు ఇంత అన్నం పెట్టేడు" అని కృతజ్ఞతా భారంతో వొంగి దండాలు పెడుతున్నట్టూ తెగ కలలు వచ్చేవి.

ఒకరోజు పొద్దున్నే లేచి, దేవుడికి దండం పెట్టి విభూతిపొట్లం తీసి అందులోంచి విభూతి తీసి నుదుటన పెట్టుకున్నాను. కళ్ళ ఎదురుగా నవ్వుతూ యోగి కనిపించాడు.

'వెయ్యి మంది జీవితాల్ని శాసించే అధికారం కావాలి... వెయ్యిమందికి తిండి పెట్టేంత గొప్పవాడ్ని కావాలి' అని కోరుకున్నాను. టిఫిను చేసి వీధి జంక్షన్‌కి వెళ్ళి ఫ్రెండ్స్‌తో కబుర్లు చెప్పి భోజనం టైముకు ఇంటికి వచ్చాను. భోజనం చేసి, పడుకుని లేచి, సాయంకాలం నాన్న వచ్చే టైముకి బైటకి వెళ్ళిపోవాలి, లేకపోతే సోమరిపోతులా తిండి తిని పడుకున్నానని తిడతాడు నాన్న. ఇలా అలోచిస్తూ పడుకున్నాను.

కానీ నిద్ర మధ్యలో చెడిపోయింది. అదీ నాన్న గొంతు వినిపించడంతో. ఈ వేళ నాన్న ఇంటికి రావడం ఏమిటా? అన్న ఆశ్చర్యంతో లేచి కూర్చున్నాను. నాన్నతోపాటు ఇంకో ఆయన కూడా వచ్చారు. ఆయన్ని అమ్మకి పరిచయం చేస్తున్నారు. నేను వెళ్ళాను. నన్నూ పరిచయం చేసారు... "మా సోమరిపోతండీ" అంటూ .......

ఆ వచ్చినాయన నావేపు నవ్వుతూ చూసి, "ఇంక సోమరిపోతులా ఉండడు లెండి" అన్నాడు.

నాన్న నవ్వుతూ "అంతా మీ అభిమానం" అన్నాడు.

ఆ వచ్చినతను తన వ్యాపారాన్ని నన్ను చూసుకోమంటూ నన్ను జనరల్ మేనేజరుగా అపాయింట్‌మెంట్ చేసాడు. ప్రొప్రైటరు ఎప్పుడూ వేరే వూళ్ళో ఉంటాడు.

ఇక్కడ అతని వ్యాపారం నేనే చూడాలి. నేను కోరుకున్న ఉద్యోగం వచ్చినట్లే అనుకున్నాను.

మర్నాడు బాగా తయారై ఆఫీసుకి వెళ్ళాను. ఈ వూర్లో అతని వ్యాపారం పౌల్ట్రీ ఫార్మ్.... దానికి నేనే మేనేజర్ని. నాక్రింద ఇద్దరు గుమాస్తాలూ, నలుగురు

సర్వెంట్‌లూ ఉన్నారు.

ఆ ఫార్మ్‌లో వెయ్యి పైచిలుకు కోళ్ళు ఉన్నాయి. వాటికి ఎప్పుడు మేత వెయ్యాలో, ఎలాంటి మేత గుమస్తాల చేత తెప్పించాలో వగైరా వగైరా చాల విషయాలు నా డెసిషన్ మీద ఆధారపడి ఉంటాయి. అంతేకాక వాటిని తనిఖీ చెయ్యడానికి వెళ్ళినప్పుడల్లా కోడి బొచ్చు నావంటి మీద, వాటి రెట్టలు నాబూట్సుకి ఫేంట్స్ చిగుళ్ళకి అంటుకుని సత్కరించి వదిలేవి. ఈ ఉద్యోగం చూసి నాకు వొళ్ళు మండింది. 'విభూతి మహత్యం ఇదా!' అని తిట్టుకున్నాను.

ఆ రోజు రాత్రి యోగి కలలోకి వచ్చాడు. "నువ్వు కోరుకున్నది ఇదే కదా అధికారం కావాలి అన్నావు. అందర్నీ శాసించాలన్నావు. చేతిలో అధికారం ఉంది. నీ కోళ్ళు నువ్వు పెడితే తింటాయి. లేకపోతే పస్తు పడుకుంటాయి. నీ కిష్టముంటే వాటిని ఉంచుతావు, లేకపోతే చంపుతావు. ఇంత కన్నా అధికారం ఎక్కడుంటుంది చెప్పు దీన్నే 'ఎబ్‌సొల్యూట్ పవర్' అంటారు" అన్నాడు నవ్వుతూ.

నిద్ర లేచాక నాకున్న అధికారం తలుచుకొని చికాకేసింది. 'పీడిచ్చిన అధికారం మండినట్లే ఉంది' అనుకున్నా. అవును.... ఉద్యోగం మానేస్తానంటే నాన్న ఇంట్లోంచి పొమ్మంటారేమో' అని భయం

★ ★ ★

కొన్నాళ్ళకి ఉద్యోగం అలవాటైపోయింది. కోడి బొచ్చు - రొచ్చు భరించే స్థితికి ఎదిగానన్నమాట. ఈసారి విభూతిని చాలా జాగ్రత్తగా వాడాలి. ఈసారి కోరిక కోరుకునేటప్పుడు, ముందుగా కాగితం మీద రాసుకోవాలి అనుకున్నాను. ఒక రాత్రంతా కూర్చుని కాగితాలన్నీ పాడు చేసి, నా రెండో కోర్కెని తయారు చేసాను. మర్నాడు ఉదయాన్నే లేచి స్నానం చేసి దేముడి పటం దగ్గరకి వెళ్ళి నేను రాసుకున్న కాగితం తీసి "నాకు ఆస్తి, అందం, చదువు ఉన్న పెళ్ళాం కావాలి" అని చదివి విభూతి తీసి బొట్టు పెట్టుకున్నాను.

విభూతికి మహత్యం ఉంది. అది తెలుస్తూనే ఉంది. 'ఈ రోజు సాయం కాలంలోగా నాక్కాబోయే భార్య దర్శనం ఇస్తుంది' అన్న ఆలోచనతో ఫార్మ్‌కి వెళ్ళాను. నే వెళ్ళేసరికి అక్కడ మారుతీ కారు ఆగి ఉంది.

ఆఫీసులో అందమైన అమ్మాయి కూర్చుని ఉంది. అమ్మాయిని చూస్తేనే అర్ధం అవుతుంది. మంచి సంపన్నుల కుటుంబం నుంచి వచ్చిందని. నే వెళ్ళగానే గుమాస్తా పరిచయం చేసాడు.

ఆ అమ్మాయి చనువుగా "మీగురించే ఎదురు చూస్తున్నాను. మా అన్నయ్య మేరేజిపార్టీ. ఓయాబై చికెన్ కావాలి, మంచివి ఇప్పించండి" అంది నవ్వుతూ.

'ఎదురు చూడక ఏంచేస్తావ్, విభూతి పెట్టుకున్నానాయె' అనుకున్నాను మనసులో........

"మీరు ఎంచుకుంటారా? లేక ఎంచి ఇమ్మంటారా?" అన్నాను నవ్వుతూ.

"మీరు ఎంపికచేసి ఇవ్వండి. కట్‌చేసి పేక్ చేస్తే, తీసుకువెళతాను. నాకు ఈ విషయంలో ఏమీ తెలీదు. తినడం తప్ప" అంది నవ్వుతూ.

ఆమె నవ్వు నాకు బాగా నచ్చింది. కాబోయే పెళ్ళాన్ని ఇప్పటి నుంచి ఇంప్రెస్ చెయ్యాలన్న ఉద్దేశంతో వంటినిండా కోడిబొచ్చు అయితే అయిందిలే అని, ఫారమ్‌లోకి వెళ్ళాను. ఓ యాభై చికెన్ ఎంచి, తూపించి, కట్ చేయించి, పేక్ చేయించాను. వంటికి అంటిన కోడి బొచ్చు దులుపుకుని, ఆఫీసులోకి వెళ్ళి.....

"మీ పేకెట్స్ రెడీ" అన్నాను నవ్వుతూ.

ఆ అమ్మాయి నవ్వుతూ నా దగ్గరకి వచ్చి నా తల మీద ఉన్న కోడి ఈక తీసి పారేసింది.

"మీరు వచ్చారేంటి ఇంట్లో ఇంకెవరూ లేరా?" అని అడిగాను నవ్వుతూ.

"మా కజిన్ రావలసిందే కాని తనకి ఇంకో పని తగిలింది. తను అటు వెళ్ళాడు. నాకు ఇటు రాక తప్పలేదు" అంది ఆ అమ్మాయి నవ్వుతూ.

ఆ అమ్మాయి ఏం మాట్టాడినా జోక్ లాగానే ఉంది నాకు. నేను నవ్వుతూ బిల్ చేసి ఆ అమ్మాయి వెళ్ళిపోతే నేను పెళ్ళాడ్డం ఎలా? అని ఆలోచించి........

"ఇంత కష్టపడి, మీ అన్నయ్య పార్టీకి, ఇవన్నీ ప్రిపేరు చేయించాను. నన్ను పార్టీకి పిలవరా?" అని అడిగాను చనువుగా.

మా గుమాస్తా నన్ను ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఎందుకంటే నేను ఏ కష్టమర్‌తోనూ అంత ముచ్చటగా మాట్లాడ్డం చూడలేదు.

ఆ అమ్మాయి నవ్వుతూ "ఓ తప్పకుండా" అంటూ కారు దగ్గరకి వెళ్ళి రిసెప్షన్ కార్డు తీసుకొచ్చి "మీ పేరు" అని అడిగి కార్డు మీద నాపేరు రాసి, కార్డు నాకు ఇచ్చింది.

"తప్పకుండా రండి" అంది నవ్వుతూ

"నన్ను పార్టీకి ఆహ్వానిస్తున్న వాళ్ళెవరో తెలుసుకోకుండా, పార్టీకి ఎలా రాను?" అన్నాను.

"నాపేరు జ్యోత్స్న." అంది వయ్యారాలు పోతూ.

"బావుంది" అన్నాను నవ్వుతూ.

"ఏమిటి?" అని అడిగింది నవ్వుతూ

"అమ్మాయి, అమ్మాయి పేరు రెండూను" అన్నాను.

జ్యోత్స్న సిగ్గులు పడి వంకలు తిరిగిపోలేదు.

"థాంక్స్!" అంది కారెక్కుతూ, కారెళ్ళిపోయింది. జ్యోత్స్న వెనక్కి తిరిగి చెయ్యూపింది.

తర్వాత విషయాలన్నీ చకచకా జరిగిపోయాయి. నేను పార్టీకి వెళ్ళాను. నన్ను వాళ్ళ అన్నయ్యకి, నాన్నగారికి పరిచయం చేసింది. అందరూ నన్ను చనువుగా అభిమానంగా పలకరించారు. పార్టీ అంతా అయిపోయాక నన్ను కారులో మా ఇంటి దగ్గర దింపింది.

ఆ తర్వాత మేం చాలాసార్లు కలుసుకున్నాం. బీచి వొడ్డున, సింహాచలంలో, దుర్గ గుడి దగ్గర, వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర. ఇద్దరిలో చనువూ, పరస్పరాకర్షణ పెరిగాయి.

పెరక్క ఏంచేస్తాయి. అంతా విభూతి మహిమ.

ఇద్దరం పెళ్ళి చేసుకుందాం అనుకున్నాము. నాకు తెలుసు మా పొట్రీఫారమ్ ప్రొప్రైటరు కూతుర్ని, నాకిచ్చి పెళ్ళి చేద్దామనే ఉద్దేశ్యంతో ఉన్నాడని, దానికి నాన్న కూడా వొప్పుకున్నారని.

ఇప్పుడు ఈ విషయం ఇంట్లో చెప్తే పెద్ద గొడవ అవుతుంది. పెళ్ళి గూడా డౌటులో పడుతుంది. గొడవ జరిగి పెళ్ళి లేకుండా ఉండే కన్నా పెళ్ళి చేసేసుకుంటే, గొడవ జరిగినా పర్వాలేదు. అనిపించింది. ఈ విషయం జ్యోత్స్నతో చెప్తే ఎవరికీ చెప్పకుండా రిజిష్టర్డు మేరేజి చేసుకోడానికి ఒప్పుకుంది.

ఎవరికీ చెప్పకుండా నేనూ, జ్యోత్స్న సింహాచలంలో పెళ్ళి చేసుకున్నాం. ముందుగా మా ఇంటికి వెళ్ళాం. అమ్మ నాన్న చిరాకు పడ్డారు. నాన్న కోపంతో చిందులేసారు. ఇంట్లోంచి పొమ్మన్నారు. ఇద్దరం కలిసి జ్యోత్స్న ఇంటికి వెళ్ళాం, జ్యోత్స్న తండ్రి కోపగించకపోయినా, చిరాకు పడ్డాడు. ఆశ్చర్యపోయాడు.

"ముందు విడాకులు తీసుకున్న తర్వాత, పెళ్ళి చేసుకోవలసిందే జ్యోత్స్నా" అంటూ జ్యోత్స్నని మందలించాడు.

"విడాకులేమిటి ?" అన్నాను ఆశ్చర్యంగా.



"జ్యోత్స్న కి మూడేళ్ళక్రితం పెళ్ళి అయింది... దీనికి కోపం... మంకుతనం ఎక్కువ... అతను సరిగా చూడటం లేదని దెబ్బలాట పెట్టుకుని వచ్చేసింది. మూడేళ్ళలో ఎన్ని ప్రయత్నాలు చేసినా మరి కలవలేకపోయింది. ఈ మధ్యనే ఉభయులూ విడాకులు తీసుకుందామని నిర్ణయానికి వచ్చారు" అని నిట్టూర్చారు జ్యోత్స్న తండ్రి......

నాకు నవనాడులూ కృంగిపోయాయి. ఆ విభూతిని బైట పారేద్దామను కున్నాను. కాని అందులో విభూతి ఎంత తక్కువైనా మరి రెండుసార్లకు వస్తుంది. ఆ రోజు సాధువుని తిట్టుకుంటూ పడుకున్నాను.

కలలోకి సాధువు వచ్చాడు. నవ్వుతున్నాడు.

"ఏమిటీ అస్తవ్యస్తపు వరం " అన్నాను కోపంగా.

"నువ్వు కోరుకున్నదే" అన్నాడు.

నాకు వొళ్ళుమండి ... "ఏమిటి నేను కోరుకున్నాను! పెళ్ళాన్ని కోరుకున్నాను." అన్నాను చిరాకుగా.

"నీకు పెళ్ళామే దొరికింది. నువ్వు అందం, ఆస్తి, చదువు వున్న పిల్లని, పెళ్ళాంగా కోరుకుంటే నీకు ఈ అగచాట్లు తప్పేవా" అని మాయమైపోయాడు యోగి.

"వెధవ తెలుగు, వరాలివ్వడంలో బైరాగి లౌక్యం చూపించాడు" అని తిట్టుకు న్నాను.

ఇది జరిగిన కొన్నాళ్ళకి పొట్రీఫారమ్ ప్రొప్రైటరు... వాళ్ల అమ్మాయిని నేను చేసుకోలేదనే కోపంతో కోడిమెడ విరిచేసినట్టు నన్ను ఉద్యోగంలోంచి పీకి పారేసాడు

నేను జోత్స్న ఇంటికే చేరాను. ఎలాగోలా జోత్స్న ఉధృతాన్ని భరిస్తున్నాను.

* * *

జీవితం ఇలాగే వెళ్ళిపోతుందా, ఇలాగే సాఫీగా వెళ్ళపోతే మరి విభూతి ఎందుకు?

కొన్నాళ్ళకి కడుపులో నొప్పి బయలురేరింది. ఎందుకు డాక్టర్ల వెనక తిరిగినా, ఎన్ని మందులు వాడినా, నయం కాలేదు. జోత్స్నకి నామీద కోపం, విసుగూ పెరిగిపోతున్నాయి. ఆఖరికి నేను నొప్పి లేకుండానే, నొప్పి అని అంటున్నానని అనుమానించసాగింది. ఆమె అనుమానంలాగే నా నొప్పి పెరగసాగింది. జోత్స్నకి కోపం వచ్చి విడాకులిచ్చి ఇంట్లోంచిపొమ్మంటుందేమో అని భయం వేసింది.

అప్పుడు విభూతి జ్ఞాపకం వచ్చింది. విభూతి పొట్లం తెరచి చూస్తే, అందులో కొంచెం విభూతి వుంది. మరో రెండుసార్లకి వస్తుందేమో జాగ్రత్తగా ఉపయోగించు కోవాలి అనుకున్నా!

ఆరోజు ఉదయాన్నే లేచి, స్నానం చేసి, దేవుడికి దండం పెట్టుకుని, "నేను మందులు అవీ వాడకుండా ఈ జబ్బు నయమైపోవాలి. ఈ కడుపు నొప్పి పోవాలి" అని కోరుకుని, నుదుటిన విభూతి బొట్టు పెట్టుకున్నాను. అప్పుడు మానసికంగా చాలా ఆనందం కలిగింది. ఇంక రేపటి నుండి ఈ నొప్పి ఉండదు. అని, మనసు తేలిక పడింది.

కాని పొద్దు పైకెక్కుతున్న కొద్దీ (సమయం గడుస్తున్న కొద్దీ) కడుపులో నొప్పి పెరగసాగింది. మధ్యాహ్నానికి నొప్పి భరించలేనంతగా పెరిగిపోయింది. నొప్పికి మెలికలు తిరిగిపోయాను. స్పృహతప్పిపోయాను. అందరూ ఆస్పత్రికి తీసుకెళ్ళారు.

ఇంక ఈ నొప్పి మందుల వల్ల నయమవదు. ఆపరేషన్ చెయ్యాలన్నారు. ఆపరేషన్ చేసారు. ఆపరేషన్‌కి ముప్పైవేల రూపాయలు ఖర్చు అయింది. జ్యోత్స్న తండ్రి ఏం పట్టించుకోలేదు. నాన్నే ఎన్నో కష్టాలు పడి డబ్బు సంపాదించారు. ఆపరేషన్ చేయించారు. ఇంక జ్యోత్స్న ఆపరేషను జరిగిన రెండురోజులు తప్ప నా మొహం చూడలేదు. ఆస్పత్రి నుండి డిస్చార్జిచేసాక, నేను మా ఇంటికి చేరుకు న్నాను. అమ్మ నాకు సేవ చేసింది. నేను కోరుకున్న వరంలో తప్పు నాకు అర్థం అయింది. మందులక్కర లేకుండా నొప్పి తగ్గిపోవాలనుకున్నాను. ఆపరేషన్ పడి నొప్పి తగ్గిపోయింది. ఈ విభూతి వాడకంలో ఏదో కిటుకు ఉంది.

* * *

ఆ విభూతిలో ఏ కిటుకు వున్నా ఈసారి నేను కోరుకునే కోరిక ముందు ఆ కిటికులేవీ పనిచెయ్యవు. ఈ విభూతి వల్ల కోరికలు తీరాయా అంటే కోరికలు తీరాయి. కలిసొచ్చాయా అంటే కలిసి రాలేదు. యోగి మీద వళ్ళు మండిపోయింది. కోపం పెరిగిపోయింది.

ఓ రోజు పొద్దున్నే లేచి స్నానం చేసి దేవుడి ముందు నిలబడి, "విభూతి ఇచ్చిన యోగి మరణించాలి" అని మనసులో కోరుకుని, కాగితంలో ఉన్న విభూతిని నొసటికి అంటించాను. అది చాలదేమో అనిపించి, కాగితంకి అంటుకున్న విభూతిని నొసటికి కాగితంతో సహా పులుముకున్నాను.

"ఈ రోజు సాయంకాలంలోగా యోగి హిమాలయాల్లో ఎక్కడో గుటుక్కు మంటాడు. ఇంకెప్పుడూ ఎవరికీ విభూతి ఇవ్వడు. యోగికి తెలుస్తూ ఉంటుంది.



భస్మాసుర హస్తంలా తన విభూతి ఎసరు పెడుతోందని వీడికి విభూతి ఎందు కిచ్చానురా దేవుడా అని విచారిస్తూ వుంటాడు" అనుకున్నాను.

ఈరోజు ఆదివారం అవడం వల్ల, అందరం ఇంట్లోనే వున్నాము. నాన్న ఏదో పనుందని పక్క ఊరు వెళ్ళారు. రెండు రోజుల వరకూ రారు. సరిగ్గా పన్నెండు గంటలకి తలుపు చప్పుడైంది. ఎవరా అని తలుపు తీసి చూసా... ఎదురుగా యోగి నిలబడి వున్నాడు. ఆ రోజు జోషిమఠ్ దగ్గర చూసిన యోగే! మెట్ల దగ్గర నవ్వుతూ కనిపించాడు.

ఆయన్ని చూసేసరికి నేను గిల్టీగా ఫీలయ్యాను. నేను కోరుకున్న కోర్కె తీరదని చెప్పడానికి వచ్చినట్టు ఉన్నాడు. 'అయినా వీడు ఇక్కడకి ఎలా వచ్చాడు?" అని ఆశ్చర్యపోయాను. ఈలోగా నా వెనకాలే అమ్మ వచ్చింది. ఎదురుగా యోగిని చూసింది.

"ఒరేయ్ భోజనాల సమయానికి వచ్చాడు. ఉండమను, భోజనం పెడదాము" అంది. అని వాడితో అరుగుమీద కూర్చో భోజనం తిందువుగాని అని సైగ చేసింది.

యోగి నవ్వుతూ వచ్చి అరుగు మీద కూర్చున్నాడు. అమ్మ విస్తరాకు తీసుకొచ్చి భోజనం పెట్టింది. అప్పటికి నా నుదిటి మీద విభూతి చెరిగిపోలేదు.

యోగి సుష్టుగా భోజనం చేసాడు. "బాహర్ ధూప్ బహుత్ తేజ్‌హై తోడీదేర్ యహా ఆరామ్ కరేంగే" (బయట ఎండ తీక్షణంగా ఉంది, ఇక్కడ కాసేపు విశ్రాంతి తీసుకుంటాను) అన్నాడు. అమ్మ "సరే" అంది. అతను తను తెచ్చిన సంచీ తెరచి అందులోంచి బదరీనారాయణ పటం ఒకటి తీసి అమ్మకిచ్చి "పూజా కర్‌నా" అన్నాడు. అమ్మ భక్తితో ఆ పటం అందుకుంది. లోపలికి వెళ్ళిపోయింది.

యోగి తన భుజం మీది గుడ్డ అరుగుమీద వేసుకు వెల్లికిలా శవాసనం వేసినట్టు పడుకున్నాడు.

నాకు గాభరా పట్టుకుంది. వీడెప్పుడు పోతాడ్రా బాబూ అనిపించింది. విభూతి మహత్యం వీడిమీద పని చేయదేమో అనిపించింది.

ఎప్పుడూ విభూతి నేను కోరిన కోర్కె తీర్చినట్టే అనిపించింది. కాని ఆ కోర్కె తీరడం వల్ల నాకు మనస్తాపమే కాని సంతృప్తి కలగలా. వీడు చావడు. ఇంకేదో జరగచ్చు అనుకున్నాను. మాటిమాటికి వెళ్ళి అరుగుమీద ఉన్న యోగిని చూసి వస్తున్నాను. శుభ్రంగా నిద్రపోతున్నాడు. కాసేపటికి ఏమీ జరగదులే అని నిశ్చయానికి వచ్చి నేనూ నిద్రపోయాను.

ఇంట్లో అమ్మ హడావిడి పడుతూ వుంటే తెలివి వచ్చింది. అమ్మ గాభరాగా నా దగ్గరకి వచ్చి, “ఒరేయ్ మధ్యాహ్నం భోజనం చేసిన బైరాగి చచ్చిపోయాడురా'' అంది.

“ఎప్పుడూ?'' అంటూ ఆశ్యర్యపోయాను. నేను అరుగుమీదకు వెళ్లి చూసాను ఎలా పడుకున్న యోగి అలాగే ఉన్నాడు. చనిపోయాడు అంటే నమ్మబుద్ది వేయలా! కాని చనిపోయాడు. ఇంటి ముందు చుట్టుపక్కల వాళ్ళు చాల మంది మూగారు.

“ఏం చేయాలి? ఎవరు దహనం చేస్తారు?'' అంటూ అమ్మ గాభరా పడింది.

పోలీసులకి తెలియచెయ్యాలి అన్నారు కొందరు. పోలీసులకి కబురు వెళ్ళింది. పోలీసులొచ్చి ఇంటిల్లిపాదినీ అనుమానంగా చూసారు. యోగి తల మీద నెత్తురు మరక చూసి మరీ అనుమానపడ్డారు.

నేను షట్‌చక్రాలు, కుండలినీ, బ్రహ్మరంధ్రం, అంటూ వివరించిన యోగ విద్యాజ్ఞానం ఇన్‌స్పెక్టర్‌కి ఏమీ అర్థం కాలేదు. చేతిలో వెయ్యిరూపాయలు పెట్టేసరికి యోగవిద్య అంతా ఇన్‌స్పెక్టరుకి అర్థం అయింది. బ్రహ్మరంధ్రం కనబడింది కూడా. బ్రాహ్మణుని చేతిలో వేయిరూపాయలు పెట్టాకా, శవం లేచి, స్మశానానికి కదిలింది.

ఇదంతా చేసేసరికి నా తల ప్రాణం తోకకి వచ్చింది. తోక లేదు కాబట్టి మోకాళ్లలోకి వచ్చింది, అనుకోవచ్చు.

కోరికలు గుర్రాలవచ్చుగానీ, ఊహలకి రెక్కలు రావడం కల్ల... అందుకే ఈసారి నాన్న “తాతయ్యని తీసుకు కాశీవెళ్ళరా'' అంటే... ఈ టర్న్‌లో ఏబాబాగారు కనిపిస్తారో అనిపించి..........

“వద్దులే నాన్నా బదరీ పుణ్యం చాలు'' అన్నాను కంగారుగా....

'రచన' ఫిబ్రవరి 2000

★



# మిష్టర్ అక్కయ్య - మిస్ట్రెస్ బావయ్య

మా అక్కయ్య గురించి చెప్పాలంటే చాల ముచ్చటేస్తుంది. ఎందుకంటే అక్కయ్య వ్యవహారమే అంత. అక్కయ్యకి అలంకారాలుగా చెప్పుకోతగ్గవి చాలా వున్నాయి.

అన్నింటిలో ముఖ్యమైనది మృష్టాన్నభోజనం. బావయ్య అక్కయ్యకి తందాన తాన. ఆవిడ రుచిగా తింటే, తనకీ రుచులు తగులుతాయని బావయ్యగారి ఆశ.

బావయ్యకి అక్కయ్య లేనప్పుడు కొండంత ధైర్యం, మెరుపంత సెన్సాఫ్ హ్యూమరు లోపలి నుండి తన్నుకొచ్చేస్తాయి.

ఆ విధంగా ఓ రోజు జాలీగా వున్న మూడుతో “హోయ్ మీ అక్కయ్య లేచి నిలబడితే, కురు మహాసభలో భీముడిలా వుంటుందోయ్'' అన్నారు.

ఆ ఉపమానానికి నాకు ముచ్చటేసింది. కాని నా ముచ్చటని కనిపెట్టి విచారంగా మొహం పెట్టి “చేతిలో గదొకటే తక్కువోయ్'' అన్నారు బావయ్య. నేను నవ్వుదామనుకుంటుండగా అక్కయ్య వచ్చేసింది........

“దాసరివాడి ఆలోచన ముష్ఠితో సరి'' అన్నట్టు ఏమిటి మీ అవకతవక ఆలోచనలన్నీ మావాడి బుర్రకి పట్టిస్తున్నారు అంది.

బావయ్యగారు గాభరా పడిపోయారు. “అబ్బే అదేం లేదు. నువ్వు మీ అక్కని అక్కయ్య అంటావు కదా ... నన్ను ప్రత్యేకం బావగారూ అనడం ఎందుకు బావయ్య అనవోయ్ బేలన్స్‌డ్‌గా వుంటుంది'' అంటున్నాను అంతే!'' అన్నారు సమయస్ఫూర్తిగా

“బాగానే అంటారు, వాడికి మీ భ్రష్టు నాలెడ్జి ఎక్కించకండి'' అంది విసురుగా... అక్కయ్యకి 'ష్ట' కారం అంటే చాలా ఇష్టం. ప్రతి మాటలోనూ విపరీతంగా వాడుతుంది. కూరల్లో పోపుల్లాగ అక్కయ్య మాటల్లో 'ష్ట' కారం... మాటకి మంచి ఘాటునిస్తుంది. పెద్దవాళ్లు తొందరగా పెళ్ళి చెయ్యడం వలన తనకి వున్న తెలివితేటలు ప్రదర్శించే అవకాశం రాలేదని అక్కయ్య బాధ...

అక్కయ్య పెళ్ళి చూపులవగానే, లోపలికి వచ్చి బావగారిని తను ఏవిధంగా అంచనా వేసిందో తల్లికి చెప్పింది. “అమ్మా ఏమిటో పెళ్ళికొడుకు బుడబడక్కలాడి చొక్కా, డొక్కు ఫేంటూ, చింపిరిక్రాపూనూ, మనిషిని చూస్తే చిన్నప్పట్నించీ,

వీడిమీద తల్లితండ్రులేం ఖర్చుపెట్టి పెంచినట్టు లేదు. పెట్టిన స్వీట్లన్నీ తిన్నాడూ అంటే నంగిరితనం ఎక్కువే అన్నమాట, నెలకో నాలుగొందలు తెచ్చుకుంటున్నా డంటే ఫస్టు తారీకునాడు తప్ప రెస్ట్ తారీకులకి మోస్ట్ అన్‌ఫిట్ అన్నమాట'' అంది అక్కయ్య.

కాని అక్కడితో ఆగలేదు... "తెచ్చుకున్న నాలుగొందల్లో, ఇద్దరం నెలరోజులు తినాలంటే రొష్టు పడిపోడం తప్పదు. ఇంక బెస్టు చీరలు, కాస్ట్లీ నగలు, ఇష్టమైన సినీమాలు చూపించి, పోష్‌గా వుంటాడంటే నాకు నమ్మకం లేదమ్మా!... అందుకే ఎంత లీస్టుగా కట్నం ఇచ్చుకుంటే అంత బెస్టు! అంతేగాని పెళ్లిచేసి, మీరూ జేష్టాదేవిని వరించినట్టవుతుంది.'' అంది అక్కయ్య బావగార్ని అంచనా వేసి....

అప్పుడే లోపలికొస్తూ అక్కయ్య మాటలు విన్న నాన్నగారు "నువ్వు నీ అంచనాలతో మమ్మల్ని కష్టపెట్టేస్తున్నావే! నోర్మూసుకుని పీటలమీద కూర్చో సంబంధం ఖాయం అయిపోయింది ! ఆ!'' అన్నారట.

ఆ విధంగా అక్కయ్య పెళ్ళి జరిగి, అత్తారింటికి వచ్చేసింది. అక్కయ్యని సాగనంపి, ఇంట్లోకొచ్చి ఇంక దీని అంచనాలతో అల్లుడి బుర్ర దొలిచేస్తుంది కాబోలు ఇది, 'ఏడు కొండలవాడా, వెంకటరమణా మా అల్లుడికి కాస్త సాయంగా వుండవయ్యా' అంటూ దేముడికో దండం పెట్టారట! నాన్న.......

ఆ విధంగా అత్తారింటికొచ్చిన అక్కయ్య తెలివితేటలు వేస్టయిపోకుండా బావయ్య అక్కయ్య టంగుని ఖంగ్‌మనిపించే పవరుఇచ్చారు.

అక్కయ్య టంగుకి పవరొచ్చి సిల్వర్ జూబిలీ ఇయర్ అయిన సందర్భంగా బావయ్యగారు "ఈ రోజు ఏదైనా స్టార్ హోటల్లో భోజనం చేద్దామోయ్'' అన్నారు.

స్టార్ హోటల్లో 'స్టా' అక్కయ్యకి నచ్చింది. స్టార్ హోటళ్ళన్నీ తనవే అనిపించాయి. అందుకే స్టారు హోటల్లో భోజనానికి వెంటనే ఒప్పేసుకుంది.

అక్కయ్య స్టార్‌హోటల్లో భోజనం చేయడానికి వొప్పేసుకుందన్న ఆనందంతో బావయ్య "నువ్వూ రావోయ్ సరదాగా'' అన్నారు... నాతో....

"వాడెందుకు ఆ ముష్టిభోజనానికి, నేను ఇంట్లో అన్నం వండేస్తాను. చక్కగా ఆవకాయ వేసుకు తినేస్తాడు'' అంది అక్కయ్య.

చక్కగా హోటల్లో భోజనం చేసే అవకాశం పోయిందని విచారించాను. కాని బావయ్యగారు నా దీన వదనం చూసి ఏమనుకున్నారో ఏమో, వెళ్ళి గేస్‌స్టవ్ నాబ్ స్క్రూలు విప్పి దాచేసారు.

అక్కయ్య కిచెన్‌లోకి వెళ్లి గేస్ స్టవ్ ఆన్‌చేద్దామనుకునేసరికి నాబ్ కాస్తా



చేతుల్లోకి వచ్చేసింది. "ఈ జెష్ట స్టవ్ ఇప్పుడే పాడవాలీ! ఏవండోయ్ గేస్ స్టవ్ బాగు చేయించండి..., లేకపోతే రేపట్నించీ ఆ భ్రష్టు హోటల్లోనే తినాలి. మీకు బెష్టుగా బిల్లు అవుతుంది.'' అంది అక్కయ్య కసిగా.

బావయ్య ముసిముసిగా నవ్వుకుని "అలాగలాగే'' అన్నారు. ఆ విధంగా ముగ్గురం డాల్ఫిన్స్ హోటల్‌లో భోజనానికి బయలుదేరాం.

ముగ్గురం డాల్ఫిన్స్ హోటల్‌కి వెళ్ళి ఎ.సి గదిలో దూరి భోజనం చేసి కులాసాగా కిళ్ళీ బిగించేసరికి సర్వ్ చేసేవాడు కాస్తా బిల్లు తెచ్చాడు. అక్కయ్య కిళ్ళీ తమ్మిని బుగ్గకు పెట్టి "ఈ ముష్టి భోజనానికి ఎంటుచ్చుకుటుళ్ళాడు పదా? పాతికా? అంది ప్రాస దెబ్బతినకుండా.

"ముగ్గురికీ మొట్టం రెండువొందల పాతిక రూపాయళు'' అన్నారు బావయ్య కిళ్ళీ నములుతూనే...

వీళ్ళిద్దర్నీ చూస్తుంటే, నాకు మద్రాసు నడిగడ్డ మీద వున్నట్టు అనిపించింది. వెంటనే ఆరుద్రగారి కూనలమ్మ పదాలు జ్ఞాపకం వచ్చాయి.

"తమలపాకులు నముళు- దవళతో మాట్లాళు తానె వచ్చును తమిళు - ఓ కూనలమ్మ "అన్నారాయన. నే కూనలమ్మ తలపుల్లో వుండతానే కథ చాలా దూరం పోయింది.

అక్కయ్యకి కోపం వచ్చింది. నోట్లో కిల్లీ తుక్కులా అనిపించింది. గబగబా వెళ్ళి బేసిను దగ్గర ఆ తమ్మిని వుమ్మి నోరు కడుక్కుని "ఈ హోటలు మేనేజర్ ఏడీ'' అంటూ గాండ్రించింది.

అక్కయ్య గాండ్రింపు విని చకితుడైన సర్వరు "ఆ మూల టేబులు దగ్గర కూర్చున్నాయనే కేషియరు కమ్ మేనేజరు'' అని సవినయంగా మనవి చేసుకున్నాడు.

"నంగనాచి వంగముల్లు'' అన్నట్టు ఆ మూల నక్కాడా, మీ మేనేజరు అంటూ బిల్లు తీసుకుని మేనేజరు దగ్గరికి వెళ్ళింది అక్కయ్య

అక్కయ్య అక్కడికి వెళ్ళేసరికి మేనేజరు మూడు స్టార్ల కొలతకు సరిపోయేంత వినయం వొలకపోస్తూ లేచి నిలుచున్నాడు అక్కయ్య మేనేజరు వినయాన్ని గమనించలేదు. బిల్లుని మేనేజరు టేబులు మీద పెట్టి "ఇదేమిటి'' అంది.

"బిల్లు'' అన్నాడు మేనేజరు.

"ముంజేతి కంకణానికి అద్దమెందుకు? అన్నట్టు ... అది బిల్లు అని నాకూ తెలుసు. అందులో వున్నది ఎంత? అని అడుగుత'' అంది కసిగా అక్కయ్య...

అప్పటికి తన వినయాన్ని అక్కయ్య వీసమంత ఎత్తయినా గమనించలేదని, కినుక వహించిన మేనేజరు" మీరే అన్నారు కదండీ కంకణం అద్దం" అని అందులో వున్న అంకెలు స్పష్టంగా వున్నాయి కదండీ" అన్నాడు....

అప్పటికే మేనేజరు కొట్టిన ఎదురు దెబ్బకి కంగుతిన్న అక్కయ్య మేనేజరుకి తన టంగుపవరు చూపించాలని గట్టిగా నిర్ణయించుకుంది. " ఈ ముష్టి భోజనానికి రెండు వందల ఇరవై అయిదురూపాయలా?".అంది.

"మూడు భోజనాలకే రెండువందల ఇరవై అయిదురూపాయలండి. భోజనాలు ముష్టిగా కాదండి. డబ్బు చెల్లించాలి" అన్నాడు వినయంగా

"శిరస్సుంటే మోకాళ్ళకి పూజెందుకూ" అన్నట్టు నువు పెట్టిన భోజనాలు అంత గొప్పవైతే ఖరీదు సంగతి నిన్నడగటం దేనికి?" అంది అక్కయ్య విసురుగా.,.

మేనేజరుకి అక్కయ్య వ్యంగ్యం అంతగా పట్టుబడలేదు. కొంచెం తగ్గాడు "భోజనం బాగా లేదాండీ" అన్నాడు నీరసంగా

మంచం ఎక్కి వరస అడిగినట్టు "భోజనం అంటూ పెట్టేసి, కిల్లీ వేసుకున్నాక ఇచ్చావు కదయ్యా బిల్లు" అంది అక్కయ్య.

"భోజనం చేసాకే బిల్లు ఇస్తారండీ" అన్నాడు మేనేజరు. అక్కయ్య వేసిన సామెతకి జడుసుకున్నాడేమో నీరసపడిపోయాడు.

"పెనానికేం తెలుసు పెసరట్టు రుచి" అన్నట్టు మాకా తిండి పెట్టించేసి భోజనానికి డెబ్బైఅయిదు చెల్లించండి" అంటున్నావు. నువ్వెప్పుడైనా దాని విలువ తెలుసుకున్నావా? లేదు. అందుకే అంత ఎక్కువగా వసూలు చేస్తున్నావు" అంది అక్కయ్య చికాకుగా.

"ఎంత వసూలు చేస్తున్నానండీ, నావుద్దేశంలో న్యాయంగానే వసూలు చేస్తున్నానండి. మీ అంచనా ఎంతో చెప్పండి" అన్నాడు.

"అంచనా" అన్న మాట మేనేజరు నోటమ్మట రాగానే బావయ్య నోరు తుడుచు కోడానికి తీసిన జేబురుమాలు నెత్తిమీద వేసుకున్నారు. మేనేజర్ని జాలిగా చూసారు. బావయ్యగారి సంకేతాన్ని గుర్తించిన మేనేజరు తానేదో ఘోరమయిన తప్పు చేసానని అర్థం చేసుకున్నాడు. అప్పటికే అక్కయ్య లాంగ్ స్పీచ్‌కి సిద్ధమవు తున్నట్టుగా, గొంతు సవరించుకుంది.

"న్యాయమా, భలేవాడివే. ముద్దొచ్చినప్పుడే చంకనెక్కా లని వెనకటి కెవడోఅన్నట్టు మా ఆయన స్టార్‌హోటల్లో తిందామే అంటే పరిగెట్టుకొచ్చా.. నువ్వు



పెట్టిన తిండికి, దోచిన డబ్బుకి ఎక్కడేనా న్యాయం వుందా? వొక ప్లేటు భోజనంలో నువ్వెంత పెట్టగలవు? జానెడు పొట్టకి మేమెంత తినగలం!

అయినా అడిగినంత అన్నం పెడతానని అన్నావు. కాని ఇక్కడ జరిగిం దేమిటి? ఆ అన్నం వడ్డించే వాడు మొదటి వడ్డన చేసి, మారుకోసం ముప్పు తిప్పలూ పెట్టాడు. మాకే చిరాకేసి వున్నదాంతో సర్దేసుకున్నాం! ఇంక మేం సర్దేసుకున్నామని తెలిసాక అప్పుడు పట్టుకొచ్చాడు అన్నం! సరే దాని సంగతొదిలేయ్. అది అన్ని హొటళ్ళపోలసీ అనుకుంటా! మా పొట్టల సత్తా బట్టైనా, చూసుకుంటే వందగ్రాముల బియ్యం కన్నా ఎక్కువ తింటామా? నో అలాకాదు, ఏదీ వో తెల్లకాగితం ఇవ్వు" అంది అక్కయ్య

అప్పటికే కంగుతిన్న మేనేజరు వెంటనే పెద్దకాగితం తీసి ఇచ్చాడు... ఆ కాగితం బావయ్యగారి చేతిలో పెట్టి అక్కయ్య "రాయండి " అని ఆర్డరేసింది.

"వో" అంటూ బావయ్యగారు జేబులోంచి పెన్నుతీసి కాగితం ముందేసుకు కూర్చున్నారు....

"బియ్యం వందగ్రాములు, రూపాయి ముప్పై పైసలు రాసారా" అంది అక్కయ్య.

"ఆ రాసా" అన్నారు బావయ్యగారు. అక్కయ్య తెలివితేటలకి మురిసిపోయి

"వొరేయ్ చిన్నా, ఆధరవుల్లో ఏమేం ఇచ్చారో వొక్కొక్కటి చెప్పరా" అంది అక్కయ్య నన్ను చూస్తూ.

జరగబోయే స్టార్ హోటల్ కల్యాణంలో నాకూ పాత్ర పోషణకి అవకాశం దొరికిందని ఆనందం పట్టలేక, 'వాడు ఇచ్చిందాంట్లో మొదలిది టమాటా పప్పు" అన్నాను.

"టమాటాపప్పు రుచిగా తగిలినట్టుంది చిన్నాకి" అంటూ మురిసిపోయి, మేనేజరు వేపు తిరిగింది అక్కయ్య. "చూడు టమాటా పప్పు. ఇందులో ఏవుంటాయి? రెండు టమాటా ముక్కలు, అరగిద్దెడు పప్పు, వొక పచ్చిమిరప కాయ, కరివేపాకు రెమ్మ, చిటికెడు పసుపు, రవ్వంతపోపూనూ. ధరలు మండిపోతున్నాయి కాబట్టి, ఒక టమాటా అర్ధరూపాయి, అరగిద్దెడుపప్పు రూపాయి పావలా, వొక పచ్చిమిరపకాయ పదిపైసలు, కరివేపాకు కూడా అమ్మకు చస్తున్నారుగా అయిదు పైసల్ది వేసుకోండి. చిటికెడు పసుపు పదిపైసలు. పోపుకి అర్ధరూపాయేసుకో. ఎందుకంటే ఇందులో బొట్టంత నూనెయ్యాలిగా" అని చెప్పి "రాసారా" అంది అక్కయ్య బావయ్యని చూస్తూ.

బావయ్యగారు అక్క అంచనాకి మురిసిపోతూ "రాసాను'' అన్నట్టు తలూపారు.

"ఆ రాసా'' అన్నారాయన ఆనందంగా.

బావయ్య రాసాననగానే "రెండో ఆధరవు ఏమిటోయ్"?'' అన్నట్టు నన్ను చూసింది అక్కయ్య.

"అరటికాయ కూర'' అన్నాను.

అదిగో స్వర్గానికి వెళ్ళినా సవతిపోరు తప్పదన్నట్లు, ఇక్కడి కొచ్చినా అరటి కాయ కూర తప్పలేదన్నమాట! సర్లే అరటికాయ కూరకేం కావాలట, అర అరటికాయ యాభైపైసలు, అల్లం పావలాది, పచ్చిమిరపకాయలు ఇరవైపైసలవి. కరివేపాకు రెమ్మ పదిపైసలది. నూనెచెంచాడు, సాదాపోపు మొత్తం వెరసి రూపాయ వేసుకోండి. నూనె ధరలు మండి చస్తున్నాయి'' అంది అక్కయ్య మేనేజర్ వేపు సానుభూతిగా చూస్తూ......

బావయ్యగారు అక్కయ్య అంచనాకి మురిసిపోతూ "రాసాను'' అన్నట్టు తలూపారు.

రెండోకూర గురించి అక్కడ అడగ్గానే చెప్దామని నెమరువేసుకుంటున్నాను (కూర కాదు లెండి, దాని రుచి) కాని అక్కయ్య నాకు ఆ అవకాశం ఇవ్వలేదు. రెండో కూర నోటికి రుచిగా తగిలినట్టుంది.

"రెండో కూర కాబేజి కొబ్బరికోరూ, బావుందిలే! అందులో కాబేజీ ఎంత వుంటుంది. డభై అయిదు గ్రాములది. అంటే అర్ధరూపాయేసుకోండి. వో రెండు కొబ్బరి ముక్కలు రెండూ కలిపి అర్ధరూపాయ, వీటిలో పోపుకి రెండు చెంచాలనూనె రూపాయది, రెండెర్రమిరపకాయలు యాభైపైసలు, ఆవాలో అర్ధరూపాయివి, చిటికెడు పసుపు పది పైసల్ది, ఇంతకన్నా ఏముంది చెప్పు కూరలో.. సరి కూరలయ్యాయా, ఇంక మిగిలింది సాంబారు, "ఏరా చిన్నా సాంబారులో పప్పేసిన సూచనలేమైనా వున్నాయా? అడిగింది.

నన్ను రెండో కూర గురించి అడగనందుకు, నేను అక్కయ్యను పట్టించుకో కుండా, ఎటో చూస్తున్నాను. అక్కయ్య ప్రశ్న అడగ్గానే అప్రయత్నంగానే మేనేజరు.... బావయ్య నావేపు తిరిగారు. అక్కయ్య ఎక్కడ కట్ చేసేస్తుందో అన్న ఆదుర్దాతో మేనేజర్ నన్ను చూసి "పప్పెందుకుండదూ? ... వుంది కదండీ?'' అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

నాకు మేనేజరు నవ్వు చూసి జాలేసింది. అక్కయ్య వేపు తిరిగి "వున్నట్టే



వుంది అక్కయ్యా'' అన్నాను.

"వున్నట్టే వుంది అంటావేమిటిరా, వుంటే వుంది లేకపోతే లేదు, అని అఘోరించలేవూ? నస, ఎప్పుడూ నసే, అందుకే ఇంతవరకూ పెళ్ళవలేదు. పోనీ కనికరిద్దామంటే నా కడుపున ఆడ నలుసైనా పడలేదు. సరిలే, మా వాడు సాంబారులో పప్పు వుందని భ్రమ పడ్డానంటున్నాడు. నా అంచనా ప్రకారం సాంబారులో పప్పు అర్ధరూపాయిది, చింతపండు పావలాది, వోముక్క ఆనబగాయ అర్ధరూపాయిది, ఉల్లిపాయ దీని రేటు అంతరిక్షంలో షైరు కొడుతోంది. కాబట్టి రూపాయి వేసుకో'' అంది.

అక్కయ్య న్యాయబుద్ధికి మేనేజరుకి ఆనందబాష్పాలు రాలాయి. "అవునవును'' అంటూ నన్ను చూసాడు....

వాహ్ వుల్లిపాయ వ్యవహారం వచ్చేసరికి గవర్నమెంటుని స్పేర్ చేసి నందుకు అక్కయ్య మీద ఎనలేని గౌరవం కలిగింది.

అక్కయ్య ఇదేం పట్టించుకోలేదు. "వొ చెంచాడు సాంబారు పొడరు, ఎంతుందేమిటి? అర్ధరూపాయి. అందులోకి పోపు, బొట్టునూనె, కొంచెంగా ఆవాలు, వొ పచ్చిమిరపకాయముక్క, వో ఎండుమిరపకాయముక్క, వగైరా వగైరా..... ఎంతుంటాయేమిటి వో రూపాయివేసుకోండి. ఇంక సాంబారుకి సవితి రసం, దీనికేం కావాలి? పావు గిన్నెడు కార్పొరేషన్ నీళ్ళు.. నువ్వా నీళ్ళకి టేక్స్ కడుతున్నావుగా వో పదిపైసలేసుకో. రసం పొడరో ముప్ఫై పైసల్ది, వో చిన్న గిల్లుడు ఇంగువ, పదిపైసలు. చేసేది నీళ్ళతో అయినా దీనికి హంగులెక్కువ. అందుకే తెలుగింట చారు రుచి చూసి చేతి వంటని పొగుడూ అన్నారు. దీంట్లో ఆవాలో పదిపైసలవి... మెంతులో పదిపైసలవి... మిరపకాయలు రెండు ఇరవైపైసలవి. నూనెబొట్టు, ఇన్నీ వేసినా దాన్ని టేబుల్ మీద ముట్టుకునేవాడుండడు'' అంటూ ఆయాసం తీర్చుకుని నెక్స్ట్ ఏమిటి? అన్నట్టు నన్ను చూసింది.

"అక్కయ్యా దొండకాయ పచ్చడి''

"ఆ జ్ఞాపకం వుందిలే, ఇదేదో కొత్తగా వుంది, అంటూ రుచి చూసానుగా, ఏం ప్రయోగాలో, ఏం పచ్చడో, దొండకాయ పచ్చడంట, దానికేం ఖర్చుంటుంది. మూడు దొండకాయలు మూడూ ఇరవైపైసలు, అందులోకి చింతపండు, పోపుకి ఆవాలు, రెండుబొట్ల నూనె అన్నీ కలిపి రూపాయేసుకొండి. ఇంక పెరుక్కి రూపాయేసుకోండి... తర్వాత గుడ్డ ముక్కలా వున్న అప్పడం వొ పావలా... వో! జూస్ఇచ్చావు కదూ, నాలుగు ద్రాక్షపళ్ళు అర గ్లాసుడు నీళ్ళు, చెంచాడు పంచదార

అన్నీ కలిపి రూపాయన్నర, పంచదార అంటే జ్ఞాపకం వచ్చింది. పై పదార్థాల్లో చవి గురించి ఎక్కడా అనలేదు కదా... వెయ్యండి వీటన్నింటిలోకి పావలా ఉప్పు! పైవన్నీ వుడకెయ్యడానికి పొయ్యి కిందకి కావద్దూ గేస్. దీని ఖరీదు హనుమంతుడి తోకలా పెరిగిపోతోంది... వేసుకొండి.. వొ అయిదు రూపాయలు. ఇంక ఆఖర్ని కిల్లీ వొకటి తగలిడిందిగా దానికో అర్ధరూపాయి. ఇంక మిగిలింది కంచం అద్దె... దాన్ని తోమినవాడికి కలిసి రూపాయేసుకో, అవన్నీ అయాయి. ఇంక హంగుల్లోకి వద్దాం... పట్టపగలే దీపాలెట్టి, పాటలు పెట్టి, కరెంటు ఖర్చు చేసాడు చూడూ, దానికో యూనిట్టయినా ఖర్చయినా ఖర్చయి వుంటుంది. అంటే రూపాయిన్నర వేసుకోండి. ఇంకేమైనా వుందా? అంటూ మేనేజరువేపు చూసింది. అప్పటికే మేనేజరుకి తల దిమ్మెక్కి సీటుకి టేబులుకి మధ్య పడిపోయాడు. అది చూసిన బావయ్యగారికి మేనేజరు మీద జాలేసింది.

"పోనీలేవే అదంతా ప్రొప్రైటరు పాలసీ అయితే మేనేజరు ఏం చేస్తాడు. పూర్ క్రీచర్ బిల్లు పే చేసేద్దాము" అన్నారు. మేనేజరు మీద సానుభూతి చూపిస్తూ.

తనమీద సానుభూతి వాక్యాలు వినబడగానే మేనేజరు తేరుకున్నాడు. లేచి కూర్చుని "అవునమ్మా నేనేం చేస్తాను. ఇదంతా ప్రొప్రైటరు గారి పాలసీ అయితే" అని మళ్ళీ వుద్యోగానికి ఎక్కడ దెబ్బ వస్తుందో అని తడబడుతూ కాదు కాదు గవర్నమెంటు పాలసీ... స్టారుకో పదిరూపాయలు టేక్సు కట్టమంటుంది. ప్రభుత్వం కాబట్టి ఆ టాక్సు ఎవరిచ్చుకోవాలి ప్రజలే అంటే మీరే! టేక్సు ఎవరికి ఇస్తున్నారు, మీరు మీకే ఇచ్చుకుంటున్నారు.

ఇది ప్రజాప్రభుత్వం. మీరు ప్రజలు గాబట్టి మీడబ్బులుమీకే చేరుతున్నాయి. మీరు టేక్సు కడుతున్నారు.. త్రీస్టార్ హోటలుకొచ్చారని "వెండన్నం, భమిడి పప్పు చేసి పెట్టలేం కదా... పోపుల్లో ఆవాలూ, మెంతులు తప్ప మరొకటి వెయ్యలేం. కాబట్టి మీరు అన్యథా భావించకుండా టేక్సులతో సహా బిల్లు చెల్లించేసి, నా వుద్యోగం నిలబెట్టండి" అంటూ మేనేజర్ బావయ్య గారిని ప్రాధేయపడ్డాడు.....

బావయ్య అక్కయ్య పసికట్టకుండా "సరేలే" అన్నట్టు అభయహస్తం చూపించారు మేనేజరుకి. దాంతో మేనేజరు ముసిముసిగా నవ్వి అక్కయ్యని చూసి, "మీ తెలివి తేటలు అమోఘం. ఎంత ఈజీగా మా ప్రొప్రైటరుగారి పోలసీని పట్టేసారు. మీలాటివాళ్ళు దేశరాజధానుల్లో వుండి దేశాన్ని ఏలాలిగానీ... అంటూ నసిగాడు.

ఆ పొగడ్తతో అక్కయ్య కళ్ళు పెద్దవి అయ్యాయి. అక్కయ్య శారీరకంగా వుబ్బకపోయినా, మెదడు వుబ్బేసింది. ఇంక బిల్లు ఇవ్వడానికి ఎంతో దూరంలో



లేదు అనిపించింది.

"అద్సరేలేవయ్యా మరీ భోజనం పాతిక రూపాయల్ది పెట్టి, డెబ్బైఅయిదు రూపాయలుచ్చుకుంటే గుండెల్లో కలుక్కుమనదూ" అంది అక్కయ్య స్వరం జోరు తగ్గింది.

"నిజమేనండి. మీకే కాదు. పుచ్చుకుంటుంటే మాకూ బాధగానే వుంది. కానీ ఈ ప్రజాప్రభుత్వం వుంది చూసారూ... ఎన్నిసార్లు ఎవరు మార్చినా దానికి బుద్ధి రాలేదు. ప్రజలకి విసుగూ రాలేదు. ఎవరో మహానుభావుడు శలవిచ్చినట్టు "వియ్ హేవ్ నో చాయిస్ ఇన్ డెమోక్రసీ." ఎవరొచ్చినా పన్ను వేస్తున్నారు. మీరు తెలివైన వారు కాబట్టి ఏదో సర్దుకుపోయి బిల్లు చెల్లించేస్తున్నారు" అన్నాడు మేనేజర్ రెండో అస్త్రప్రయోగం చేస్తూ.....

"అవును నిజమే పన్నులే మన ప్రాణాలు తీస్తున్నాయండీ, పోన్లెండి మేనేజరేం చేస్తాడు. అష్టకష్టాల వెంకటకిష్టయ్య"లా మొహం పెట్టడం తప్ప ఇచ్చేయండి బిల్లు" అంది అక్కయ్య మేనేజర్ని జాలిగా చూస్తూ.

"అలాగే నువ్వు చెప్తే కాదంటానా?" అని బిల్లు ఇచ్చేసారు బావయ్య.

బిల్లు చెల్లించి బైటకి వచ్చాకా "ఏరా చిన్నా నువ్వేదో టీ షర్టు తీసుకోవాలన్నావు పద" అంది.

బట్టల షాపులో కూడా అక్కయ్య అంచనాలు మొదలు పెడితే, టీషర్టు కాదు కదా చెడ్డీ కూడా కొనలేం అనిపించింది.... నా గుండెల్లో రాయి పడింది. అక్కయ్య అంచనా నుండి కాపాడు భగవంతుడా అని ఆకాశం వేపు చూసి బట్టల కొట్టులోకి నడిచాను.

నిజం చెప్పాటంటే అక్కయ్య నుండి కాపాడగలిగినది భగవంతుడు ఏమాత్రం కాదు. సాక్షాత్తు బావయ్యగారు మాత్రమే. ఆ విషయం మరుపున పడి నేను దైవసహాయం కోసం ఆకాశం వేపు చూడడం బావయ్యగారికి నచ్చలేదు. నువ్వు ఈ కొట్టులో టీ షర్టు ఎలా కొంటావో చూస్తాను అన్నట్టు, నావేపో చిన్నచూపు చూసి ధీమాగా షాపులోకి నడిచి కేషు కౌంటరు దగ్గర కుర్చీలో కూర్చున్నారు బావయ్యగారు.

అక్కయ్యా, అక్కయ్య వెనుక నేనూ షాపులోకి నడిచాం. షాపువాడు "ఏంకావాలండీ?" అంటూ వినయం విస్తృతంగా వొలకపోసాడు.

"వొరేయ్ చిన్నా, వీడు చూపే నంగిరి వినయానికి మన దగ్గర బాగా వసూలు చేస్తాడ్రోయ్" అంది అక్కయ్య. హోటల్లో ఎక్స్‌పీరియన్స్ మననం చేసుకుంటూ.

“ఏమిటండీ అంటున్నారు. రెడీమేడ్ బ్లౌజ్‌లున్నాయి. చూపించమంటారా? అన్నాడు షాపువాడు.

“నాకొద్దులే బాబూ వీడికి టీషర్టులు కావాలిట చూపించు” అంది అక్కయ్య...

“వొ అబ్బాయిగారికా, అలాగేనండీ పిన్నిగారు” అన్నాడు వాడు వినయంగా.

ఆ సంబోధనతో నాకు అర్థం అయిపోయింది, రాబోయే అరగంటలో వాడిమీద పడే విపత్తు గురించి.. కానీ నేనేం చేయలేని పరిస్థితిలో వున్నాను. ఆ పరిస్థితి చక్కదిద్దడానికి బావయ్యగారు కూడా దగ్గర లేరు.

ఎన్ని సిల్వర్‌జూబిలీలు గోల్డెన్‌జూబిలీలు చేసుకున్నా అక్కయ్యని పట్టుకుని పిన్నిగారూ, దొడ్డమ్మగారూ అంటే సహిస్తుందని నేననుకోను... ఏమయితే అయిందిలే అని షాపువాడు టేబులు మీద పడేసిన టీ షర్టులు ఎంచడం మొదలు పెట్టాను. టీ షర్టులన్నీ ఎంచేక, అందులోంచి వొక టీ షర్టుతీసి...

“ఇది బావుంది అక్కయ్యా” అన్నాడు.

కానీ అప్పటికే అక్కయ్య నిర్ణయించుకుంది, ‘ఇక్కడ టీ షర్టేకొనకూడదని’. “నాకేం తెలుసురా నేనెప్పుడైనా టీ షర్టులు వాడానా ఏమిటీ? నీకు నచ్చితే చాలు” అంది రుసరుసలాడుతూ.

అంత రుసరుసల్లోనూ “టీషర్టు ఖరీదెంతేమిటీ” అనడిగింది.

షాపువాడు మన టేష్టుతోనే సంబంధం గానీ రేటుతో పెద్ద సంబంధం లేనట్టు “చాలా తక్కువమ్మా” అంటూ కాలరు వంచి చూసి “మూడొందల డెబ్భైఅయిదు” అన్నాడు.

“ఏమిటి ఈ జుబ్బాకి మూడొందల డెబ్భై అయిదు వసూలు చేస్తావా, అమ్మే నీకేనా బుర్రుండాలి. ఎంచుకున్న మా నంగిరివాడికైనా బుర్రుండాలి” అంది.

అదేంటమ్మా ఇది  లేటెష్ట్ ఫేషన్. ఇంపోర్టెడ్ సరుకు” అన్నాడు.

“ఏమిటీ లేటెష్ట్ ఫాషను, మాతాత వేసుకునే వాడుగా, నేను చూడలేదనా నీ వుద్దేశం..! తెల్లగా ఖద్దరిది. దానికి కాలరుండేది కాదనుకో. ఇక్కడ జేబు గుండెలమీద వుంది. దానికి జేబు చక్కగా మా తాత బొజ్జ పక్కన వుండేది. పదిరూపాయలు గుడ్డ ఖరీదు. కుట్టుకూలి అయిదు రూపాయలు.. టీ షర్టవలా? ఇదేదో కొత్త వస్తువు మాకు చూపిస్తున్నట్టు మాట్లాడతావేమిటీ?” అంటూ దీర్ఘం తీసింది అక్కయ్య.

“అది అప్పటి సంగతి. అప్పటికీ ఇప్పటికీ తేడా లేదా? అది ఖద్దరు. ఇది



ఎక్రలిక్ ఫైబర్. చాలా తేడావుంది” అన్నాడు షాపువాడు. అక్కయ్య మాటలకి వుడుక్కుంటూ.

“సరేలే ఆ రోజులకీ, ఈరోజుకీ తేడా వుందని వొప్పుకున్నా కానీ, ఇంత తేడానా? ఈ టీషర్టుకి ఎంత గుడ్డ పడుతుంది. గజంన్నర, గజం యాభై రూపాయలేసుకున్నా గుడ్డ ఖరీదు డబ్భైఅయిదురూపాయలు. పొద్దున్న గుడ్డ కొని మా పక్కింటి సాయిబు టైలర్‌కి ఇస్తే, మధ్యాహ్నం ఫటాఫట్ కట్ చేస్తాడు. సాయంకాలం టకటకా మిషన్ తొక్కేస్తాడు. రాత్రికల్లా టీషర్టు రడీ. కుట్టినందుకో పాతికుచ్చుకుంటాడు. బతిమాలితే అయిదు తగ్గిస్తాడు. ఎంత చచ్చినా టీ షర్టు విలువ తొంభై అయిదు మించి వుండదు. నువ్వేమో మూడొందలు డెబ్భైఅయిదు వసూలు చేస్తున్నావు. అవునూ ఇది ఎన్ని ష్టారుల షాపేమిటి?” అనడిగింది. అక్కయ్య అంచనా వేసిన ఆయాసం తీర్చుకుంటూ...

అక్కయ్య అంచనాకి షాపువాడు కంగుతిన్నాడు. వాడి కేమనాలో తెలియ లేదు. అక్కయ్యకి ఏ సమాధానం చెప్పాలో తెలీక బిత్తర చూపులు చూస్తున్నాడు. కాని వీడి పరిస్థితి వోనరుకి అర్థం అయిపోయింది. వాడు వచ్చి “ఈ షాపులకి ష్టారులుండవమ్మా, ఇక్కడ విదేశీ వస్తువులు మాత్రమే అమ్ముతాం. అంటే జపాన్‌వి, అమెరికావి, చైనావి విదేశీ వస్తువులు దొరుకుతాయి. అన్నీ ఇంపోర్టెడ్ గూడ్స్” అన్నాడు గర్వంగా.

“ష్టార్స్ కాకపోతే సూర్యుళ్ళ షాపు బయట బోర్డు పెట్టారుగా. ప్రభాకర్ అండ్  సన్స్” అని. ఎన్ని సూర్యుళ్ళ షాపు? మూడు సన్‌లా, అయిదు సన్‌లా ఎన్ని? అందుకే ష్టారుహోటళ్ళలో రేట్లకన్నా విపరీతంగా వున్నాయి. వొక సన్ ఎండే భరించలేం. మూడు, అయిదు సన్స్ అయితే మంట పుట్టదూ... అయినా ఇండియాలో షాపెట్టి, విదేశీ వస్తువులు అమ్మడమేమిటయ్యా. రాకరాక అప్రాచ్యుల షాపుకి తీసుకొచ్చావేమిటిరా చిన్నా, పదపద” అంటూ నా చెయ్యి పట్టుకుని బైటకి తీసుకొచ్చింది.... అక్కయ్య.

నేను దీనంగా బావయ్యగారి వేపు చూసాను. అంతే బావయ్యగారి హృదయం కరిగింది. కేషుకౌంటరు నుండి లేచి, అక్కయ్య చూడకుండా నా జేబులో రెండొందలు పెట్టారు. ముగ్గురం పేవ్‌మెంట్ మీద వున్నాం... బావయ్య, అక్కయ్యని చూస్తూ “చూడవే అన్నీ విదేశీ వస్తువులు షాపులో పెట్టాడా, ఇండియా వాళ్ళెవరూ కొనడం లేదట” అన్నారు.

అక్కయ్యకి ఆనందం వేసింది “విదేశీ వస్తువులూ పైగా మూడు సూర్యుళ్ళ

ఎండలని మరిపించే ఖరీదులూనూ, మా బాగా అయింది'' అంది.

"ఖరీదులా!'' అని బావయ్యగారు ఆశ్యర్యపోయి "లేదే ఎవరూ కొనడం లేదని... యాభైశాతం డిస్కౌంట్‌కి, అమ్మేస్తున్నాడు వస్తువులన్నీ'' అన్నారు.

"ఆ మాట మరివాడు చెప్పలేదేం'' అంది అక్కయ్య ఆశ్చర్యంగా,

వెంటనే బావగారు "నామోషీ పడ్డాడు గావల్ను. నీకు చెప్పలేదు. నాతో చెప్పుకుని భోరున ఏడ్చాడు'' అన్నారు.

"అలాగా'' అంది అక్కయ్య.

"వొరేయ్ చిన్నా టీషర్టు ఎంతరా'' అని నన్నడిగారు బావయ్య. "మూడొందల డబ్భైఅయిదు'' అన్నాను.

"మీ అక్కయ్య ఎష్టిమేటు ప్రకారం ఎంతుండాలి;''

"తొంభైఅయిదు''

"అది షర్టు ఖరీదు. కానీ జపాను నుండి ఇక్కడికి తీసుకురావాలా, ష్టీమరు మీద వచ్చి వుంటాయి. దానికో యాభై వేసుకో. షాపువాడు వాళ్ళందర్నీ పెట్టుకున్నాడు. కదా వాళ్ళకి వోఇరవై వేసుకో, మరి షాపువాడు మరియు ఇద్దరు సన్స్ వెరసి ముగ్గురు ముగ్గురికి కలిపి మూడు పదులేసుకో... మొత్తం షర్టు ఖరీదు నూటతొంబ్భైఅయిదు అయింది. కానీ వాడు దాన్ని మూడువందల డబ్భైఅయిదులో సగం నూటెఎనభైఏడున్నరకే ఇస్తున్నాడు. అంటే నీ అంచనాకే ఇస్తున్నాడు. ఏమంటావు'' అన్నారు బావయ్యగారు అక్కయ్యని సమాధానపరుస్తూ.

"ఏమంటాను? దమ్మిడీముండకు ఏగానీ క్షవరం అంటాను'' అంది అక్కయ్య.

మరి ఫారిను వస్తువులంటే అంతేమరి. వొరేయ్ చిన్నా, ఈ రెండొందలూ పట్టుకెళ్ళి ఆ షర్టు కొనుక్కొచ్చుకో'' అన్నారు బావయ్య నాకు రెండొందలిస్తూ...

ఆ రెండొందలు పుచ్చుకున్నాను. కానీ బావయ్యగారి వుద్దేశం బోధపడలేదు. అక్కయ్య ఇద్దరి వ్యవహారం నచ్చక అటుపక్కకు తిరిగి నిలబడింది. అక్కయ్య చూడకుండా జేబులో డబ్బులూ, ఇవీ కలిపి టీషర్టు కొనుక్కోమన్నట్టుగా బావయ్యగారు సైగ చేశారు.

నేను హుషారుగా ఈలవేసుకుంటూ షాపులోకి నడిచాను.

★



# మధ్యతరగతి - మందుభాగ్యం.

"ఇఫ్ రేప్ ఈజ్ ఇనెవిటబుల్, వైనాట్ ఎంజాయ్ ఇట్'' అన్నాడో మహానుభావుడు.

ఆ రోజు అలాగే జరిగింది. చిన్నన్నయ్య మనవడి అన్నప్రాసన కని చేరిన మా కుటుంబసభ్యులు, చినన్నయ్య దూకుడుకి గురయ్యారు. చిన్నన్నయ్య మృదుభాషే, కానీ ఆ రోజు మందుకొట్టాడు. కొంత తాగాక నాకింక చాలు "ఫలహారం చేసి పడుకుంటా''! అంటూ వసారాలోకి వెళ్ళాడు. అక్కడ అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఆ సమయంలోనే సాయంకాలం పాలుపోసేవాడు వచ్చి "అమ్మగారూ పాలు'' అన్నాడు.

అన్నయ్యకి పాలవాడి పిలుపు చిరాకు కలిగించింది. చిన్నగా తూలుతూ వీధిగుమ్మం దగ్గర కెళ్ళి పాలవాడికి చూపుడువేలు చూపిస్తూ "ఎందుకా అబద్ధపు అరుపులు? నిజం చెప్పు. పాలు అనకు, నీళ్ళపాలు అని అరు'' అన్నాడు.

పాలవాడు కంగు తిన్నాడు. "అదేమిటి బాబూ మంచిపాలే ఇస్తున్నాగా'' అన్నాడు.

"మళ్ళీ అదే. పాలు అనకు, తెల్లనీళ్ళు అను, పాలు అన్న వెప్పుడేనా సప్లై చేసావురా'' కలిపేవేవో మంచినీళ్ళు కలపవోయ్... రాబోయే కాలంలో మనవడు స్ట్రాంగ్‌గా వుండాలా? నీవిచ్చే పాలు తాగితే, వాడు పెద్దయాక క్వార్టరు బాటిలుకే పడిపోతాడు. ఎంత అప్రతిష్ట! ఇంటిపేరు ప్రతిభావారు! ఆ మాత్రం ప్రతిభ లేదా? అని ఆడిపోయరూ? వెళ్ళు వెళ్ళు'' అన్నాడు.

ఆ సమయంలో పాలు తీసుకోడానికి బైటకెళ్ళిన వొదిన పాలవాడితో అన్నయ్య తాగాడని సైగ చేసింది. పాలవాడు మౌనంగా వుండిపోయాడు. కానీ వదిన చేసిన సైగని అన్నయ్య పసిగట్టేసాడు.

"ఏం నేను ముసలాడ్ని అయిపోయాననా వూళ్ళోవాళ్ళందరికీ సైగచేస్తున్నావ్. ఎంత ముసలాడ్నయినా పదివేలరూపాయల జీతగాడ్ని... వదిలెయ్యకు, మట్టిగొట్టుకు పోతావ్'' అన్నాడు హాస్యంగా.

ఆ హాస్యం వదినకి ఎక్కలేదు. కోపం వచ్చింది.

"తాగుబోతు మాటలు మాట్లాడి నాకు కోపం తెప్పించకండి' అంది విసురుగా.

"ఏమిటీ నావి తాగుబోతు మాటలా, నాకు తాగుడు మైకం అయితే నీకు ఇన్‌స్టాల్‌మెంట్ల మీద పట్టుచీర పట్టుకురాలా? ఎవడి బాబుగారి సొమ్మెట్టి తీరుస్తావ్! నా అరనెల జీతం కష్టార్జితం మట్టికలిపెయ్యాలా! ఇప్పుడా పట్టుచీర కట్టుకోపోతే వచ్చే నష్టం ఏమిటి? ఎవడు నిన్ను చూసెయ్యాలి? మురిసిపోవాలి? చెప్పింది వినవు కదా!

ఫ్రిజ్, కలర్ టి.వి, ఆఖరికి ఇల్లు కూడా ఇన్‌స్టాల్‌మెంట్ల మీద కొందామని ప్రయత్నించావు! ఏమయింది? ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టలేక ఇల్లు అమ్మిన వాడికే ఇచ్చుకోవల్సి వచ్చింది. నాకూ వున్నాయి తెలివితేటలు మిమ్మల్ని చేసుకున్నాను కాబట్టే ఇలాపడి వున్నా అంటావు. నీ శ్రాద్ధం తెలివితేటలు. ఈ ఇల్లు చక్కబెట్ట లేకపోయావు గానీ దేశాన్ని వుద్ధరిస్తానంటావు. నీలాంటిది రాజకీయాల్లోకి వెళితే ఆంధ్రదేశాన్ని ఇన్‌స్టాల్‌మెంట్ల మీద అమెరికా వాడికి అమ్మేయడం ఖాయం!"

ఆ మాటతో వదినకి కోపం వచ్చింది "అలాంటి దాన్ని ఇన్నాళ్ళూ ఎందుకు భరించారు." అంది

"సతి దగ్గరకొస్తే వున్న మతిపోయిందట" అన్నాడు చిన్నన్నయ్య వదిన్ని వుబ్బేస్తూ....

"మతి పోగొట్టే సతి వున్నందుకు సంతోషించండి" అంది వదిన కోపాన్ని వదిలి.. చిన్నన్నయ్య విచారంగా మొహం పెట్టి 'శోభనం నాడు సంతోషం, పురిటినొప్పుల్లో ఏడుపు "తప్పలేదు నాకు" అన్నాడు.

వదిన చిరాగ్గా "మీకు పురిటినొప్పులేంటి? మందెక్కువైంది" అంది.

"ఏడుపు పురిటినొప్పులకి కాకపోతే ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టలేక, నే చెప్పింది లోకోక్తి... వెర్రి మొహమా!" అన్నాడు చిన్నన్నయ్య తనని తాను సపోర్టు చేసుకుంటూ.

"పోనీకదా అని వూరుకుంటూంటే, మరీ రెచ్చిపోతున్నారు. వూరుకుంటారా? లేదా? అంటూ వార్నింగ్ ఇచ్చింది వదిన... తనని పట్టుకు వెర్రిమొహం అనడం ఆవిడకి నచ్చినట్టులేదు.

"రెచ్చిపోవడం ఏమిటి? నే చెప్పింది పచ్చినిజం. ఇంకో ఏడు పోతే గవర్నమెంటు వాడు నా వుద్యోగానికి మంగళం పాడేస్తాడు. మనం ఎన్నేళ్ళు సర్వీసు చేసినా అద్దెకొంపలంట్ల ముద్దరగదీసుకు తిరుగుతున్నాం అంటే దేనివల్ల? నీ



ఇన్‌స్టాల్‌మెంట్ల వల్లకాదూ? పోనీ నీ సంగతొదిలెయ్!

సుపుత్రు లనతగ్గ వాళ్ళిద్దరున్నారు. జయవిజయుల్లా. కానీ ఏం లాభం? నాలుగో జన్మ మనింటిలోనే జన్మించినట్టున్నారు. ఆలిపోషకం పెద్దవాడి నిత్యకర్తవ్యం, ఈరోజు చేసిన వుద్యోగం రేపు చెయ్యడు. ఏదేనా అంటే ప్రతిభావారి ప్రతిభకే చేటు అంటాడు. రాత్రయే సరికి పెళ్ళాం పక్కలోకి దూరినంత తంచనుగా, ఏనాడేనా ఉద్యోగానికి వెళ్ళాడా? ఈ అప్రాచ్యుడు నోరిప్పితే అన్నీ అబద్ధాలే! వెనకెవడో చెప్పినట్టు హరిశ్చంద్రుని నోట అబద్ధమూ రాదు, నానోటనిజమూ రాదని, పనిచ్చిన వాడికీ వీడు పనికి రాడు, యిటుకన్న వాళ్ళకీ పనికి రాడు. వుద్యోగం పురుషలక్షణం అన్నారు... కానీ వీడికి అవలక్షణంగా కనిపిస్తోంది కాబోలు!

అర్థరాత్రి పెళ్లాం పక్కలోచేరి జీడిపప్పు పకోడీలు చప్పరించడం చేతనైన వాడికి, పెంచి పెద్ద చేసిన అమ్మకీ నాన్నకీ వొక గుడ్డముక్క కొందాం అన్న యింగిత జ్ఞానం ఏమైనా వుందా? వాడుద్దేశం ఏమిటంటే చీరపెడితే చిరిగిపోతుంది.. అన్నం పెడితే అరిగిపోతుంది. బర్రెవాత పెడితే బతికినన్నాళ్ళూ వుంటుంది. అన్నట్టుగా వుంది...

"సరి ఈ జయుడిలా తగలడితే ఇంక విజయుడుగారు ఎప్పుడూ డేటా కలెక్షన్‌లో వుంటాడు. ఏ అమ్మాయి ఏ రంగు వోణీ వేసింది? ఏ అమ్మాయి నడక ఎలా వుంటుంది? అన్న డేటా కలెక్షన్! పొద్దున్నే తయారై పెన్నూ పుస్తకం పట్టుకు వీడు సెంటర్లో హాజరు.. అటుగా వెళ్ళే అమ్మాయిలు బేజారు! ఆ సెంటర్లో బీటెయ్యక పోతే కాలేజీకి వెళితే పాసవడా? పాసైతే వుద్యోగం చెయ్యాలేమో అన్న భయం.!

"పోనీ ఆ సెంటర్లో అలా నిలబడే బదులు బజ్జీలకొట్టు పెట్టుకోకూడదూ? కాస్త ఆదాయమేనా వుంటుంది. దానికి నామోషీ! సొమ్మొకడిది షోకొకడిది అన్నట్టు బుర్రలో అక్షరం ముక్కలేదు గానీ కాళ్ళకి మాత్రం ఐదొందలు పెట్టి "షూ" కావాలి! నోట్లో సిగరెట్ కావాలి! ఇదీ రెండో వాడి ఫండమెంటల్ హిస్టరీ.. వీడన్న ఆకుల మీద నడిస్తే వీడు చిగుళ్ళ మీద నడిచే రకం. వీళ్ళేరకాలైనా నాకు మాత్రం మారకగ్రహాల్లా తయారయారు."

"అందుకే ఆడపిల్లలు నయం. పెళ్ళి చేస్తే చక్కగా అత్తారింటికి పోతారు" అంది వొదిన ఏదోపాయింట్ కొట్టేద్దామన్న వుద్దేశంతో....

చిన్నన్నయ్య పగలబడి నవ్వాడు. "ఇంక వీళ్ళ గురించి చెప్పవలసి వస్తే పెద్దకథే చెప్పచ్చు! ఈ దేశంలో కన్యకుమారి నుండి కాశ్మీరం వరకూ ఎన్నటికీ కంచికిపోని కథల్లో అల్లుళ్ళ కథ వొకటి. వెనకటి కెవర్తో "తేలుతేలు" అని అరిచిందట.

మగాళ్ళని పిలవ్వే అన్నాడట దాని మొగుడు. "మీరు మగవాడు కదా?" అందిట ఆ పతివ్రత. "సమయానికి బాగా గుర్తుచేసావ్ కర్ర తెమ్మన్నాడట!" అలా వుంటుంది. అల్లుళ్ళ తంతు...

మావగారి ఇల్లంటే స్టేట్‌బేంక్ అనుకుంటాడో, ఏమో? అవసరమైనప్పుడల్లా ఎమౌంట్ చెప్పి అల్లుడు అన్న స్టాంపొకటి అఘోరించి, విత్‌డ్రాయల్‌ఫారమ్‌ని పంపినట్టు పెళ్లాన్ని పుట్టింటికి పంపేయడమే! ఇంక ఈవిడ పెద్దకూతురుగారు చిల్లరచీర కొనకపోయినా అలగడమే! చీదర సినిమాకి తీసుకెళ్ళకపోయినా సణగడమే...

ఇంక చిన్న కూతురుగారు మొగుడే సర్వస్వం అనుకుంటుంది. వాడు యాభైరెండు ముక్కలూ సర్వస్వం అనుకుంటాడు. అందులో తనకున్నది హరాయించుకు పోతే లోటు భర్తీ చేసుకోడానికన్నట్టు మామగారింటికి చేరుకుంటాడు వీడిదింకో రకం తెలివి! వెనకటి కెవడో చెప్పినట్టు "చింతకాయలకైతే ఆజ్ఞగానీ గుటకలకి ఆజ్ఞేందుకు!"

"ఫలానా టి.వి బావుందనో, ఫ్రిజ్ బావుందనో డిస్కషను. ఈ డిస్కషను ఎంత వరకూ వెళ్తుందంటే ఈ చవకరోజుల్లోనే కొనివ్వగలరు. మావగారు రిటైరైతే ఆయన కొనిస్తారా? మేమడుగుతామా?" అన్న లాజిక్‌తో బుర్ర తినేసి ఆ వస్తువు పట్టుకెళ్లేవరకూ వాడికి నిద్ర పట్టదు. ఆ తర్వాత ఆ వస్తువు కోసం చేసిన అప్పు తీరే వరకూ నాకు నిద్ర పట్టదు...."

చిన్నన్నయ్య అలా అల్లుళ్ళని దులిపేస్తుంటే, వదినకి కోపం వచ్చింది. వున్న చిక్కులు చాలక ఈ రోజు కొత్తవి వస్తాయేమోనని "జగడమెలా వస్తాది జంగమయ్యా అంటే బిచ్చం పెట్టవే బొచ్చుముండా" అన్నాడట వెనకటికెవడో... మీ వాలకం చూస్తోంటే ఈ రోజు సరిగా గడిచేటట్టు లేదు, వూరుకోండి, అయినా అంతగా తాగడం ఎందుకు... అడ్డూ, ఆపూ లేకుండా వాగడం ఎందుకు?" అంది.

"దీన్ని వాగడం అనరే వైపూ... మాయాబజార్ సినిమాలో ఆఖర్న శకునిమావ "సత్యపీఠం" ఎక్కుతాడు చూడూ అదే ఇది! ఆ రోజుల్లో "సత్యపీఠం" అన్నారు. ఈ రోజుల్లో 'సత్యపాపం' అంటున్నారు. అదీ తేడా...

"అయినా నిజం చెప్పడానికి ఎన్ని దమ్ములుండాలి! ఎవరో మహానుభావు డన్నట్టు 'లక్ష వుక్కు గుండెలు- వేలకొలదీ ఇనపనాలికలూ కావాలి, వొక్కనిజం పలకడానికి. కానీ ఈ రోజుల్లో వొక్క పెగ్గు చాలు మొత్తం పగ్గాలన్నీ తెంచుకోడానికి! అయినా ఎందుకా భయం. అల్లుడింట్లో హాజరయాక రేజరు పడని



మామెవడుంటాడు చెప్పు! నువ్వెంత కోతలు కోసినా... ప్రతిభావారి మిరియాలు తాటికాయలంత వుండవు. అల్లుడు - అల్లరి జంటపదాలు. తెలియకపోతే రాసుకో!"

"సర్లెండి రెండొందలు తగలేసి, ఆ చేదువిషం తాగి, వాగకపోతే.... అందరూ చేరారు కదా కబుర్లు చెప్పరాదూ" అంది వదిన విసుగ్గా.

"సర్లెండి. రెండొందలు నే తగలేసానా? ఎవరేనా అదర్ ఎండ్ ఆఫ్ మౌత్ తో నవ్వుతారు... ఎందుకంటే గుమ్మడికాయలు గుమ్మాలంట పోతోంటే... నువ్వుగింజ మోకాల్నెట్టి నొక్కిందట నీలాంటిదే! ఇంతవరకూ నువ్వెంత తగలేసావో లిష్టు చెప్పనా?" అన్నాడు చిన్నన్నయ్య ఆవేశంగా....

వదిన ఏదో సమాధానం చెప్పబోయింది. కానీ పెద్దన్నయ్య నిషాలో మాట్లాడుతున్నాడూ వూరుకో అని సైగ చేసాడు. అది కాస్తా చిన్నన్నయ్య చూసేసాడు.

"ఏరా అన్నయ్యా నాకు మందు నిషా, నీకు క్రికెట్టు నిషా, నా చిన్నప్పటి నుండి చూస్తున్నా వాడెవడో వంద కొట్టాడు. వీడు తొంభైతొమ్మిది దగ్గర అవుటయ్యాడు. అంటూ నువ్వు రిటైరయ్యావు గానీ ఈ రోజు ఇండియా గెలిచింది అంటూ ఎప్పుడేనా మందు కొట్టించావా? నువ్వెప్పుడూ రేడియో పట్టుకు కిచకిచలాడ్డమే కాని ఇండియా గెలిచిన పాపాన పోలేదు! వొరేయ్ అన్నయ్యా నేనిలా అంటే నీకు కోపం వస్తుంది గానీ నీ బి.పికి కారణం ఆ ఇంజనీరూ, వడేకరూ, పకోడి, జీడి.. వోళ్ళుకాదూ!" అంటూ పెద్దన్నయ్య మీద దాడిచేసాడు.

కానీ పెద్దన్నయ్యకి తన హీరోలని చిన్నన్నయ్య చిన్న చూపు చూడడం నచ్చలేదు అందుకే... "వొరేయ్ చిన్నా నిషాలో అలాగే అనిపిస్తుంది కానీ... క్రికెట్‌లో పటోడీ వున్నాడుగానీ పకోడీలేదు. అలాగే జీడీకాదు వాడి పేరు బేడీ" అన్నాడు.

చిన్నన్నయ్య తప్పు దిద్దుకుంటూ ఆ!ఆ! అవును ఆ తర్వాత గభాస్కరు, కపిలదేవుడు వగైరా వగైరా. వొరేయ్ అన్నయ్యా నాకు తెలీకడుగుతాను, అంత మంచిపేరు? 'భాస్కరు' అని వుండగా? ఆ పేరు ముందర 'గ' ఎందుకు పెట్టుకున్నాడురా?" అన్నాడు. అమాయకంగా మొహం పెట్టి......

పెద్దన్నయ్య చిన్నన్నయ్యని దీర్ఘంగా చూసి "రేపొద్దున్న చెప్తాను అప్పుడర్ధ మవుతుంది. ఇప్పుడేం చెప్పినా బుర్రకెక్కదు, అయినా చిన్నా, తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు అని.. అన్నీ మా గురించే చెప్తున్నావ్, నీగురించి చెప్పుకునే దేదేనా వుందా?" అన్నాడు చిన్నన్న వాగ్ధారకి అడ్డేద్దామన్న వుద్దేశంతో..

"హో హో" అంటూ కళ్ళెగరేసాడు చిన్నన్నయ్య. "నాదేముందిరా అన్నయ్యా పొద్దున్నే పోతాను. వొ పది సుద్దముక్కలు బోర్డుమీద అరగదీస్తాను, సాయంకాలం ఇంటికొచ్చి జేబులో చిల్లరుంటే వొ పెగ్ కొడతా, లేకపోతే "వంట" అంటూ మా ఆవిడ చేసిన పదార్థాల్లో లేని రుచులు వెదకి, అవి కనబడితే సరి... లేకపోతే "బెటర్ లక్ టుమారో అని సర్దిచెప్పుకు బెడ్ ఎక్కుతా! అంతే కాదు ఆర్నెల్లకోసారి డి.ఎ పెరిగితే సంతోషిస్తా, ఎరియర్స్ వస్తే మా ఆవిడ సంతోషిస్తుంది. ఇందులో ప్రత్యేకంగా చెప్పుకోడానికేముంది. ప్రతి వుద్యోగస్థుడి ఇంట్లో వున్న "షో" ఇదే కదా" అన్నాడు.

"చిన్నా పతివ్రత కబుర్లు చెప్పకు. స్కూలు లీవింగ్ సర్టిఫికేటుకి పదేసి రూపాయలు వసూలు చెయ్యడంలేదూ?" అన్నాడు పెద్దన్నయ్య కసిగా.

"వో అదా! ఏదో ఏడాదికోసారి స్కూలు లీవింగ్ సర్టిఫికేటు పిల్లలకిచ్చినప్పుడు, వాళ్ళ సంతోషం కొద్దీ, నా లివింగ్ కని వాళ్ల దగ్గర పదోపరకో పుచ్చుకుంటాను. ఆ మాత్రానికే నేను గబ్బర్‌సింగ్ అన్నట్టూ ప్రపంచాన్ని దోచుకుతింటున్నట్టూ మాట్లాడతావేరా? అయినా కలియుగ ప్రథమపాదంలో ప్రతిమనిషిలోనూ పాతిక శాతం కళ్ళు అంటే సెల్ఫ్ వుండాలి! అది యుగధర్మం. దాన్ని తప్పుగా అర్థం చేసుకోకూడదు. నే మాట్లాడేది సెంట్‌పెర్సెంట్ కుళ్ళుగాళ్ళ గురించి." అన్నాడు చిన్నన్నయ్య గుక్క తిప్పుకోకుండా...

"నువ్వు పదొచ్చుకున్నా బుల్లోడు వందుచ్చుకున్నా వొకటే!" అంటూ తనలో తను గొణుక్కున్నాడు, పెద్దన్నయ్య. కానీ ఆ గొణుగుడు కాస్తా చిన్నన్నయ్య పట్టేసాడు.

"అలా గొణక్కురా పెద్దోడా, ఏరీ మన తమ్మయ్యగారు?" అంటూ నన్ను చూసి "వీడు చూడు వున్నది ఇద్దరు! మొగుడూ పెళ్ళాం, గవర్నమెంటు వారిచ్చిందే ఎక్కి తొక్కి! పిల్లా జెల్లా ఎవరూ లేరు. వెనకటి కెవర్తో చెప్పినట్టు నిలబడి దంపినా అదే పిండి ఎగిరెగిరి దంపినా అదే పిండి' అయినా కక్కుర్తి ! ఎవడేనా అందించే డబ్బుల కోసం టేబులుకింద చేతులు పెట్టి నలిపేసుకోడం ఏముంది? ఆ ఎ.సి.బి.వాడు టేబులుకింద నుండి షెష్పాలు అందించాడు. వీడు అదే గడ్డని కరిచేసాడు. రుచి తెలిసేసరికి, సస్పెండయి ఇంట్లో కూర్చున్నాడు." అన్నాడు చిన్నన్నయ్య

చిన్నన్నయ్య ఆగడానికి నాకు బలే కోపమొచ్చింది. అయినా ఏం చెయ్యలేక "అదేం కాదురా అన్నయ్యా కోర్టులో కేసేసాను తీసుకోలేదని నిరూపిస్తా" అన్నా



సీరియస్‌గా.

"వొరెయ్ 'అమ్మ పుట్టిల్లు మేనమామ దగ్గరా' అన్నట్టు కబుర్లు చెప్పకు. మీ ఆఫీసరేమన్నాడూ, 'నావాటా నాకివ్వకుండా, వాడిలా ఎన్ని డబ్బులు కొట్టేసాడో? వాడెలా తిరిగి డ్యూటీలో జాయిన్ అవుతాడో చూస్తాను.' అన్నాడట కదా. ఇంక నువ్వు మీ ఆవిడకి తోడుగా ఇంటిదగ్గర కూర్చోవలసిందే" అన్నాడు చిన్నన్నయ్య.

పొద్దున్న ఎంత సానుభూతిగా మాట్లాడాడు. అసలు మనసులో వున్న ఆలోచన్ని మనసుని వదిన పట్టేసింది. "ఇంక అయిన పంచాయితీ చాలుగానీ ఫలహారం తిని పడుకోండి." అంది.

కానీ చిన్నన్నయ్య అది వినిపించుకోలేదు. "ఈ పంచాయితీలో చివర్న వీడియోల విషయింపు వుండాలే... " అంటూ మొదలుపెట్టాడు.

ఆ మాటకి అంత సీరియస్‌గా వున్న పెద్దన్నయ్య, నేనూ చిన్నన్నయ్య కొడుకులిద్దరూ పకాలున నవ్వాం! ఎందుకంటే ఏ ఫంక్షనుకేనా కుటుంబం అంతా వొకచోట చేరితే, వీడియో తెప్పించుకు చూడ్డం అలవాటు, దాన్నే చిన్నన్నయ్య చెప్పుతున్నాడు.... మా నవ్వులు ఆగగా నే......

"ఏమర్రా ఏ తెలుగు సినీమా తెచ్చుకున్నారు. అయినా ఆ సినీమాల్లో ఏముందని అలా చూస్తారు? ఎప్పుడూ ముణుకుల విదిలింపూ, గుబ్బల కదిలింపూ హీరోయిన్ పులిపిర్రలమీద మద్దిలదరువూ... పాటలు మన ప్రారబ్ధం అన్నట్టు వుంటే! మాటలు మన శ్రాద్ధం అన్నట్టు వుంటాయి. ఇంక మీ సంగతేమిటంటే మూడుగంటల సినీమా చూసినా కుతితీరదు మీకు ... వి.సి.ఆర్ తేరగా వచ్చిందని అబ్బాయిదో, అమ్మాయిదో పెళ్ళి కేసెట్టెట్టుకు చూసెయ్యాలి. పెళ్ళి కేసెట్టు చూస్తున్న వాళ్ళు చూస్తూ వూరుకుంటారా? వాడే మా వేలువిడిచిన చిన్నాన్నగారి రెండోకొడుకండి, అల్లవొంగున్నాడు చూసారూ వాడు మా అన్నయ్యకి కాలో వేలో ఏదో విడిచిన మేనల్లుడండి. అల్లపక్కనే వుంది చూసారూ మొగుడ్ని వదిలేసిన రెండో ఆడబొడుచండి, ఆ పక్కనే వున్నాడు చూసారూ, మా రెండోఆడబడుచుని వదల్ని నాసిరకం కాశీబావగారండి" అంటూ హిస్టరీ చెప్పుకొని మురిసిపోరా"! అన్నాడు చిన్నన్నయ్య దీర్ఘంగా.

"కూతురి పెళ్ళి కేసేట్టు చూస్తే బావగారికి లక్షరూపాయల ఖర్చు జ్ఞాపకం వస్తుంది గావల్ను" అంది మా ఆవిడ. దీని వుద్దేశం బావగార్ని వేళాకోళం ఆడదామని, కానీ చిన్నన్నయ్య వేళాకోళం పట్టేశాడు.

"ఏమేవ్ నీకు నన్ను వేళాకోళం చేసేంత నాలెడ్జి పెరిగిందా? నీ పెళ్ళి కేసెట్టు చూసినా నీబాబు నాలాగే భోరుమంటాడు. ఈ పెళ్ళిళ్ళూ డబ్బు తగలేసుకోడాలూ అన్నీ సంప్రదాయాన్ని నిలబెట్టడానికే. ప్రతిభావారింట వెలిసిన చిరుదీపం ఈ బొట్టెడు. ఈ రోజు అన్నప్రాసన'' అంటూ చిన్నన్నయ్య మనవడి మీద దాడి చేసాడు.

చిన్నన్నయ్య సీరియస్‌నెస్ చూసి వదిన వూరుకోలేదు. "వాడ్నేమనకండి,, ఆ పసివాడు కూడా మీకు తప్పుగానే కనబడతాడు...'' అంది.

"హాసేవ్ పిచ్చి బామ్మా - నేను వాడ్నేం అనడం లేదు.. ప్రతిభావారి వంశోద్ధారకుడి మైల్‌స్టోన్స్ చెప్తున్నా... అంతే విను. వాడు మూడ్నెల్లకి బోర్లపడ్డాడా? పడ్డాడు. అయిదు నెల్లకి పాకరడం మొదలుపెట్టాడా? పాకిరేడు... అందుకే అన్నప్రాసన చేసేసాం, ఇంక, ఫ్యూచర్లో ఏడునెల్లకి అడుగులేస్తాడు! పదినెల్లకల్లా, అత్త అత్త అంటూ వాళ్ళ అత్తగార్ని తలుచుకుంటాడు. ఏడాదికల్లా చకచక నడిచి, చేతికి దొరికినవి ఎత్తుకెళ్తాడు.

వీడికి నాలుగోయేడు వచ్చేసరికల్లా వీపు మీద చిన్నగోనెబస్తాలాంటి పుస్తకాల సంచీ పెట్టి, రంగుచెడ్డీ, జుబ్బా వేసి కాన్వెంటుకి తోలేస్తాం.

వీడు కాన్వెంటులో జాయిన్ అవడం వూరోళ్ళ ఖర్మ అన్నట్టు, ఇంటికొచ్చిన ప్రతీవాడి ముందూ "జాక్ అండ్ జిల్'' పద్యం చెప్పరా అని మనం గుంటడి ప్రాణాలు తోడేస్తే వాడా పద్యంపాడి ఎదుటివాడి సహనం పరీక్షిస్తాడు. అంతేగాని వీడ్ని వీధిబడిలో వేసి వీడిచేత దసరా పద్యం చదివించడం మనకి నామోషీ! వీడి తెలుగుతనం ఎదుటివాళ్ళ దగ్గర ప్రదర్శిస్తే వాళ్ళు మనల్ని లేకి వాళ్ళనుకుంటా రేమోనని భయం! అంతే కాదోయ్.....

ఆంధ్రులము మేము
అన్నదమ్ములము
చరితలో పేరున్న
జాతివారలము
తెలుగువారము మేము తీపిబెల్లాలం
తెచ్చి పెట్టండమ్మ తెగువతో మాకు
మాకోటి చాలుగా మా సూరలడ్డూ
మాష్టారిగారి కొక మాడయే చాలు
మళ్ళిరా పోయిరా వెళ్ళి రమ్మనక
మనసార మాకిచ్చి సాగనంపండి!



అని ఇంటింటికి వెళ్ళి పాడితే, అడుక్కునే వాళ్ళన్న అపోహపడే అవకాశం వుంది.

పువ్వులు విరజిమ్మే దసరా బాణాలని వదిలేసి ప్లాస్టిక్ స్టెన్‌గన్‌తో 'డుష్ డుష్'' అని అరుస్తూ ..... అడుక్కుంటే మనం మోడ్రన్!

అయితే ఈ జాక్ అండ్ జిల్ భాగోతం ఎన్నాళ్ళూ, ఫీజులు కట్టగలిగినంత వరకూ, ఆ తర్వాత ఫీజులు కట్టలేక చతికిలబడి, ఐదోక్లాసు కొచ్చేసరికి, మునిసిపాలిటి మురికిబడే గతి! ఈ మైలుస్టోన్లన్నీ దాటి, వాడు పదో తరగతి కొస్తే, అక్కడ పబ్లిక్ పరీక్షలో పబ్లిగ్గా తప్పడం తప్పదు. అప్పుడు ఏడు చేపల కథలోలా వాడ్ని.... ఏరా ఏరా ఎందుకు తప్పావు?'' అంటే

"కిరంజీవి సినీమా అడ్డొచ్చింది''

కిరంజీవి కిరంజీవి సినీమాలోకెందుకొచ్చావు?

"మా నాన్న చిరంజీవి సాంప్రదాయం నిలబెట్టడానికి''

"చిరూ చిరూ నీ సాంప్రదాయ మేమిటి?''

"నీ యమ్మ అదీ తెలీదా పంబలేపెయ్యడం హె''

"సినీరచయితా సినీరచయితా పంబంటేమిటి?''

"లేపెయ్యడానికి తేలికైంది లేచిపోయేది.''

ఆ విధంగా వీడి పంబలేచిపోతుంది. ఇంక పరీక్ష ఎలాగూ పోయింది కదా అని వీడు అయిదేళ్ళపాటు శ్రీదేవి కూతురు జాహ్నవినో, హేమమాలిని కూతురు ఈషనో ఆరాధించి వొకానొక సమయంలోజాన్వా? ఈషా? తెలుసుకోలేక, బి. ఆర్ నాట్ టు బి? అన్నట్టుగా డైలమాలో పడతాడు! ఇంకా తర్వాత మైలు స్టోన్లన్నీ మనకి తెల్సినవే'' అంటూ వూపిరి తీసుకోడానికి ఆగాడు చిన్నన్నయ్య.

చిన్నన్నయ్య చెప్పిన దాంట్లో అతిశయోక్తి ఏంలేదు అనిపించింది. జీవితాన్ని మార్చుకోగల శక్తి వుండీ, ఈగానుగెద్దు జీవితానికి అలవాటు పడ్డ మధ్యతరగతి మందభాగ్యులకి, ఈ మందే భాగ్యం అనుకున్నా....

వదిన "ఫలహారం చెయ్యండి'' అన్నదానికి సమాధానంగా... "చత్ బంచత్ ఫలహారం? ఈరోజేనా సుఖంగా వుండనీ'' అంటూ హాలులోంచి తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకున్నాడు.

చిన్నన్నయ్య పడుకున్న రెండునిమిషాలకి ''గుర్రు'' వినిపించింది. చిన్నన్నయ్యకి సౌండ్‌స్లీప్ లేక చాలారోజులయింది! ఇప్పుడున్నది స్లీపింగ్ సౌండే!.

★

# కామిడీ ఆఫ్ కరెక్ట్స్

పూర్వం షేక్స్‌ఫియర్ కామిడి ఆఫ్ ఎర్రర్స్ అనే నాటకం రాసి పాఠకుల్ని షేక్ చేసాడా. కాని ఇప్పుడు నేను బావగారి గురించి రాస్తూ కామిడీ ఆఫ్ ఎర్రర్స్ అని రాస్తే, బావగారికి కోపం రావచ్చు! బావగారికి కోపం వస్తే అక్క షేక్ అయిపోతుంది. అందుకే ఈ కథకి కామిడీ ఆఫ్ కరెక్ట్స్ అని పేరు పెట్టా! ఎందుకంటే బావన్నవాడెవ్వడూ తప్పుల్చేయడు కాబట్టి!

చిన్నప్పుడే బావగారికి మంచి లాజిక్ అలవడింది. ఆయన నాలుగో క్లాసు చదువుతుండగా పరీక్షలకోసం ప్రిపేరవుతూ "కొమ్ములులేని రెండు చెట్ల పేర్లు తెలుపుము? అరటిచెట్టూ, కొబ్బరిచెట్టూ'' అని అన్నదే ఒకటికి పదిసార్లు వల్లెవేస్తున్నారట.....

అది విన్న వాళ్ళ మేనమామ చిరాకేసి బావగారిని రెక్కట్టుకుని పెరట్లోకి ఈడ్చుకెళ్ళి "వొరే అదిగో అరటిచెట్టు, అల్లది కొబ్బరిచెట్టూ, దానికోసం ఇంతలా హైరాణాపడి వల్లెవేయడం ఎందుకురా చెవలాయ్'' అంటూ విసుక్కుని కొత్తం మీద వొక్కటిచ్చుకున్నారు.

ఆనాటి నుండి బావగారిపేరు చెవలాయ్ చెలామణి అయింది. అది వేరే విషయం కానీ, ఆయన్ని చెవలాయ్ అనుకోడం మేనమావగారిదే పొరపాటు!

ఎందుకంటే మర్నాడే ఇంకో పుస్తకం పట్టుకుని "అన్నము అన్నవాహికగుండా ప్రేవులలో ప్రవేశించి... అక్కడనుండి ఫలానా ఫలానాగా మార్పులు చెంది... అంటూ ఆహారము జీర్ణమయే విధానాన్ని వల్లెవేయడం మొదలుపెట్టారు. ఆ వల్లెవేసే విధానం కూడా మేనమావ గదిలో ఒచ్చినప్పుడల్లా గొంతు పెంచి మేనమావ వేపు చూస్తూ... ఇప్పుడు చెప్పు పొట్టచించి అన్నవాహిక చూపిస్తావా?'' అన్నట్టుగా వుంది.

ఆ విషయం అర్థం చేసుకున్న మేనమామ'' వీడూ తెలివైనవాడే, కాకపోతే వీడి తెలివితేటలు వీడి కొంపేనా తీస్తాయి. లేదా ఎదుటివాళ్ళ కొంపేనా ముంచుతాయి, ఏదో ఒకటి తథ్యం'' అన్నార్ట.

ఆ విషయం మా అక్క పెళ్ళయేవరకూ నా కర్థంకాలా! ఎందుకంటే నేనోసారి అక్కను దిగబెట్టడానికి వచ్చినప్పుడు ఊరు కొత్త కదా అని నాన్నగారు ఫలానా



రోజున బండికి మా అమ్మాయి వస్తోంది, స్టేషనుకొచ్చి రిసీవ్ చేసుకోండి అని చెప్పి ఉత్తరం రాసారు.

నాన్నగారు చెప్పిన ప్రకారం బావగారు మమ్మల్ని రిసీవ్ చేసుకోడానికి, అరగంట ముందుగా స్టేషనుకొచ్చి కూర్చున్నారు. ఆ రోజు ట్రెయిన్ మూడుగంటలు లేటు. స్టేషన్లో వట్టినే కూర్చోడమేం అని బావగారు ఆ మూడుగంటల వ్యవధిలో అక్కనీ, నన్నూ, మావగార్ని అంటే మా నాన్నగార్ని, ట్రైన్నీ, రైల్వేస్టేషన్నీ, రైల్వేమంత్రినీ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి కాలక్షేపం చేసారు.

నేను, అక్కా ట్రయిన్ దిగ్గానే మూడు గంటలుగా ఎక్కుతున్న హీట్‌కి మేము గురయ్యాం! మా మీద విరుచుకు పడ్డారు. ట్రెయిన్ లేటొస్తే అందులో మా తప్పేమిటో నా కర్థం కాలేదు. అది కాదట, అలాంటి ట్రయిన్ ఎక్కి రావడం మాదే తప్పట! మా వూర్నించి ఇట్రావడానికి మరో ట్రయిన్ లేదంటే వినిపించుకో లేదు. అసలలాంటి ఊర్లో ఉండడమే మా ఖర్మ అన్నట్టు మాట్లాడేరు. ఆ తిట్టడం హడావిడిలో పడి, ప్లాట్‌ఫారం మీదున్న స్తంభాన్ని గుద్దేసారు. అక్క, "అరెరె చూసుకు నడవండి'' అంటూ గాబరా పడిపోయింది.

అది బావగారికి చిన్నతనం అనిపించి "ఏమిటి చూసుకు నడిచేది, అడ్డమైన చోటల్లా స్థంభాలు పాతెయ్యడమే! దరిద్రపు వెధవలకి... ఓతీరు తెన్నులేదు'' అంటూ అక్కమీద లేచారు. ఆపాటికి అక్కే రైల్వేవాళ్లతో చెప్పి ఆ స్థంభాన్ని అక్కడ పాతించినట్టు!

ఇది జరిగిన రెండు రోజుల్లో నా తిరుగుప్రయాణం వచ్చింది. బావగారు ససేమిరా ట్రైన్ టైముకన్నా ముందుగా స్టేషనుకి రావడానికి ఒప్పుకోలేడు, ట్రైన్ ఎలాగూ లేటే, ఎందుకా గాబరా అంటూ... నా తొందర్ని కొట్టిపారేసారు. ట్రైన్ టైముకి అరగంట లేటుగా స్టేషనుకి చేరుకున్నాం!

ఆ రోజు నా కర్మకాలి ట్రైన్ కరెక్ట్ టైముకి వచ్చి వెళ్ళిపోయింది. ట్రైన్ తప్పిపోయి నేను బాధ పడుతూంటే... బావగారు స్టేషన్లో చిందులు తొక్కుతూ "చూసావా దరిద్రపు ట్రైన్‌కి ఓ టైమంటూ ఏడవదు. ఎప్పుడు ఏ టైముకి వస్తుందో దానికే తెలీదు'' అంటూ రైల్వే మినిష్టరు దగ్గరనుంచి... ఆ ట్రైన్ రూట్లో ఉన్న మామగారిని.. ఈ ట్రైన్ విషయం తెలుసుకోకుండా... మా సంబంధం ఒప్పుకున్న వాళ్ళ నాన్నగార్ని, ఓ దులుపు దులిపి వొదిలిపెట్టారు. ఈసారి.... సిట్యువేషన్‌లో ఇంప్రూవ్‌మెంట్ ఏమిటంటే? స్టేషన్లో దేన్నీ ఎవర్నీ గుద్దేయలేదు.

ఈవిధంగా బావగారు చేస్తున్నవి ఒప్పులో, ప్రపంచంలో జరుగుతున్నవి

తప్పులో నాకర్థంకాలేదు. కానీ ట్రైనూ.. దాని మినిష్టరూ మా చుట్టాలు కారు కదా! మా బావగారే కరెక్ట్! ఆయన చెప్పినవే ఒప్పులు! అలాంటి ఒప్పుల్లో ఇంకోటుంది ఏమిటంటే?

బావగారికి మగ పిల్లలమీద మోజు. అందుకే వంశోద్ధారకుడు కావాలంటూ పిల్లమీద పిల్ల, పిల్లమీద పిల్లగా అయిదుగురు ఆడపిల్లల్ని కన్నారు (అపార్థం చేసుకోకండి)

అది తెల్సిన వాళ్ల మేనమామ ఆరోసారి అక్క కడుపుతో ఉందని విని, బావగార్ని పట్టుకుని "ఏమిట్రా నీ ఆగడం, ఈసారీ ఆడపిల్ల పుడితే ఏం చేస్తావ్?" అంటూ నిల్దీసారు. "ఈ రోజుల్లో కూడా ఇంతమంది పిల్లలా? అయినా దాని ఆరోగ్యం గురించి ఏమైనా ఆలోచించావా?" అంటూ చీవాట్లేసాననుకున్నారు.

కాని బావగారు మాత్రం తొణకలా "ఇది నాతప్పు కాదు" అన్నారు.

"మరెవరిది?" అంటూ ఆశ్చర్యపోయారు. మేనమావగారు.

"ఈ తప్పు ప్రభుత్వం వారిది. ఎందుకంటే ముందుగా ప్రభుత్వం ముగ్గురే చాలు అన్నారు. ముగ్గుర్నీ కన్నాను. తర్వాత ప్రభుత్వం వారు మాట మార్చి ఇద్దరే చాలు అన్నారు. ఇద్దర్నీ కన్నాము. ప్రభుత్వానికి నిలకడ లేదు. మళ్ళీ మాట మార్చి ఒక్కరే చాలు అంటోంది. అందుకే మా ఆవిడ కడుపుతో వుంది. ఇందులో నా తప్పేముందో చెప్పు మావయ్యా!" అంటూ మేనమావను నిల్దీసారు.

బావగారి లాజిక్కి మేనమావగారు ఖంగుతిని 'నీ తప్పేంలేదురా.. నిన్నీ ప్రశ్నేసాను చూడూ అదీ నా తప్పు' అని గొణుక్కుంటూ సీను నుండి నిష్క్రమించారు. ఈ విధంగా బావగారికి ఆరో సంతానంగా మగపిల్లవాడు వుదయించాడు. వాడ్ని చూసి ఇంటిల్లిపాది మురిసిపోయారు. కాని, ఆ మురుపు ఎంతోకాలం నిలవలేదు.

గుంటడికి (ముద్దుపేరులెండి, దిష్టి తగలకుండా) ఆర్నెల్లు వచ్చిన దగ్గర్నించి, ఇంటికొచ్చిన ప్రతివాళ్ళూ కుర్రాడి నోట్లో వేలెట్టి చూసి "అమ్మో దంతాలు గట్టిపడ్డాయి... కొరకడానికి ప్రయత్నిస్తున్నాడు" అన్నారు.

అక్కడితో ఆగలేదు."ఇంకేముంది పళ్ళొచ్చేస్తున్నాయ్" అన్నారు సంబరపడ్తూ.

వాళ్ళకన్నా సంబరపడింది బావగారే... అందుకే రోజూ కాలేజీనుండి ఇంటికి రాగానే కుర్రాడి నోట్లో వేలెట్టి చూడ్డం అలవాటయిపోయింది. ఎన్నాళ్ళకీ నోట్లో పళ్ళు తగలకపోయేసరికి బావగారికి మనస్తాపం పట్టుకుంది.



గుంటడి పళ్ళ శ్రేయోభిలాషులంతా నోట్లో వేలెట్టడం వల్ల గుంటడికి విరోచనాలు పట్టుకున్నాయి. దాంతో ఇల్లూ, పక్కబట్టలూ ఎత్తుకునిన వాళ్ళ బట్టలూ పాడుచెయ్యడం మొదలుపెట్టాడు. నోట్లో పళ్ళు వస్తున్నందుకే విరోచనాలు అవుతున్నాయి అన్నారు.

విరోచనాలు ఎంత బాగా అయితే అంత గట్టి పళ్ళు వస్తాయి అన్న నమ్మకంతో బావగారు గుంటడికి విరోచనాల మందు ఇప్పించలేదు. విరోచనాలకి గుంటడు సంగోర్రైపోయాడు. కానీ పళ్ళు మాత్రం రాలేదు.

బావగారికి చింత పట్టుకుంది. పక్కవాళ్ళ సానుభూతులు, బంధువుల సలహాలతో అది ఎక్కువైంది. అదే సమయంలో కాలేజీ ప్రొఫెసరు పళ్ళు రావడానికి మందులున్నాయోయ్, హోమియోపతి మందివ్వనా అని అడిగాడు. బావగారికి ఆశ కలిగింది. హోమియోపతి మందు తీసుకొచ్చి వేసారు.

మొదటి డోసు కదా అని తక్కువ పొటెంసీ వేసారు. మొదటి డోసుకి పళ్ళు రాలేదు గాని జ్వరం వచ్చింది. జ్వరం తగ్గడానికి అల్లోపతి మందు వేసారు. జ్వరం తగ్గింది, కాని పళ్ళు రాలేదు. జ్వరం తగ్గేసరికి పళ్ళు జ్ఞాపకం వచ్చి పొటెన్సీ పెంచి హోమియోమందు వేసారు. ఈసారి జ్వరమూ రాలేదు, పళ్ళూ రాలేదు. బావగారికి ఆతృత ఎక్కువై హోమియోపతి కొలీగ్‌ని పొటెన్సీ పెంచమన్నారు. ఆయన పొటెన్సీ పెంచి మందివ్వడానికి ఒప్పుకోలేదు. అల్లోపతి ట్రై చెయ్యమన్నాడు. బావగారు అల్లోపతి డాక్టర్ని కంసల్ట్‌చేసి బోల్డంత ఫీజుచ్చుకుని కందిబద్దంత మాత్రలు రెండు తీసుకొచ్చి వేసారు. ఆ మందుకి ఏ యాక్షనూ లేకపోగా ఎక్కడ ఎలా రియాక్షనిచ్చిందో తెలీదుకాని గుంటడు మాత్రం రాత్రంతా ఒకటే ఏడుపు! వాడు నిద్ర పోలేదు. ఇంకొకళ్ళని నిద్రపోనీలేదు. దాంతో బావగారు ధన్వంతరీపతిని అంటే ఆయుర్వేదం ట్రైచేసారు. ఈ ప్రయత్నాలన్నీ జరిగేసరికి మూడు నెలలు గడిచాయి. గుంటడికి సొట్ట పన్నొకటి బయటపడింది.

బావగారి ఆనందం ఆకాశానికంటింది. ఆయనకి మందులమీద నమ్మకం పెరిగిపోయింది. మందుల వల్ల అనేక లాభాలున్నాయనే విషయం పసిగట్టిన బావగారు, దాని ప్రచారానికి పూనుకున్నారు.

ఈ వ్యవహారం తెల్సి చుట్టుపక్కలవాళ్ళు బావగారింట్లో ప్రతీదీ మందులవల్లే జరుగుతుందనే అభిప్రాయానికి వచ్చేసారు. బావగారింట్లో లోపాలు వెతికి దానికి తగ్గ మందులు సూచిస్తూ వచ్చారు. అలాంటి లోపాల్లో ఒకటి, పదకొండో నెలొచ్చినా గుంటడు నడవకపోవడం. ఇంటికొచ్చిన ఇరుగూపొరుగూ "ఏమిటీ మీవాడు

గుమ్మాలట్టుకునేనా నిలబడతున్నాడా, లేదా? మావాడు పదో నెలకల్లా గునగునా నడిచేసాడు'' అనడం మొదలుపెట్టారు, వాళ్ళ అబ్బాయి నడిచెయ్యడం దేశానికి వుద్ధరింపు అన్నట్టు, వీళ్ళబ్బాయి నడవకపోవడం దేశానికే తీరని ముప్పు అన్నట్టు మాట్లాడుకోసాగారు.

దాంతో బావగారికి మనస్తాపం పట్టుకుంది. అదే సమస్యని హోమియోపతి కొలీగ్‌తో చెప్పి ఏదేనా మందిమ్మని అడిగారు. ఆ హోమియోపతి కొలీగ్ బావగారిని పైనుండి కిందవరకూ చూసి, ఏమందూ కలపకుండా పంచదార గోళీలిచ్చాడు. వాటిని తీసుకొచ్చి కుర్రాడిచేత తినిపించారు బావగారు. రెండు రోజులు మందులేసినా, కుర్రాడు లేచి నిలబడకపోయేసరికి, బావగారు హోమియోపతి కొలీగ్‌ని పోటెన్సీ పెంచమన్నారు. హోమియోపతి కొలీగ్ మళ్ళీ గోళీలిచ్చాడు. ఇదే విధంగా కుర్రాడు లేచి నిలబడే వరకూ ట్రీట్‌మెంటు జరిగింది. బావగారికి మందులమీద నమ్మకం భక్తిగా మారింది.

కానీ గుంటడికి మందుల గండం మళ్లీ నాలుగోయేట వచ్చింది. బావగారి పుత్రరత్నానికి ఏ నర్సరీ స్కూల్లోనూ సీటు దొరకలేదు. దానికి కారణం నంగిరితనం అంటారు. కానీ గుంటడి స్టాండర్డ్ కి స్కూళ్ళు సరిపోవడంలేదేమో నన్న అనుమానం వచ్చింది. అదే విషయాన్ని మేనమావకి ఉత్తరం వ్రాసారు. బావగారి మందుల పిచ్చి తెలిసిన మావయ్యగారు "ఒరే చవటాయ్, నీ కొడుకు తెలివికి, ఈ బాబా బ్లాక్‌షీప్ కల్చర్‌గాళ్ళ తెలివితేటలు సరిపోవు. విశాఖపట్నం కొండల్లో ఓ సాధువున్నాడు. వాడికి భస్మ విద్య తెల్సు. వెళ్ళి భస్మం తెచ్చుకో.. కుర్రాడికి సీటక్కరలేకుండానే జ్ఞానోదయం అయిపోతుంది'' అని తిరిగి రాసారు.

ఆ ఉత్తరం చూసి, బావగారు గుంటడ్ని కాళిదాసంతటివాడ్ని చేద్దామనే ఉద్దేశం వచ్చి విశాఖపట్నంలో కొండలన్నీ తిరిగి, యోగి గాని, భస్మం గాని దొరక్క నిరాశపడిపోయారు. కొండలన్నీ తిరిగిన బావగారి ఆయాసానికి జాలిపడి, హోమియోపతి కొలీగ్ "నేనో మందిస్తాను. పట్టుకెళ్ళి, కుర్రాడ్ని ఇంటర్‌వ్యూకి తీసుకెళ్ళి హెడ్‌మాష్టారి రూములోకి తీసుకెళ్ళేముందు పట్టించు. మందు మహత్యంతో మీ అబ్బాయికి సీటొచ్చి తీరుతుంది'' అన్నాడు. అది విని బావగారికి ఆనందం వేసింది. ఆ రాత్రి కల్లో గుంటడు యూనిఫాం వేసుకుని స్కూలుకెళ్ళినట్లు కనబడింది.

ఈసారి గోళీలిస్తే బావగారు నమ్మరేమో?అని హోమియోపతి కొలీగ్, వాళ్ళ యింట్లో పెరట్లో ఉన్న వేపచెట్టు ఆకు తీసి రసం తయారుచేసి, చిన్న సీసాలోపోసి, బావగారికిచ్చాడు.

బావగారు దాన్ని భద్రంగా ఇంటికి తీసుకొచ్చి మర్నాడు ఇంటర్‌వ్యూకి వెళ్తూ మందు కూడా తీసుకెళ్ళేరు. ఇంటర్‌వ్యూలో బావగారి పుత్రరత్నంకాక మరో పదిమంది పిల్లలున్నారు.

ప్రిన్సిపల్ క్లాసులన్నీ మొదలయ్యాక తన రూముకొచ్చి సావకాశంగా కూర్చుని, ఇంటర్‌వ్యూ మొదలు పెట్టింది. ఇదే సరైన సమయం అని బావగారు సీసాడు మందూ గుంటడికి పట్టించేసారు. చేదు కాస్తా నశాలానికెక్కి, గుంటడు ఏడవడం మొదలుపెట్టాడు. దాంతో ఇంటర్‌వ్యూకి వచ్చిన మిగతా పిల్లలు బెంబేలు పడినా ..... తర్వాత వాడొక్కడే ఏడిస్తే బాగుండదని, తామూ ఏడుపులంకించుకున్నారు. ఈ పదిమంది ఏడుపులూ, ఒపేరాలో శృతి తప్పిన వయొలిన్‌లా మోగుతూవుంటే, ఈ సంగీతానికి శాస్త్రకారుడెవరో చెప్పినట్టు, శిశుర్వేత్తి పశుర్వేత్తి అన్నట్టుగా పక్కనే ఉన్న నర్సరీలో పిల్లలు చలించి, వాళ్ళూ ఏడుపు మొదలుపెట్టారు. దాంతో నర్సరీస్కూలు హోరెత్తిపోయింది. ప్రిన్సిపాల్ ఠారెత్తిపోయింది. "వీళ్ళందర్నీ తీసుకుపొండి'' అంటూ విసుక్కుంది.

దాంతో పిల్లల తండ్రులు దీనంగా మొహం పెట్టి, తామెంత కష్టపడి ఈ రోజు పిల్లల్ని ఇంటర్‌వ్యూకి తీసుకొచ్చామో చెప్పుకున్నారు. అసలే చికాకుగా ఉన్న ప్రిన్సిపాల్ ఏడుస్తున్న పిల్లల్ని వదిలించుకోవాలని, "మీ అందరికీ సీట్లు ఇచ్చాను. మీరిక్కడ్నించి పొండి''అంది. ఆ విధంగా గుంటడికి సీటొచ్చి, బావగారికి మందుల మహత్తు అర్థం అయింది.

ఈ పెరిగిన నమ్మకం బావగార్ని చాలా దూరం తీసుకుపోయింది. ఆయన కొలీగ్ ఒకాయన ఏమిటోయ్, నీజుత్తు తెల్లబడిపోడం చాలా విచిత్రమే! అంటూ ఆశ్చర్యపోయాడు.

ఆయన ఆశ్చర్యం ఈయన దిగులుకు కారణం అయి కూచుంది. చాలా రోజులు ఆలోచించి, హోమియోపతి కొలీగ్‌ని "తెల్లజుత్తు ఎలా పోతుంది'' అని ప్రశ్నించాడు. హోమియోపతి కొలీగ్, గొద్రేజి రంగేసుకోండి అన్నాడు. ఎప్పుడూ మందుల దృష్టితో ఉండే బావగారికి గోద్రేజి మందేసుకొండి అన్నట్టనిపించి, మందుల షాపుకు వెళ్ళి, గొద్రేజి మందుందా అనడిగారు. ఓద్రేజి రంగు అమ్మే షాపువాడికి గోద్రేజి మందు అని వినబడినా, తప్పు విన్నానేమో, ఈయన రంగే అడిగుంటాడు అనుకొని, ఆ వుంది అన్నాడు.

ఎందుకంటే ప్రజల్లో చాలా విషయాల్లో ఇల్యూషన్ ఉంటుంది. విజన్ ఇల్యూషన్

చూపు భ్రమ, హియరింగ్ ఇల్యూషన్ వినడం భ్రమ అని అనేకమైన ఇల్యూషన్స్ ఉన్నాయి. అదే ముళ్ళపూడివారు బుడుగుచేత నిజం చెప్పించేవరకూ వాళ్ళ బాబాయ్ సుబ్బలక్ష్మి ముక్కు బావుందన్నాడో, ముగ్గు బావుందన్నాడో ఎవరికీ తెలీలేదు. అదొక్కటేకాక ఈ మధ్య మందుల షాపుల్లో కాస్మటిక్స్ కూడా అమ్మడం బావగారి దురదృష్టం.

షాపువాడు గొద్రేజి రంగు పేక్ తీసి బావగారికి ఇచ్చాడు.

బావగారు దాన్నింటికి తీసుకొచ్చి, ఓ సుముహూర్తాన ఓ సీసాడు రంగు గుటుక్కున తాగి, నేలమీద అడ్డంగా పడిపోయారు. అప్పుడు ఇంటిల్లిపాదీ భోరున ఏడ్చారు. దాంతో వీధిలో వాళ్ళంతా వచ్చి, బావగారిని హాస్పటల్‌కి తీసుకెళ్ళారు. అక్కడ ఎనీమాతో, మిగతా సాధనాలతో బావగారి కడుపంతా స్టెరిలైజ్ చేసి, బావగార్ని బతికించారు.

ఆ విషయం తెలిసిన మావయ్యగారు పళ్ళు పటపటాకొరికి, వెధవకి కడుపు కాదు, మెదడు స్టెరిలైజ్ చెయ్యాలి అన్నారట! అదెలాగో!

వాహిని (ఆస్ట్రేలియా)

ఏప్రిల్ 2003

★



# క్లెవర్ గర్ల్

"నీకో మంచి కథ చెప్తా ... కూర్చో" అన్నాడు చలపతి

"ఎందుకు?" అన్నాను.

"ఆంధ్రజ్యోతి'కి రాసుకోవచ్చు......"

"నువ్వే రాయి" అన్నా విసుగ్గా...

"నాకు చెప్పడమే కాని రాయడం రాదు"

"అయితే చెప్పు"

"మొన్న వైజాగ్ వెళ్ళానా....."

"శ్యామల దగ్గరకేనా?"

"ఆ! అదే ఇంజనీరు బావగారింటికి, నే వెళ్ళేసరికి ఏదో జరిగినట్టుంది బావగారు యమ సీరియస్సుగా ఉన్నారు.

నన్ను చూడగానే "రండి - రండి " అని ఆహ్వానించారు. శ్యామల్ని లేపారు.

శ్యామల బద్ధకంగా లేచి కాఫీ పెట్టడానికి వంటింట్లోకి వెళ్ళి "అదేమిటే బావగారు అంత చికాకుగా ఉన్నారు? ఏంజరిగింది?" అని అడిగాను.

అది సమాధానం చెప్పలేదు కాని, బావగారు మాత్రం పరిగెట్టుకు వచ్చేసారు.

"చూడండి - దోభీ బట్టలు తీసుకు వచ్చాడు. ఎన్ని తీసుకు వెళ్ళాడో, ఎన్ని తెచ్చాడో పద్దు ఉండద్దూ! అబ్బే! ఇది పద్దు వేసింది గాని, దాన్ని ఆ గుంటముండ (బావగారి కూతురు) తీసి పారేసిందేమో!" అంటుంది. అదీ అలాంటిదేలెండి" అన్నారు.

"మరి దోభీ బట్టలు సరిగ్గా తెచ్చాడా?"

"అదే చూస్తున్నాను"

"మరి పద్దు లేదు కదండీ?"

"అందుకే, నాకు ఉన్న బట్టలెన్నో లిస్టు తయారుచేసాను. గుంటముండకి ఎన్ని బట్టలున్నాయో లిస్టు తయారుచేసాను. అందులోంచి ఇంట్లో ఉన్న బట్టలు తీసేసి, మిగతావి వాడు తెచ్చాడో లేదో చూసాను."

"సరిపోయాయా?" అన్నాను. ఆశ్చర్యంగా, బావగారి తెలివితేటలకి ముచ్చటేసింది.

"ఆ! సరిపోయాయి. ఇంత కష్టపడ్డ తరువాత సరిపోక ఏం చేస్తాయి, పద్దు

జాగ్రత్తగా రాస్తే ఈ గొడవలన్నీ తప్పునుకదా!" అన్నారు ఆయన నీరసంగా.

"నిజమే. శ్యామల పద్దు జాగ్రత్తగా దాచవలసింది. ఆయన గాబట్టి అంత కష్టపడ్డారు. నేనయితే వాడు తెచ్చినవాటితో సరిపెట్టుకొనేవాడ్ని." అన్నాడు చలపతి.

"మీ బావగారి ఎనాలిసిస్ బావుందోయ్" అన్నాను చిన్నగా నవ్వుతూ...

"హౌ సిల్లీ షి ఈజ్?" అందామనుకున్నాను. కాని ఎంతయినా చెల్లెలు కదా! బాధ పడతాడేమో అని అనలేదు.

"బావగారు కాఫీ తాగేసి, ఆఫీసులో పనుంది అంటూ వెళ్లిపోయారు" అంటూ మొదలుపెట్టాడు చలపతి.

"అంత ఆయన్ని కష్టపెట్టే బదులు పద్దు పుస్తకం కాస్త జాగ్రత్తగా దాచచ్చు కదే?" అన్నాను శ్యామలతో, శ్యామల చిన్నగా నవ్వింది.

"ఎప్పుడూ ఆయనా, దోభీ ఒక్కసారి తారసపడరురా. ఇవాళ నా దురదృష్టం" అంది శ్యామల నవ్వుతూనే.

"నీకు మాత్రం పద్దు లేకపోతే ఏం తెలుస్తుందే?"

"ఎందుకు తెలీదు! ఆయనవో ఆరు జతలు, గుంటవో పది గౌనులు, నాలుగు దుప్పట్లు, మూడు తువ్వాళ్ళు, ఇంతేగా జ్ఞాపకం ఉండవా.. నాకు గుర్తుంటాయిలే... అదాయన నమ్మరు.....! " అంది తేలిగ్గా.

"మరి నీ బట్టలు?"

"ఉతుక్కుంటాను. లాండ్రీకి వెయ్యను"

"ఎంతైనా పద్దు వేసేవు కదా, పుస్తకం జాగ్రత్తచెయ్యవలసింది. చూడుఎంత హైరాణా పడ్డారో బావగారు" అన్నాను మందలింపుగా. రెండు నిముషాలు మౌనంగా వుండి, "అసలు చాకలిపద్దు పుస్తకం అంటూ ఏదీ లేదురా!" అంది శ్యామల. కంగుతిన్నాను..... కంగు చలపతే కాదు కథవింటున్న నేను కూడా తిన్నా....

"మరి బావగారికి ఆవిషయం......"

"..................."

"అమ్మ బాబోయ్! చెప్పకు, నే వచ్చిన దగ్గర్నించీ ఎన్ని బట్టలు పోయాయో అని బెంగపెట్టుకుంటారు" అంది నవ్వుతూ. ఇంకా చలపతి ఏదో చెప్తూనే ఉన్నాడు కానీ....

"హౌ క్లవర్ షి ఈజ్!" అనిపించింది. పైకి మాత్రం అనలేదు....

ఎందుకంటే చలపతి కిప్లింగ్ కొటేషన్ చదివి వుంటే!

ఆంధ్రజ్యోతి 21.2.1986



# ఇది నా తప్పు కాదు భాయి

"ఏమండోయ్! కాకి అరుస్తోంది. అన్నయ్య వస్తాడేమో?" అంది శ్యామల.

వాళ్ళ అన్నయ్య రాడని నాకు బాగా తెలుసు. కాని అలా అనలేదు, ఉడుక్కుంటుంది. ఎందుకంటే ఈ రోజు శ్యామల ప్రసన్నంగా ఉండడం ఎంతైనా అవసరం. వాళ్ళన్నయ్య రాడు కాని, ఎవరొస్తారో తెలుసు. కాకి అబద్ధం చెప్పదు కదా!

పేకాట బోర్డు మెంబర్లు వస్తారన్న మాట. వాళ్ళు వస్తారని చెప్పి, శ్యామల దగ్గర అప్పోజిషను భరించే కన్నా..... వాళ్ళు వచ్చాక ఏదో, కాజువల్‌గా ఆడక తప్పదన్నట్టు మొహం పెట్టి, పేకాట ఆడాలి.

ముందుగా శ్యామలకి తెలిస్తే అమంగళం తప్పదు. శ్యామల డిఫెన్స్ కూడా చాల దారుణంగా వుంటుంది. అంతవరకూ పక్కమీద, సోఫామీద ఉన్న దుప్పట్లు కవర్లు ఒక్కసారి కనబడవు. ఈ విషయంలో శ్యామల్ని నిందించక్కరలేదు. ఎందుకంటే... ఈ బాధ్యత అంతా రెడ్డిదే!

రెడ్డి ఎప్పుడు వచ్చినా... పేంటు, షర్టు విప్పి పర్సు పట్టుకు పేకాట రంగంలోకి దిగడం అలవాటు... ఆ అలవాటు బాగానే వుంది కాని, లోపల ఎలాస్టిక్ కట్ డ్రాయరు బోర్డు మెంబర్లని ఆకర్షించకుండా (అంటే బాధ పెట్టకుండా) తాత్కాలికంగా, అక్కడ ఉన్న డోర్ కర్టెనో, సోఫా కవరో, లుంగీలా ఉపయోగించుకునేవాడు. నాకు తెలిసున్నంత వరకూ, ఆ డోరు కర్టెనుతోనే ఇంటికెళ్ళే అవసరం అతనికి రాలేదు.

ఆట సాగుతూంటే అధిక శక్తిని ఉత్సాహాన్ని ఇచ్చేవి సిగరెట్లు, కాఫీలు వగైరా వగైరా... కాఫీలు అంటే జ్ఞాపకం వచ్చేది శర్మగారిల్లే. ఆయన ఇంట్లో ఎప్పుడు పేకాట వేసినా, ఆ మహా ఇల్లాలు, కాఫీలో, టీలో సప్లైచెయ్యడం కద్దు. అంటే ఆవిడ "స్వీట్‌హోమ్" నవల చదవలేదని కాదు. చదివినా, ఇద్దరు పిల్లలు, మార్పురాని ఇంటాయనతో యుద్ధం చేసిచేసి అలసిపోయుండచ్చు ఇంకా మా సంసారం అలసిపోయే స్థితికి రాలేదు. అంచేత శ్యామలతో ఇవాళ పేకాట ఉంది అని చెపితే, ఉన్న పాలన్నీ గుంటముండ చేత (మాఅమ్మాయి లెండి ) బలవంతాన తాగించేస్తుంది. ఇంక మనం కాఫీకో, చాయ్‌కో అప్పీలు చెయ్యనక్కరలేదు. పాలు తాగలేక

అది ఏడిస్తే... కాఫీ టీల్లేక మేం గిలగిల్లాడ్తాం...

చాయ్ లేకపోతే బాలకృష్ణ ఊరుకోడు, "శర్మగారింటికి పోయినా బావుండును. టీయేనా ఇచ్చేవారు" అంటాడు.

అసలు బాలకృష్ణ ఎలాంటి వాడంటే ఇటు ఆటలు కొడుతుంటాడు, అటు బోర్డు మెంబర్లని మాటలతోను కొడుతుంటాడు. ఈయనకి దేవభాష బాగా వచ్చు. ప్రతి వాక్యానికి చివర ఏదో ఒక అలంకారం (ముదరబూతు) ఉంటుంది. ఆ అలంకారం నిత్యనూతనంగా వుంటుంది.

బాలకృష్ణ ఎ.సి. (ఆల్ కవుంట్)లో ఉండి ముక్కలు రాకపోతే బోర్డుమెంబర్లని విశాఖపట్నం వీధి కొళాయి స్థితికి దిగజార్చేస్తాడు.

బాలకృష్ణ అన్నా శ్యామలకి భయమే! "బాలకృష్ణ వస్తున్నారా?" అని అడుగుతుంది. అవునంటే చెవుల్లో దూదులుపెట్టుకుంటుంది. బాలకృష్ణుడి మాటలు అంత ముద్దొస్తాయి.

ఇదే కేటగిరీకి చెందిన మరో ఇద్దరుఉన్నారు. ఇద్దరూ బావల వరసే. (ఒకరికొకరు).

ఒకరు గోపీ. పేరు ఎవరు పెట్టారో కాని అచ్చు గోడమీది పిల్లే. ఈయన లెక్కల్లో దిట్ట! అన్ని రకాల లెక్కల్లో.... ఒక్కదాంట్లో మాత్రం చాల వీక్ - స్వంత ఓకులు లెక్కపెట్టడంలో!

ఒక పాయింట్‌లో రూపాయి మిగులుతుంది అంటే ఆ లెక్క తప్పిందన్న మాటే, దానికి ముద్దుగా వాళ్ళు పెట్టే పేరు "ఓక్ బాడ్"

"ఓక్ బాడ్" థియరీ కనుక్కొన్నవాడు అస్కు (A S G K) ఇద్దరూ ఆట కొట్టినా కష్టమే! కొట్టకపోయినా కష్టమే! ఎందుకంటే ఇద్దరూ ఒకేసారి ఆటకొట్టడం ఇంపాజిబుల్ కాబట్టి.

ఎవరో ఒకరు ఓడిపోవడం తప్పదు. గెలిచిన వాడు కార్డులు ఎలా వచ్చాయో, ఎలా ఆట కొట్టాడో చెబుతుంటే.... ఓడిపోయిన వాడు గెలిచిన వాడు ఆట ఎందుకు కొట్టాడో ఎనాలిసిస్ మొదలు పెడతాడు.

ఎనాలిసిస్ (కారణాలు) అంటే వాడు కాలి మీద ఒంటేలికి పోసుకున్నాడని, ఏదో తొక్కి వచ్చాడని వగైరావగైరా... ఒకవేళ వాడికి సమయానికి ఒంటేలికి రాకపోతే పక్క ఆటగాడ్ని తీసికెళ్ళి ఆ పని పూర్తి చేయించుకున్నాడని అనడం కద్దు.



ఎంతవరకూ నిజం అన్నది మనకి తెలియదనుకోండి.

కాని ఒక్కొక్కొప్పుడు నాకు వాళ్ళ మాటల్లో నిజం ఉందేమో అనిపిస్తుంది.

ఈ బావమరుదులు ఇలా ఏడిస్తే (వీళ్ళు ఏడవడంలో ముక్కు తిమ్మన సత్యభామని పోలిస్తే) మాకు భట్టుమూర్తి గారు కూడా ఒకాయన ఉన్నారు.

పార్థసారథి రంగులో మాత్రమే కృష్ణుడి పోలిక... ఒకర్తే భార్య... నాన్న ఎక్కడ పేకాట ఆడుతున్నా పసిగట్టి అమ్మకి చెప్పేసే ఒక కుర్రరత్నం ఉన్నారు.

ఆ కుర్ర రత్నం అమ్మకి చెప్పేక.... మన పార్థసారథుల వారు ఏంచేసారు? అని బోర్డుమెంబర్లు ఇంతవరకూ చర్చించలేదు. ఆవిడ నెత్తిమీద తన్నినా మనకి తెలీదు... వీడు చెప్పడు.... అయితే పార్థసారధి మాత్రం పేకాటకి రావడం మానలేదు.

పార్థసారధి స్వతంత్రంగా ఏం మాట్లాడడు, ఎవరో జోకు వేసినా తరతమ భేదం లేకుండా నవ్వగలడు. కాని.. అతని రియాక్షన్ అతని గెలుపు ఓటముల మీద ఆధారపడి ఉంటుంది. గెలుస్తూంటే నవ్వుతాడు... ఓటమిలో విసుక్కోడం ... ఒక్కోసారి ఉడుక్కోడం కూడా... కద్దు.

వీళ్ళందరిలో పేకాటే పంచప్రాణాలుగా ఆడే చంద్ర ఒకడు. వీడు నవ్వడు. మాట్లాడడు, జోకులెయ్యడు... వీడికి పేకాటంటే ఆబ... వీడిని "జూద కసి" అనవచ్చు అప్పుడప్పుడు "మసి" కూడా...

ఇన్ని బాధలు పడి పేకాట ఆడితే... శ్యామలమ్మ మూతి విరిచేస్తుంది (మొహంమీద) కొంచెం తీవ్రంగానే విరిచేస్తుంది. చంద్ర లాసులో వుంటే.... చంద్రా విరుస్తాడు మూతి.

ఆరోజు నుంచి .... ఉపోషాలు..... కాఫీలో పంచదార మర్చిపోవడాలు కూరలో రెండుసార్లు ఉప్పు వెయ్యడం అన్నం ఘన ద్రవ వాయు స్థితుల్లో రకరకాలుగా వండడం అఫ్‌కోర్స్ వాయుస్థితిలో ఇంతవరకూ వండలేదు అనుకోండి.

ఏది ఏమైనా... ఈ ప్రొఫెషనల్స్‌ది... అంటే మాది విషాద గాథే!...

ఏదో కళ చచ్చిపోకుండా పాటుపడుతున్నాము... కళని బతికిస్తున్నాము. మహాకవి శలవిచ్చినట్టు

"ఆ మహామహా నలమహారాజుకే తప్పలేదు భాయి.
ఇది మా తప్పుకాదు భాయి."

ఆంధ్రజ్యోతి - 15.5.1987

# ఖండిత

ఎండ మండించేస్తుంటే...నెత్తి మాడిపోతోంది.

ఏది ఏమైనా "హమ్ ఆప్‌కే హై కౌన్" సినీమా చూసెయ్యాలనే పట్టుదల సడలించలేదు శ్రీమతి.

సినీమా థియేటరు వరకూ భారీశరీరాన్ని మోసుకువెళ్ళడం కష్టం. రిక్షావాడు, ఐదురూపాయలు అడిగితే, వాడికి పీఠముడి లేదంటుంది శ్రీమతి. ఎండను బట్టి వాడు ఐదు అడగడంలో తప్పులేదు. ఎలాగైతేనేం నాలుగు రూపాయలకి రిక్షా... కుదిర్చింది.

రిక్షావాడు లాగలేక కష్టపడుతుంటే, శ్రీమతి సినీమాకి టిక్కట్టు దొరకవేమో! అని రోష్టు పడుతోంది. ఎవరికి ఏ రూపాన వున్నా కష్టం కష్టమే కదా!

రిక్షాహాలు చేరేసరికి, హాలు చుట్టూ విపరీతంగా జనం వున్నారు.

నా దగ్గర ఐదురూపాయలేవుంది. నా సంగతి శ్రీమతికి బాగా తెలుసు, నేను ఐదురూపాయలూ ఇచ్చే మూడులో వున్నానని పసిగట్టింది. నా చేతిలోంచి ఐదురూపాయలూ తీసుకుని, ప్రక్కనున్న శెనగల కొట్టు కెళ్ళి, రూపాయి శెనగలు కొని, శెనగల కొట్టు ఇచ్చిన నాలుగు రూపాయలూ, తీసుకొచ్చిరిక్షావాడి కిచ్చింది. రిక్షావాడు గొణుక్కుంటూ పోయాడు.

శ్రీమతి ముఖంలో విజయ సూచకంగా వెలిగిన చిరునవ్వుకి ముచ్చట వేసింది.

సినీమా మంచి రష్‌గా వుంది. టిక్కెట్లు దొరుకుతాయో లేదో అనే కంగారు ఎక్కువై బుకింగ్ వైపు పరిగెట్టింది శ్రీమతి.

బాధ్యతా నిర్వహణలో (అంటే టిక్కెట్లు తీసే తొందరలో) ఎదురుగా వస్తున్న మరోభారీ శాల్తీ ఢీకొట్టింది. చేతిలో వున్న శెనగల పొట్లం, స్వేచ్ఛ లభించిన పక్షుల్లా నలుమూలలకి, పరిగెత్తాయి. శ్రీమతి ఒక్క నిముషం అవాక్కయిపోయింది. రూపాయ శెనగలు నేలపాలు!

నేనేం సాధిస్తానో అనే ఆలోచన వచ్చి వుంటుంది... అందుకే గప్‌చుప్‌గా, వెళ్ళి క్యూలో నిలబడింది, సగం దూరం వెళ్లాక టిక్కెట్లు అయిపోతే వెనక్కి వచ్చేసింది.

ఆవిడ వెనక్కి వచ్చేసాక కూడా నేనేమీ అనకపోవడం, శ్రీమతికి కష్టం కలిగించి వుంటుంది.

"ఏమీ అలా మూతి బిగించుకుకూర్చున్నారు. శెనగలు పోయాయి. టికెట్లు దొరకలేదు. రిక్షావాడు తిట్టుకున్నాడు! అంతేనా మీరనేది?!

అసలు నేనేమీ అనలేదు. నేనేదైనా అనేస్తే శ్రీమతి తృప్తి పడును. కానీ....

"ఇంక ఇప్పుడు ఏసినిమాకి టిక్కెట్టు దొరకదు. ఎండలో ఏం తిరుగుతాం? ఇంటికి పోదాం, పద" అన్నా హాలు నుండి బైటకి వచ్చి, చూస్తే, ఒక్కరిక్షా కూడా లేదు.

బాగా ఎండగా వుండడం వల్ల ఏ రిక్షావాడూ కోలనీకి రానన్నాడు. తిరుగు బేరం వుండదని....

ఇద్దరం మెల్లగా ఎండ విహారం చేసి, (వెన్నెల విహారాలు ఎలాగూ లేవు, వాటికి టైము అయిపోయింది) ఇల్లు చేరుకున్నాం. ఇంటికి వచ్చి, ఇంక ఆపుకోలేక "నాలుగు రూపాయలు మిగిలాయి" అన్నాను ఆయాసంగా. అంతే!!!

"హమ్ ఆప్‌కే కోయి నహీహై" అన్నట్లు వంటచేసింది శ్రీమతి, ఆ విషయం ఆ రోజు రాత్రి అన్నం తాగుతున్నప్పుడు తెలిసింది.

ప్రగతి 1997

# ముచ్చటగా- ముగ్గురు

మహిళా మండలిలో హాటు కేకుల్లా అమ్ముడుపోయే సరుకులు ఏమిటంటే మొగుళ్ళు.... హస్‌బెండ్స్ ..... ఆయనలు.....

అఫ్‌కోర్స్ మూడూ ఒకటే అనుకోండి! ఏ స్త్రీ అయినా ఇంకో స్త్రీని కలిసిందనుకోండి, వాళ్ళ ఆయన గురించి మాట్లాడలేదు అంటే.... ఆవిడ పూర్తిగా ఆడదేనా కాకపోయి ఉండాలి. లేదా ఆవిడకు పెళ్ళైనా కాకపోయి ఉండాలి.

కొత్తగా పెళ్ళై మొగుడంటే కొంచెం గౌరవం ఏడిసిన లలన సిగ్గులుపోతూ "మాఆయన" అంటే ... జుత్తుకి, పెదవులకి రంగేసి, నల్ల కళ్ళజోడు పెట్టిన వగలాడి "మై హస్బెండ్ ఈజ్..." అంటుంది. నడివయసులో ముదిత ముచ్చటగా "ఈ మొగుడున్నాడు చూశారూ..." అంటూ ఏకవచనంలో దీర్ఘాలుపోతుంది.

ఆయన అన్నా హస్‌బెండ్ అన్నా, మొగుడు అన్నా, వాళ్ళు చెప్పదల్చుకున్నది వారి వారి మొగుళ్ళ గురించీ, వాళ్ళ బండచేష్టల గురించి, వాళ్ళతో ప్రత్యేకంగా పడుతున్న అవస్థల గురించీ, అన్నీ మనదేశంలో అంగ్రేజోడే కనుక్కున్నట్టు... దీన్ని గూడా హస్‌బెండ్‌లో... బెండ్‌పెట్టి తెలివిగా తప్పుకున్నాడు.

ప్రపంచానికి తెలిసిన రహస్యం... ఏమిటంటే పెళ్ళైన స్త్రీలందరికీ మొగుళ్ళు ఉంటారు. చచ్చోచెడో కాపురాలు చేస్తుంటారు.

అయినా ఏ స్త్రీ మొగుడు ఆ స్త్రీకి ప్రత్యేకం. ఇలాంటి వెర్రిబాగులవాడో, కర్కోటపువాడో, మతిమరుపువాడో ఇంకెవరికీ ఉండడు. ఇదీ మహిళామండలిలోని ప్రతి మహిళ ఆలోచనా......

ముందుగా ఈ అతివ ఏం చెపుతుందో చూద్దాం.....

"ఆయనా అండీ " అంటూ మొదలుపెట్టింది అతివ. "ఏం మనిషో పిలిచిన అరగంటకి పలుకుతారు. కాఫీ ఇస్తే .... స్నానానికి నీళ్ళెట్టలేదా అంటారు... స్నానానికి నీళ్ళు పెడితే .. బట్ట లేసుకుని ఆఫీసుకి పోతారు. భోజనానికి పిలిస్తే... పుస్తకం చదువుతూ కూర్చుంటారు. పుస్తకం చదువుకుంటున్నారు కదా అని పక్కింటికి వెళ్తే... ఆకలేస్తుంటే అన్నం పెట్టకుండా ఎక్కడికి వెళ్ళావు. అని గదమాయిస్తారు.

"ఏమి సంసారమో? ఏమిటో? ఒకసారి ఏంజరిగిందనుకున్నారు? మా అన్నయ్య వాళ్ళు వచ్చారు. అందుకని కూరలు... ఎక్కువగా తేవాలి..... నేను ఆయనా



మార్కెట్టుకి వెళ్ళి కూరలు తేవాలి, అని నిర్ణయించుకున్నాము. ఆయన నన్ను స్కూటరు మీద తీసుకువెళ్తాను, నీకు కావలసినవి నువ్వు కనుక్కో అన్నారు. నేను సరే అన్నాను.

తీరా బయలుదేరేవేళకి పనిమనిషి వచ్చింది. పనిమనిషితో పనిపూర్తి చేయించేసరికి చీకటి పడిపోతుంది. అందుకని మీరు వెళ్ళి కూరలు తెచ్చెయ్యండి" అన్నాను.

ఆయన అలాగే అని బుద్ధిగా తలూపారు. "ఏమిటేమిటి తేవాలో చెప్పు" అన్నారు. నేను పేరు పేరునా ఏమిటేమిటి తేవాలో చెప్పాను.

ఆయన మాయాబజారులో నల్లరామ్మూర్తిలా "ఒహో అలాగే!" అంటూ వెళ్ళిపోయారు.

గంటలోపల స్కూటరు మీద కూరలతో తిరిగి వచ్చారు.

"కూరలు చాలా ఖరీదుగా ఉన్నాయే!" అన్నారు.

"ఇప్పుడు కూరలు ఖరీదు ఏమిటి?" అన్నాను.

"ఏమో, కేజీ ఎనిమిది రూపాయలూ, పదిరూపాయలూనూ, చూసుకో.. అన్నారు. కూరలు రెండేసి కే.జీలు చెప్పాను. సంచీ చూస్తే వెలితిగా ఉంది. ఏ అరకేజీయో తెచ్చి ఉంటారు. రేపు మళ్ళీ నేను బజారు పోవాలి కావాలి దేముడా అనుకుంటూ, సంచీని వంపాను....

సంచీలోంచి జారిపడ్డ వాటిని చూతునుగదా, నా గుండాగిపోయింది.

"ఏమండీ!" అని కేకేశాను.

"ఏమైంది? అంత కేక పెట్టావు?" అంటూ ఆయన, ఆయన వెనుక అన్నయ్య పరిగెత్తుకొచ్చారు.

"ఏం తెచ్చారు?" అన్నా ఒళ్ళు మండి

"నువ్వు చెప్పినవే" అన్నారు సీరియస్‌గా.

"పచ్చిమిరపకాయలు ఎన్ని తెచ్చారు?"

"రెండుకేజీలు?"

"అల్లం?"

"రెండుకేజీలు వాడి దగ్గరలేదు, కేజీన్నరే తెచ్చాను"

"కొత్తిమీర?"

"అయిదురూపాయలది ఇరవై అయిదుకట్టలు!"

"వంకాయలు?"

"రెండువందగ్రాములు!"

"టమాటాలు?"

"వందగ్రాములు"

"తోటకూర కట్టలు?"

"రెండు అర్ధరూపాయి"

"మీకు నేనేమి చెప్పాను?"

"బావుంది అవే చెప్పావు, అవే తెచ్చాను"

చెప్పకేం? నాకు ఒళ్ళు మండిపోయింది.

"అయితే సరే రేపు అరకేజీ పచ్చిమిరపకాయలు కూరొండిపెడతాను. తిందురుగాని" అన్నాను ఉక్రోషంగా.

"సరే" అనేసి ఆయన వెళ్ళిపోయారు.

కాని వెనకాల నిలబడ్డ అన్నయ్య నిజంగా పచ్చిమిరపకాయల కూర వండుతాను అనుకున్నాడేమో! పొద్దున్నే లేచి "ఈరోజు భోజనానికి రాను. సింహాచలం వెళుతున్నాను!" అని వెళ్ళిపోయాడు.

★ ★ ★

"ఓ కిరణ్, మై హస్‌బెండ్...." అంటూ మొదలు పెట్టింది ఒగలాడి. "నేను పొద్దున్నే ఎనిమిది గంటలకి లేస్తానా, "గుడ్ మార్నింగ్" అని అప్పుడు కాఫీ కలుపుతాడు. లేచేసరికి కాఫీ ఇస్తాడేమో అని చాలాసార్లు ఎదురు చూసాను. నో! అంత అలోచన లేదు పూర్ కిరణ్‌కి"

"నాటోన్లీ కిరణ్. పూర్ చిల్డ్రన్, నేను లేచేసరికి స్కూలుకి వెళ్ళిపోతారు. నేను క్లబ్బు నుంచి ఇంటికి వెళ్ళేసరికి నిద్రపోతారు".

"నాటీ కిరణ్ ! ఏ పనితొందరగా చెయ్యలేడు. రోజూ క్లబ్బుకి లేటైపోతున్నాను. ఆ ఆఫీసు ఫైళ్ళలో ఏముందో రోజూ ఇంటికి లేటే! మళ్ళీ పేరుకి పెర్సనల్ మేనేజర్.

"ఓహ్, కిరణ్, హౌ సిల్లి హి-ఈజ్! గత మూడు రోజులుగా ఇండియన్ లిప్‌స్టిక్ వాడలేక చచ్చిపోతున్నాను. కలకత్తా పంపించి ఇంపోర్టెడ్ లిప్‌స్టిక్ తెప్పిస్తానంటాడు కానీ, ఏదీ, నాటోన్లీ దట్ మొన్న టు థవుజండ్స్ - ఓన్లీ టు థవుజండ్స్ - పెట్టి చీర



కొన్నానా"? ఇప్పుడు అంత ఖరీదు పెట్టి చీర ఎందుకు డాళింగ్?" అన్నాడు.

"వై హి కౌంట్స్ ఆల్ దట్? రియల్లీ వెరీ సిల్లీ, కదూ?" అంటూ మిగతా సభ్యుల మద్ధతుకోసం చూసింది.

చెపుతున్న మహాకథ ఎక్కడ ఆపేస్తుందో నన్న భయంతో అందరు సభ్యులూ ఏకగ్రీవంగా "ఎస్... ఎస్ హి ఈజ్ సిల్లీ?" అన్నారు వగలాడికి ఉత్సాహం ఎక్కువైంది.

"ఇదొక్కటే కాదు... వర్రీ... వర్రీ...వర్రీ ! పిల్లలూ, భవిష్యత్తూ, ఎప్పుడూ అదే గోల! వాళ్లా నే లేచేసరికి స్కూలికి పోతారు. నేను క్లబ్బు నుంచి ఇంటికెళ్ళేసరికి వాళ్ల గదుల్లో నిద్రపోతారు. ఈళ్ళెప్పుడు చదువుతారో ఏమిటో? పూర్ కిరణ్, పిల్లల పెంపకం గురించి పుస్తకాలు ఏమీ చదివినట్టు లేదు.

నూతన మహిళా సభ్యులందరికి ఉత్సాహం కలిగింది. "మేడమ్, మీరు ఇంటికి ఎన్ని గంటలకి వెళతారు?".

"ఆఫ్‌కోర్సు మన ప్రెసిడెంట్‌గారింట్లోనో, సెక్రటరీగారింట్లోనో పేకాట ఉందనుకోండి. వాచీలో డేటు మారుతుందంతే.... అదీ ఎప్పుడో. ఫ్రీక్వెంట్లీ ఐ గో బిఫోర్ ది డేట్ చేంజెస్. ఓహ్, ఒకసారి ఏమైంది అనుకున్నారు?" అని ఆపింది వగలాడి.

మహిళా సభ్యులందరికీ "పూర్ సిల్లీ కిరణ్" ఏం చేసాడో తెలుసుకోవాలనిపించింది.

"ఏమైందీ?" అడిగారు కోరస్‌గా.

"ఆ రోజు పొద్దున్నే ఎనిమిది గంటలకి లేచాను. మహిళా మండలికి పన్నెండు గంటలకి వెళ్దామనుకున్నాను. అందుచేత వంటికి కోడిగుడ్డు రాసి, బాగా ఆరనిచ్చి స్నానం చేద్దామని నా ఉద్దేశం. సౌందర్యపోషణ పుస్తకం చదివిన దగ్గరనుంచి వారానికి ఒకసారైనా ఇలా చేస్తున్నాను. నేను కాఫీ తాగి గుడ్డు కోసి ఫ్రిజ్‌తెరచి చూద్దును కదా కోడి గుడ్లు లేవు. నిన్న నాలుగు గుడ్లు ఫ్రిజ్‌లో పెట్టాను. ఇవాళ లేవు!

"కిరణ్ ఫ్రిజ్‌లో గుడ్లు ఏమైనాయి?" అన్నాను.

"నాలుగే వున్నాయి డియర్. పిల్లలకి ఆమ్లెట్లు వేయించి పెట్టేశాను. నిన్న బ్రెడ్ పుచ్చుకోడం మరచిపోయుంటాడు ప్యూన్" అన్న కిరణ్ సమాధానం ఒళ్ళుమండింది.

హౌ రెక్‌లెస్ యూ ఆర్? ఇంత నిరాదరణతో బ్రతికే కన్న చావడం మేలు.

మీ మగాళ్ళు అంతా ఇంతే. నే నుంచుకున్న నాలుగు గుడ్లూ ఆమ్లెట్టు వేసుకు తినేసారు. రేపు గుడ్డూలేక, బ్రెడ్డూ లేకపోతే నన్నే కాల్చుకు తింటారు. అసలు నేను అన్నదాన్ని ఇంట్లో ఉన్నానని ఎవరికేనా పట్టిందా? నన్ను ఇంత చులకన చేసేకన్నా ఒక్కసారి చంపేయరాదా? ఒకసారా రెండుసార్లా ఎప్పుడూ ఇంతే! మొన్న రెండువేలు పెట్టి చీర కొనుక్కుంటే, ఖరీదు ఎక్కువ పెట్టేశానని నిలదీశారు. నా లిప్‌స్టిక్ విషయం ఇంతవరకూ పట్టించుకోలేదు. ఈ రోజు కోడిగుడ్లు రాసుకుందామనుకుంటే అవి ఆమెట్లు వేసుకుని తినేసారు. ఈ సంసారం ఇంత దరిద్రంగా ఉంటుందని అనుకోలేదు'' అని కిరణ్‌ని పట్టుకుని నాలుగూ దులిపేసాను.

"పూర్ కిరణ్, ఎంత మంచివాడనుకున్నారు. అప్పటికప్పుడు బజారుకి వెళ్ళి డజను కోడిగుడ్లు పట్టుకొచ్చాడు. ఆ రోజు ఆఫీసుకి సెలవు పెట్టి... "నాది తప్పైపోయింది'' అంటూ ఎంత బతిమాలేడు అనుకున్నారు! ఆఫ్‌కోర్సు కిరణ్‌ని క్షమించాననుకోండి. ఎలాగో సర్దుకుపోవడం నేర్చుకోవాలి'' అంది వగలాడి... వగతో. ఒక ముదిత "మా ఆయనున్నారు చూశారూ...'' అంటూ మొదలుపెట్టబోయింది.

కాని మహిళా మండలి సభ్యులు "మాకు తెలుసు బాబోయ్!'' అని గోల పెట్టారు.

ఒకసారి మహిళా మండలిసభ్యులు వారివారి సంసారాలతో (అంటే భర్తలతో) చిన్న పిక్‌నిక్ ఏర్పాటు చేసుకున్నారు.

పిక్‌నిక్‌కి అందరూ వచ్చేసారు కాని, ముదితగారు రాలేదు. అందరు సభ్యులూ కళ్ళలో వత్తులు పెట్టుకుని ఎదురుచూస్తుండగా, ముదితగారి మొగుడు టపటపా స్కూటరు చప్పుడు చేసుకుంటూ వచ్చాడు. ఆయనతో పాటు ముదిత గారు రాలేదు. ఆవిడ లేకుండా ఆయన ఒక్కరే రావడం... అందరికీ ఆందోళన కలిగించింది.

అందరూ స్కూటరు చుట్టూ చేరి ఆతృతగా "ముదితగారి కేమయింది? ముదితగారి కేమయింది? రాలేదేం? రాలేదేం?'' అని అడిగారు.

ముదితగారి మొగుడు చాలా ఆశ్చర్యపోయాడు. వెనక్కి తిరిగి సీటువేపు చూశాడు. అక్కడ ముదితగారు లేకపోవడం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. "అరే, ఏమయింది? వెనుక సీట్లో ఉండాలే'' అన్నాడు.

దాంతో జరిగిన విషయం ఏమిటో సభ్యులకి అర్ధమైపోయింది. కాని, ముదితగారు అసలు స్కూటరు ఎక్కలేదో, లేక మధ్యదారిలో స్కూటరు మీంచి



పడ్డారో తెలీక అంతా అయోమయమైపోయింది.

కాని ముదితగారి మొగుడు పట్టువదలని విక్రమార్కుడిలా వెతుక్కుంటూ వెనక్కి వెళ్ళి ముదితగారు ఇంటిగేటు దగ్గరే నిలబడి కోపం తెచ్చుకుంటున్న సమయంలో ఆవిడకి క్షమాపణ చెప్పుకొని ముదితగారిని తీసుకుని డైరెక్ట్‌గా పిక్‌నిక్ స్పాటుకి వచ్చేసాడు.

పిక్‌నిక్ స్పాటుకి వెళ్ళాలంటే నావమీద నది దాటాలి. సభ్యులంతా ఉత్సాహంగా నావ ఎక్కి అవతలి ఒడ్డుకి చేరుకున్నారు.

నావమీంచి సిమెంటు చప్టామీద దిగిన ముదితగారి మొగుడు నాలుగడుగులు నడిచి ఆగిపోయాడు. ఆయన ఎందుకు ఆగిపోయాడో తెలీక అందరూ ఆగి వెనక్కి తిరిగి చూశారు.

ఆగిపోయినాయన సాలోచనగా "నే నేదో మరచిపోయాను '' అన్నారు.

అందరూ తెచ్చిన వస్తువులు లెక్కపెట్టారు. "అన్నీ ఉన్నాయి. ఏం మరచిపోలేదు '' అన్నారు ఏకకంఠంగా.

"కాదు, నేను రెండు చేతులతో ఏదో పట్టుకున్నాను. ఇవతలి ఒడ్డుకొచ్చేసరికి రెండు చేతులూ ఖాళీగా ఉన్నాయి.'' అన్నారాయన ధృఢంగా

ఆయన అవతలి ఒడ్డున ఏం మరచిపోయారో ఎవరికీ తట్టలేదు.

"ఇదే నావలో అవతలి ఒడ్డు కెళ్తేసరి '' అన్నారెవరో....

మళ్ళీ అదే నావలో ముదితగారి మొగుడు, మరి ముగ్గురు అవతలి ఒడ్డుకి బయలుదేరారు. నావ అవతలి ఒడ్డు చేరింది. ఈ ఒడ్డుని సిమెంటు చప్టా లేదు. అంతా బురదగా ఉంది. అందరూ రెండు చేతులతో ఫేంట్స్ ఎత్తి పట్టుకుని ఒడ్డు అంతా వెతికారు. ఎక్కడా ఏమీ కనబడలేదు. అలా రెండు నిముషాలు వెతికాక, తరువాత ముదితగారి మొగుడికి తాను, ఏం మరచిపోయారో జ్ఞాపకం వచ్చింది.

"ఆ జ్ఞాపకం వచ్చింది. పదండి పోదాం!''. అన్నారు.

అందరికీ ఆశ్చర్యం వేసి "ఏమిటి మరచిపోయారు?'' అని అడిగారు ఆతృతగా......

"నా పేంటు, నా పేంట్స్ రెండూ బురద అవకుండా నావ వచ్చేవరకూ పావుగంటసేపు ఎత్తి పట్టుకున్నాను. నావ ఎక్కి అవతలి ఒడ్డుకి చేరుకున్నాక సిమెంటు చప్టావల్ల పేంట్సు ఎత్తి పట్టుకోవలసిన అవసరం లేకపోయింది. రెండు చేతులూ ఖాళీగా అనిపించి ఏదో పట్టుకున్నది మర్చిపోయాను అనుకున్నాను.

ఏం మరిచిపోలే, థాంక్ గాడ్!'' అన్నారు ఆయన.

"మీకు తొందరగా జ్ఞాపకం వచ్చింది. లేకపోతే మమ్మల్ని చంపేవారు. థాంక్స్ గాడ్స్'' అనుకున్నారు అతనితో వచ్చినవాళ్ళు.

ఆంధ్రప్రభ 28.8.1989.



# అసమర్థుడూ - రొటీనూ

పల్లెలో కోడి కూతకి తెల్లవారితే, పట్నాల్లో కుక్క అరుపులకి తెల్లవారుతుంది. కుక్క అరుస్తోంది కానీ కాలు పట్టుకుంటుందనుకోలేదు. "చీ వదులు'' అన్నాడు సీతారామారావు.

"ఏమిటి చీ వదులు అంటున్నారు. తొందరగా వెళ్ళి పంచదార తెండి, పంచదార లేదు. కాఫీ లేదు'' అంది ఇందిర.

నిద్ర మత్తు వదలి తెలివి వచ్చిన సీతారామారావుకి, ఎదురుగా చింపిరి జుత్తుతో ఇందిర కనబడింది.

సుప్రభాత సుందరి చెప్పినట్టు బుద్ధిగా కొట్టుకు వెళ్ళి 'పంచదార' అన్నాడు.

కొట్టువాడు పంచదార ఉందనలేదు, లేదనలేదు. వాడి ఆనందం వాడిది. పదినిముషాలు నిలబెట్టాడు. పంచదార పట్టుకొస్తుంటే వీధి కొళాయి దగ్గర మంచినీళ్ళ కోసం హోరాహోరీ పోరాటం! పోరాటం లేకపోతే విముక్తి లేదు... జీవితమూ లేదు!

వీధి కొళాయి దగ్గర లేబరు క్లాసే రూలింగ్ క్లాసు, వాళ్ళు ఇస్తే నీళ్ళు, లేకపోతే లేదు కొళాయి దగ్గర కారాగింది. అందులోంచి బూర్జువా వర్గపు తొత్తు వర్కింగ్ క్లాసు వాడే దిగి, రెండు బిందెల నీళ్ళు పట్టుకుపోయాడు కార్లో... ఆస్కార్ ఎవార్డు నటులు కూడా పనికిరానంత గొప్పగా నటించారు కొళాయి దగ్గరున్న మిడిల్‌క్లాసు.

కొళాయి దగ్గర ఇందిర బిందెడు వినయం వొలకపోసి, చెంబుడు నీళ్ళు పట్టుకొచ్చింది.

బాత్రూము ఉందో పడిపోయిందో చూద్దామని సబ్బు పట్టుకొని బాత్రూము కెళ్ళాడు సీతారాముడు. బాత్రూము పడిపోలేదు. కాని లోపల నుండి గడి వేసి ఉంది. బాత్రూములో ఎవరున్నారో? ఎంతకీ రారే! కొంపతీసి బాత్రూము అద్దె కిచ్చెయ్యలేదు గదా? ఏమో ఇళ్ళ కొరత అలా ఉంది మరి! అనుకొన్నాడు.

బాత్రూము అద్దెకివ్వలేదు. బాత్రూము తలుపు తెరుచుకుని ఇంటి వాళ్ళమ్మాయి చీరని భుజాల చుట్టూ, మొల చుట్టూ చుట్టబెట్టుకుని, మిగతా సెంటర్‌ని స్ప్రెడ్ చేసుకుంటూ, ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఈ ఇంట్లో ఇదొక్క సౌకర్యం తప్ప, మిగతావన్నీ అసౌకర్యాలే అనుకున్నాడు

సీతారాముడు.

సబ్బు రాసుకునేలోగా బాత్రూము తలుపు ఎవడో దబదబా బాదేసాడు.

"ఎవరు? మగవారేనా? ఆ స్నానం ఏదో అక్కడే కానిచ్చేయ్యండి"

"ఏం మీరు మాత్రం మగవారు కాదా?" బైట నిలబడ్డతను చురక అంటించాడు.

"అందుకే ప్రమాదం. ఆడా మగా అయితే పర్వాలేదు. ఎందుకంటే ఇప్పుడు విశాఖపట్నం నిండా ఎన్.ఆర్.ఐ.లు ఎక్కువ కదా. వాళ్ళు బాత్రూములో ఆడా మగని సహించగలరు గాని, మగ, మగని చూసి అపార్థం చేసుకుంటారు. డాలర్లు పంపరు. రూపాయి విలువ తగ్గుద్ది" సీతారాముడి నవ్వు.

స్నానం కానిచ్చి ఇంట్లో కొచ్చేసరికి ఇందిర అనుమానంగా "ఇంతసేపు ఏం చేస్తున్నారండీ బాత్రూములో" అంది.

"స్నానం చేస్తున్నాను"

అయినా స్నానం ఎలా చేస్తారు? మట్టితో విగ్రహాలు చెయ్యొచ్చు, కంచుతో చెయ్యచ్చు, స్నానం ఎలా చెయ్యాలి? ఏదో తిరకాసు. నీళ్ళు పోసుకోడం! అమ్మో ఇది మరీ చెడు అర్థం వచ్చేటట్టుంది. అర్థం డబ్బు! అమ్మో ఆఫీసు! బస్సుకి టైమైపోతుంది.

"ఏమండీ టిఫిన్"

"బస్సు"

"ఏమిటీ బస్సులో చేస్తారా? అదేంకాదు లెండి- ఆ షీలాని చూసెయ్యాలి. టిఫినేనా వొదిలేస్తారుకాని, ఆ షీలాని వదల్లేరు" ఇందిర సాధింపు.

అపార్థాలు...అపార్థాలు.. జీవితమే పెద్ద అపార్థం.

బస్సు అరగంట లేటు... రిపేర్.

షీలా వస్తోంది. ఆమె "షీ"యే గాని "లా" ఉన్నది కాదు. అందాల్ని వొలకపోసుకుంటూ వస్తోంది. ఆమెకి ఎక్కువ అందాలున్నాయని కాదు. ఉన్న అందాల్ని బిగించికట్టి, వొలికేటట్టుగా నడుస్తోంది. ఆమె నడుం దగ్గర మడతలు, వంద రూపాయల మడతల్లా అందంగానూ, వందరూపాయల మడతలు పడిపోయిందే అని విచారంగానూ అనిపిస్తుంది. ఆమె బొడ్డు బ్లాక్ హోల్లా ఆకర్షనీయంగా ఉంది. సీతారామారావు ఇంకా ధైర్యం చేసును, కాని షీలా చాలా



దగ్గరగా వచ్చేసింది. వచ్చి "హై షీటారావుడూ" అంటూ పలకరించింది.

"చచ్చాన్రా బాబూ" అనుకున్నాడు షీటారాముడు.

ఎందుకంటే షీలాకి ఇష్టమైన విషయాలు, డి.ఎ. పెరుగుదల, ఇంక్రిమెంటు, ఎరియర్స్, ఫెస్టివల్ ఎడ్వాన్స్ వగైరా వగైరా. షీలా కంగారులో వయ్యారం వదలిపెట్టి, వికారంగా పరిగెత్తి బస్సు ఎక్కింది.

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు షీలాను తిట్టలేదు. సీతారాముడ్ని చడామడా తిట్టాడు. లేటు రావడం షీలాకి ఒక క్వాలిఫికేషను అంటాడు. ఫైలు ముట్టుకుంటే, పాపం అంటుకుంటుందేమోనని కాంటిన్ కెళ్ళాడు సీతారాముడు.

ఆఫీసుల్లో పనిచేసేవాళ్ళు చాలా మంది ఇలాగే పుణ్యం సంపాదించు కుంటున్నారు.

కేంటిన్ జీవి సుబ్రమణ్యం వొంటరిగా వుండడం దురదృష్టం. వాడికి ఇంకా షీలా వచ్చినట్టు తెలీదు. అనుకున్నాడు. సీతారావుడు.

సుబ్రమణ్యం ప్రస్తుత రాజకీయాల దగ్గర మొదలుపెట్టి, సినీమాల్లోకి వెళ్ళి, దేశార్థిక పరిస్థితి సమీక్షించి, స్వంత ఆర్థిక పరిస్థితిలోకి తిరిగి అప్పు అడిగేలోగా, కాఫీ అయింది అనిపించి బైటపడ్డాడు సీతారాముడు.

ఆఫీసులో ఫైలుకి దుమ్ము దులిపి, చీదుకొనేలోగా మధ్యాహ్నం పన్నెండున్నర అయింది. లంచ్‌కి టైమయ్యింది.

లంచ్ టైముకి, సుబ్రమణ్యం వచ్చి,"ధర్మపిండం ధర్మపిండం" అంటూ కేరేజీలో సగం పదార్థాలు తినేసాడు. తినడం అయిపోగానే మరి డిపార్టుమెంటులో కనబడలేదు. సగం కడుపు నిండడం వలన పనిచేయాలి అనిపించక, రాజుకి అరరోజు లీవులెటరు రాసిచ్చాడు సీతారావుడు.

రాజు "సీతారామారావుగారూ మీకు గవర్నమెంటు క్వార్టరు ఎలాట్ అయింది" అంటూ ఎలాట్‌మెంటు లెటరు ఇచ్చాడు.

రాజు డిపార్టుమెంట్‌లో నత్తలాంటివాడు. బరువు తరగదు అని తెలిసినా మోస్తూ ఉంటాడు. రాజు ఏనాడూ రాత్రి ఎనిమిది గంటలలోపల ఇంటికి వెళ్ళిన పాపాన పోలేదు. కొత్తలో వాళ్ళావిడకి అనుమానం వచ్చి కాస్త చదువున్నది కావడం వలన, హెడ్ ఆఫీసుకి పిటిషన్ పెట్టింది "నా మొగుడు మరోదానితో కాపురం చేస్తున్నట్టు అనుమానంగా ఉంది. ఇది చట్టరీత్యా నేరం కాదా" అంటూ...

హెడ్ఆఫీసు పూర్తిగా ఎంక్వైరీ చేసి, "అబ్బే మీ ఆయన ఆఫీసు అయిపోయిన

తర్వాత అంటే సాయంత్రం ఐదు నుండి ఎనిమిది వరకూ ఆఫీసులోనే పని చేస్తున్నాడు. ఇంకా అలా చెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఫ్యూచరులో ఇంకో దానితో పోయే అవకాశం లేదు. బెంగ పెట్టుకోకండి అని ఓ పది పేజీల రిపోర్టు పంపించారు. ఆ తర్వాత ఆవిడ (రాజుపెళ్ళాం) రాజు మీద ఆశ పెట్టుకోలేదంటారు. నిజం మనికి తెలియదు అనుకోండి! అలాంటి రాజుని డిపార్టుమెంటులో అందరూ ఉపయోగించుకుంటారు.

ఆరోజు లీవుపెట్టి, ఇంటికెళ్ళి ఇందిరని తీసుకుని సినిమాకి వెళ్ళి క్వార్టరు వచ్చినందుకు సెలిబ్రేటు చేసుకుందామనుకున్నాడు సీతారాముడు. కాని 'ఇందిర' జ్ఞాపకం వచ్చేసరికి, ఇందిర డిమాండ్స్ జ్ఞాపకం వచ్చాయి. ఇంటికెళ్తే పప్పు లేదనో, కూరలేదనో.. అంటూ ఏదో పురమాయిస్తుంది. దాంతో మూడు పాడవుతుంది. వొంటరిగానే సినిమాకి బయలుదేరాడు.

ఇంటర్‌వెల్‌లో, ఎదుటి రోలో ఇంటి వోనరుగారి వాళ్ళావిడతో సినిమాకొచ్చిన ఇందిర కనబడింది.

అగ్గిరాముడైపోయాడు సీతారాముడు. "నాకు తెలియకుండా ఎన్నాళ్ళనుండీ నువ్వు దొంగతనంగా సినిమాలు చూస్తున్నావు? అన్నాడు.

"ఆఫీసుకని వెళ్ళి, ఎన్నాళ్ళ నుండీ సినిమాలకి పోతున్నారు?'' అంది ఇందిర.

ఇద్దరూ దెబ్బలాడుకుంటూనే సినిమా చూసారు.

ఇద్దరూ దెబ్బలాడుకుంటూనే బైటకి వచ్చేరు. ఇద్దరూ ఒక రిక్షా చేయించుకుని ఇంటికి వచ్చారు. వెనకనుండి ఇంటి వోనరు పెళ్ళాం తిడుతోంది- అన్నీ సగం అని, ఇప్పుడు రిక్షా వాడికి పూర్తిగా డబ్బులిచ్చుకోవలసి వచ్చినందుకు. ఇంటికెళ్ళగానే ఇల్లు ఖాళీ చెయ్యమని చెప్పాలి అనుకుంది.

కాని ఇంటికి రాగానే ఇద్దరూ అంటే ఇందిర, సీతారాముడూ ఏకీభవించిన ఏకైక విషయం.

"ఇల్లు ఖాళీ చేస్తున్నామనడం'' విని డంగైపోయింది. ..... ఇల్లుగలావిడ.

★



# అసమర్థుడూ - హనుమాన్లూ

తెల్లవార్ఝామునే నోట్లో బ్రెష్ పెట్టుకొని బాల్కనీలోకి వచ్చిన సీతారామారావుకి ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి వొళ్ళుమండింది. అటూఇటూ చూసి ఎవరూలేరని నిశ్చయించుకొని 'హత్‌హత్' అన్నాడు.

అది విన్న క్రింద డైయాగ్నల్ నైబరు కూతురు, పక్కుమని నవ్వింది. అంత హాస్యం తెప్పించిన దృశ్యం ఏమిటంటే, ఆఫీసులో లోను తీసుకుని, సీతారామారావు సెకెండ్ హాండ్ మారుతీకారు కొన్నాడు. కానీ సీతారావుడికి కారు నడపడం రాదు. ఇంటి ముందు అలంకారార్థం పది రోజుల్నించి పడుంది. ఆ వీధి కుక్క, గోడగాని, స్థంభం గాని, అసరా లేకుండా లఘుశంక పూర్తి చేయనిది ఈ రోజు కొత్తగా కారు బోనెట్ దగ్గరకు వెళ్ళి, వెనక కాలు ఎత్తి దాని పని అది కానిచ్చేసింది. అది సీతారాముడి కంట పడింది.

ద్రౌపది నవ్వుకి దుర్యోధనుడికి కోపం వచ్చినట్టు, సీతారావుడికి చిన్నదాని నవ్వు కోపం తెప్పించి ఏది ఏమైనా కారు డ్రైవింగ్ నేర్చుకోవాలనిపించింది.

ఆఫీసులో బాసు డ్రైవర్ని పట్టుకుని "కారు డ్రైవింగ్ ఎలాగోయ్'' అని అడిగాడు!

కారు డ్రైవింగ్‌ని లెక్చర్ల ద్వారా నేర్చుకుందామన్న సీతారాముడి జ్ఞానానికి ముచ్చటేసి, "అదేముంది సార్ కారు స్టార్టు చేసి, క్లచ్ నొక్కి ఫస్ట్‌గేర్‌వేసి, మెల్లగా క్లచ్ వదులుతూ, ఏక్సిలేటర్ నొక్కితే కారు కదులుతుంది.'' అన్నాడు డ్రైవరు.

కారు దగ్గరకి తీసికెళ్ళి అవన్నీ వేలెట్టి మరీ చూపించాడు.

సీతారాముడు ఇంటికి వచ్చి, ఒకరోజు పొద్దున్న అవన్నీ చేసేడు. కారు బయలుదేరింది.

కాని ఎదురుగా ఉన్న ఎలక్ట్రిక్ పోల్‌కి గుద్దుకుని ఆగిపోయింది. కాలనీలో వాళ్ళు ఎవరూ చూడకుండా, దాన్ని వెనక్కి తోసుకువచ్చేసాడు సీతారావుడు.

మర్నాడు జరిగింది డ్రైవరుకు చెప్పాడు.

"సర్ స్టీరింగ్ కంట్రోలు చెయ్యలేదా?'' అని ప్రశ్నించాడు డ్రైవరు సీరియస్‌గా.

"అది నువ్వు చెప్పలేదు కదోయ్'' అన్నాడు సీతారావుడు అంత సీరియస్ గానూ...

ఆవిధంగా ఏకలవ్య శిష్యత్వంతో కారు డ్రైవింగ్ నేర్చుకున్నాడు. సీతారావుడు కారు నడుపుతున్నంతసేపు కాలనీ వాళ్ళు ఎవరూ వీధుల్లోకి వచ్చేవారు కారు.

అయినా కారు నేర్చుకుంటున్న దగ్గర నుంచి కారుని వీధి కాలువలోంచి బైటకు తీయడానికి (దానికి చక్రం లెండి) రెండొందలూ, పక్క క్వార్టరు వాళ్ళ ప్రహరీ గోడ కట్టించడానికి వెయ్యి ఆ వీధిలో కూరగాయలు అమ్ముకొనే వాడి బండి బాగు చేయించడానికి ఐదొందలూ, కూరగాయల ధర ఐదొందలూ, ఈ విధంగా చిల్లర మల్లరగా ఒక పదివేలు ఖర్చు అయ్యాక, సీతారావుడికి కారు డ్రైవింగ్ వచ్చేసింది, అన్న సంతృప్తి, సీతారావుడికి కారు డ్రైవింగ్ రాకచస్తుందా అని కాలనీ వాళ్లకి నమ్మకం పెరిగాయి.

కానీ సీతారాముడికి రాత్రిళ్ళు భయంకరమైన కలలు రావడం మొదలు పెట్టాయి. పోలీసులు పట్టుకెళ్తున్నట్లూ, వీధిలో ప్రజలందరూ పోలీసు యూనిఫారాలు వేసుకుని తిరుగుతున్నట్టూ పెద్ద తాడూ దాని కొస ముడి వగైరా వగైరా.... ఎందుకంటే సీతారావుడికి డ్రైవింగ్ లెక్చర్లిచ్చిన ద్రోణాచార్యులుగారు, గవర్నమెంట్ కారులో ఏక్సిడెంట్ చేసి పరారిలో ఉన్నాడు. అతను తన లెక్చర్లలో సీతారావుడికి చేసిన ద్రోహం, ప్రజలకి చేసిన మేలు ఏమిటంటే మందు కొట్టి కారు నడిపితే, ఉండే మజా గురించి లెక్చరివ్వకపోవడం !

★ ★ ★

ఒక అర్ధరాత్రి క్రిందాయన పరిగెత్తుకుంటూ మేడమీదికి వచ్చాడు. అప్పుడు సీతారావుడు మంచి మత్తులో ఉన్నాడు. కారులో పెట్రోలుకు బదులు ఏం పోస్తే కారు గాలిలో ఎగురుతుందా అని, కలలోపరిశోధనలో ఉన్నాడు. కల చెదిరింది. కాని మత్తువిడలా.....

క్రిందాయన ఇవేమీ గుర్తించకుండా "సీతారావుడూ! సీతారావుడూ! మా అమ్మాయికి నొప్పులు వస్తున్నాయోయ్'' అన్నాడు

సీతారావుడికి గాబరా వేసింది.

"నొప్పులకి మందులు మా ఇంట్లో ఏమీ లేవండీ. కావాలంటే ఇందిరని అడగండి'' అన్నాడు.

ఈలోగా ఇందిర వచ్చింది. వివరం తెలుసుకుంది.

"అయ్యో పాపం, ఆడకూతురు నొప్పులు పడుతూంటే, హాస్యాలు ఆడతారేంటి'' అంటూ దీర్ఘాలు తీసింది.

"నేనేం హాస్యాలు ఆడటం లేదు. ఆ అమ్మాయికి నొప్పులు వస్తే నేనేం



చెయ్యనూ'' అంటూ తనూ ఒక దీర్ఘం తీసాడు. సీతారావుడు! దీర్ఘానికి దీర్ఘమే సమాధానం అని అతనికి తెలుసు.

"ఇవి అజీర్తి నొప్పులు కావు. పిల్ల పుట్టేముందు వచ్చే నొప్పులు, తొందరగా కారు తీయండి, హాస్పటల్‌కు వెళ్ళాలి'' అంది ఇందిర.

సీతారావుడు తొందరగా కారు తీసాడు! నొప్పుల అమ్మాయిని కారు దగ్గరకు తీసుకొచ్చారు. ఆ అమ్మాయి "సర్గయ్ బుక్కా''లాగా పోల్‌వాల్ట్ ప్రాక్టీస్ చేస్తోంది.

ఎవరు పట్టుకున్నా ఆగలేదు. అది చూసి సీతారావుడుకి ముచ్చటేసింది. "హాస్పటల్‌కి తర్వాత వెళ్ళోచ్చు. ముందు ఒలింపిక్స్‌కి వెళ్ళొద్దాం గోల్డు మెడల్ ఖాయం'' అన్నాడు కిందాయనతో.

కిందాయన సీతారావుడ్ని కోపంగా చూసి పక్కకి తప్పుకున్నాడు. అప్పుడు చూసాడు. ఆ అమ్మాయి కడుపు! వెంటనే అతనికి డౌటు వచ్చేసింది! మారుతీ కార్లో ఆ అమ్మాయీ, కడుపూ రెండూ పట్టవేమో అని! కానీ ఆ అమ్మాయిని పట్టుకొచ్చిన ఆడంగులు అదేమీ పట్టించుకోకుండా, కారు ముందు సీటు కొంచెం ముందుకు నెట్టి, ఆ అమ్మాయిని, వెనక సీట్లోకి నెట్టేసారు.

"ఇంక రెడీ పదండీ హాస్పటల్‌కి'' అన్నారు.

కానీ కారు స్టార్టు అవదే! ఇంజన్ ఆన్ అయినప్పుడల్లా... మౌనంగా ఉండి, ఇంజన్ ఆగిపోయేసరికి "అమ్మోయ్, బాబోయ్'' అని కడుపమ్మాయి వెనక సీట్లో గంతులేస్తోంది. ఇంజన్ కూల్ అయిపోయి నట్లుంది. "తోయండి తోయండి'' అన్నారెవరో. అందరూ కారుని తోయడం మొదలుపెట్టారు.

అలా తోసుకుంటూ, రోడ్డుచివరికి, నాలుగురోడ్ల జంక్షన్‌కి కారు చేరుకుంది. కాని స్టార్టు కాలేదు. "బేటరీ డౌన్ అయిపోయింది. చార్జ్‌చేయించాలి'' అన్నారెవరో.

"చేయించుకురానా!'' అని ఆగాడు సీతారావుడు.

సీతారావుడు కారు ఆగిపోవడం చూసి కడుపు చిన్నది అరవడం మానేసి "హాహాకారాలు'' చెయ్యడం మొదలుపెట్టింది. వాటిని విని, ఇంటి దగ్గర నిలబడ్డ ఆడవాళ్ళంతా పరిగెత్తుకు జంక్షన్‌కి వచ్చేసారు. దారినపోయే వాళ్ళు ఆగిపోయారు. అందులో పెద్దావిడ కారులోకి తొంగిచూసి, "ఇంక ఆగదర్రా పురుడు వచ్చేస్తుంది. అంది. వెంటనే ఆడాళ్ళందరూ పెద్ద దుప్పట్లు పట్టుకొచ్చారు. వేడ్నీళ్ళు పట్టుకొచ్చారు. అందరూ కారుని మొగాళ్ళనీ అందర్నీ తిట్టుకున్నారు. ఒక్క సౌకర్యాన్ని మాత్రమే మెచ్చుకున్నారు. అది జంక్షన్ దగ్గర బడ్డీకొట్లోదొరికిన కొత్త

బ్లేడు!

కారు చుట్టూ దుప్పట్లు మూసి ఉన్నాయి. కారులోంచి హాహాకారాలు! ఇదే సందు అదే సందు అని కడుపు చిన్నది మొగుడ్ని కసితీరా తిడుతున్న తిట్లు, వీటన్నింటికీ మారుతీ కారు ఎగిరి ఎగిరి పడుతోంది. అప్పుడు అక్కడ చేరిన ప్రజలకి అర్థం అయింది. పురుడు పేరిట సినీమాల్లో చూపించే ఏక్షనుకీ, రియల్ రియాక్షన్‌కీ తేడా!

కొంతసేపటికి, కారులో హాహాకారాలు ఆగిపోయాయి. పదిసార్లు కడుపు పండినావిడ కారులోకి దూరింది. పుట్టిన గుంటడి ముడ్డిగిల్లింది! వాడు కేర్ కేర్ మంటూ ఏడ్చాడు!

“మారుతీ కారులో పుట్టాడు కదా హనుమాన్లు అని పేరెట్టండి’’ అని సలహా ఇచ్చాడు సీతారాముడు.

నామకరణం ‘హనుమాన్లు’ అని జరిగింది. “మరి ఇంటిలో పిలుచుకోడానికి ముద్దుపేరో’’ అంది పిల్లాడ్ని కన్న ఇల్లాలు.

“దానికేముంది, ‘తోహ’ అని పిలిస్తే కొత్తగానూ వుంటుంది. వాడి పేరూ కలుస్తుంది’’ అంది ఇందిర గడుసుగా.

“తోహ’’ అంటే ఏమిటండీ?’’ అంది హనుమాన్లుని కన్న ఇల్లాలు!

“తోహ అంటే ‘తోకలేని హనుమాన్లు’ అని అర్థం అన్నాడు సీతారావుడు ఇందిర తెలివికి మురిసిపోతూ.

★



# అసమర్థుడూ - పి.ఎఫ్. లోనూ

సీతారాముడి కారుకి రిపేరు వచ్చింది. పదివేలు కావల్సొచ్చాయి. అప్పెవడు పెడతాడు. ఆఫీసులో పి.ఎఫ్ డిపార్టుమెంటు వాడు తప్ప! అందుకే పి.ఎఫ్ లోనుకి అప్లై చేసాడు.

లోనుకి అప్లై చేసిన నెలరోజులకి, లోను రాలేదుగాని, సీతారాముడ్ని క్వార్టర్సు ఖాళీ చేయమంటూ నోటీసొచ్చింది. ఆ నోటీసు పట్టుకొని ఆఫీసరు దగ్గరకి వెళ్ళాడు.

“ఇదేమిటి సార్’’ అని అడిగాడు.

“నీకు నలుగురు ఆడపిల్లలు కదా? కొత్త ప్రభుత్వం రూలు ప్రకారం ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ ఉంటే, గవర్నమెంటు వారి సదుపాయాలు, అంటే క్వార్టరు, ప్రమోషను, వగైరా వగైరాలు ఏమీ ఉండవు’’ అన్నాడు ఆఫీసరు ఈసారేనా సీతారాముడు చేతికి చిక్కినందుకు సంతోషపడుతూ.

“అదేంటిసార్ నాకున్నది ఒకే ఒక్క ఆడపిల్ల నలుగురు పిల్లలు ఎక్కడ వచ్చారు సార్’’ అన్నాడు సీతారాముడు కంగారుగా.

“నీ సర్వీసులో నువ్వు ఏడు సార్లు పి.ఎఫ్.లోనుకి అప్లై చేసావు. అందులో నాలుగు సార్లు కూతుళ్ళ పెళ్ళికి అని రాసావు. ఇప్పుడు ఒక్కర్తే కూతురు అంటావేమిటోయ్! “నీ సంగతి చూస్తుంటే ఇదంతా సి.బి.ఐ. కేసు అయ్యేటట్టు ఉంది.’’ అన్నాడు ఆఫీసరు కంగారుపడుతూ.

సి.బి.ఐ అనేసరికి సీతారాముడికి కంపరం ఎత్తింది. ఇదంతా ఆంధ్రుల మీద ఢిల్లీవాడి కుట్ర అనిపించింది. కాని ముందు ఆఫీసర్ని వొప్పించాలి కదా, తరువాత మిగతావాళ్ళు!

“అయ్యా పి.ఎఫ్‌లోను చావుకి, పెళ్ళికి తప్ప ఇంకో దానికి ఇచ్చే ప్రోవిజనేం లేకుండా రూల్స్‌పెట్టారు! అందుకే డబ్బు అవసరం పడ్డప్పుడల్లా కూతురి పెళ్ళి అని రాస్తున్నాను. లేకపోతే పదివేలతో కూతురి పెళ్ళి అయిపోతే, కూతుర్ని కనడానికి తెలుగు వెధవలు వెనకడుగు ఎందుకేస్తారు. చెప్పండి! కూతురికి నాలుగుసార్లు పెళ్ళి చేసాను అంటున్నారు. అయ్యా, కూతురు పుట్టిందగ్గర నుంచీ బాలసారె బాలతొడుగూ, అంటూ పెళ్ళికి కొంచెం తక్కువగా ఖర్చుపెట్టించేసి, నాప్రాణాలు తీసింది కదండీ మా ఆవిడ. అందుకే దానికోసం మొదటిసారి లోను పెట్టక

తప్పలేదండి మరి...

"బాలతొడుగేమిటోయ్?! ఆఫీసర్‌గారి ప్రశ్న.

"బాలతొడుగంటే చిన్నప్పుడు ఆడపిల్లకి సిగ్గుబిళ్ళ అని యథోచితంగా బంగారంతోనో వెండితోనో, మనకి సిగ్గెయ్యకుండా గుంటముండ మొలకి కడతాం లెండి. పెద్దయ్యాక వీళ్ళకి ఎలాగూ సిగ్గుండందు. దానవసరం కూడా ఉండదు. దానికి తోడు మొల చుట్టూ మామిడిపిందెలు. అమ్మో లిష్టులో చాలా వున్నాయి. ఆ ఖర్చు కోసం మొదటిలోనుకు అప్లై చేసానండి. పుట్టిన ప్రతి ఆడగుంటా సవత్తాడి తీరుతుంది. అయ్యా అప్పుడుంటుందండి ఖర్చు... అట్లబంతి, చిమ్మిలి, చాకల్దానికి కోక, ఇవన్నీ తల్చుకొని మనకి కాక పుడుతుంది! మీకు తెలీదు మహాప్రభో! దీనికి లోను ఫెసిలిటీ లేదు.

ఇవేం ప్రభుత్వానికి తెలీవు. ఇవన్నీ అయ్యాక పెళ్ళిచూపులు, ఇంటికి వచ్చినవాడికి, మొదటిచూపులో నచ్చిన గుంటముండ కట్నం బాగోక మలిచూపులో నచ్చదు, కాబట్టి మనం ఇచ్చుకునే చచ్చు కట్నానికి, వచ్చే పుచ్చు అల్లుడికి, మన ఇంటి లచ్చిమి నచ్చాలంటే మూడో నాలుగో మినిమమ్ పెళ్ళిచూపులు ఏర్పాటు చేయాలి కదా, అలా చేయడానికి డబ్బు అవసరం. దానికి ఖర్చు తప్పనిసరి మహానుభావా!'' అని కాసేపాగి ఆయాసం తీర్చుకున్నాడు సీతారాముడు.

"ఇంక నాలుగోది అసలు పెళ్ళి! దీనికి ప్రభుత్వం ఇచ్చే లోను... వెనుకటికెవర్తో చెప్పినట్టు 'ముక్కులోపెక్కుండదు... ముడ్డిలో పిత్తుండదు. వీడే మా పెద్ద దిక్కు' అందిట, అలాగ ఉంటుందండి! ఇల్లోవళ్ళో అమ్ముకుంటేగాని గట్టెక్కదు. అయ్యా ఆ తర్వాత పండగ అల్లుడు చేసే రాద్ధాంతం ఏ సిద్ధాంతి పంచాంగంలోనూ లేదండీ మహాప్రభో! అప్పుడూ లోను పెట్టాలి. మీరు ఇప్పుడే కాదంటే ఎలాగండీ!

సీతారాముడి ఆర్యుమెంటుతో సగం తల తిరిగింది ఆఫీసరుకి.

"అది బాగానే ఉందయ్యా మరి రెండుసార్లు అత్తగార్ని చంపావే మరి దానికేమంటావ్?'' అన్నాడు.

"మాఅత్తగారు రెండుసార్లు చచ్చిపోతే నేనేం చెయ్యనండి'' అంటూ దీర్ఘం తీసాడు సీతారాముడు.

"ఉన్న ఒక్క అత్తగారూ రెండుసార్లు ఎలా పోతుందయ్యా! మొదటిసారి పోయి మళ్ళీ బతికిందా ఏమిటి?'' అన్నాడు తన హాస్యానికి తానే మురిసిపోతూ ఆఫీసరుగారు.



"అలాగని నేనెప్పుడన్నానండి. మా మావ పోలీసు సూపరింటెండెంటు, ఆయన పెళ్ళి గూడా అంత ఘనంగా చేసుకోడేమో గాని, పెళ్ళాం చావుమాత్రం చాల ఘనంగా చేసుకుంటారండి. ఆయనంటాడూ, "పెళ్ళాం పోయి ఆ పోస్టు ఖాళీగా ఉందని ప్రచారం జరగాలట! లేకపోతే తొందరగా భర్తీ కాదోయ్'' అంటాడండి ఆయన సెన్స్ ఆఫ్ హ్యూమర్ అలాంటిదండి. దానిని నేనేం చేయనండీ? ఆయనంత ఘనంగా చావుని చేసుకుంటుంటే! బ్రతికున్నాళ్ళకి బట్టలు పెట్టాలి కదండీ! అంతేకాదండి ఇంకా చాల తంతు వుందండి. మా ఇందిర్ని అడిగిరానా అండీ....''

"బలే వాడివే. నువ్వు ఇంటికెళ్ళి వచ్చేవరకూ నేకూర్చోనా... నీ జనరల్ నాలెడ్జికి వచ్చిన ధోకా ఏంలేదు కానియ్యి'' అన్నాడు. ఆఫీసరు సీతారాముడి కష్టాలు విన్న ఆయాసం తీర్చుకుంటూ.

"అత్తగారు తల్లిలాంటిది గదండీ అందుకే లోను. ఇందులో అభ్యంతరం ఏముందండీ? ఇప్పుడు మా మావగారి మూడో పెళ్ళాం ఉరఫ్ నామూడో అత్తగారు మంచం మీదుందండి. ఆవిడ కాలం చేసేలోగా, నేను ఈ అప్పుతీర్చేయాలి. అందుకే నాకు లోను వెంటనే సేంక్షను చేయించండి మహాప్రభో! అంటూ ఆఫీసరుగారి కాళ్ళు పట్టుకున్నాడు సీతారాముడు.

"ఇవన్నీ సరేనయ్యా కానీ నువ్వు చెప్పిన వివరాలన్నీ సి.బి.ఐ డైరెక్టర్‌కి అర్థం అవద్దూ, అందులో సర్దార్జీ కూడానూ అన్నాడు ఆఫీసరు దీర్ఘంగా ఆలోచించి...

"అయితే మీరే ఏదో దారి చూపించండి సార్'' అన్నాడు దీనవదనంతో సీతారాముడు.

"ఏం దారి చూపించనూ, నీపెళ్ళి అని పి.ఎఫ్‌లోను పెట్టావనుకో, గవర్నమెంట్ ఉద్యోగం చేస్తూ రెండో పెళ్ళి చేసుకున్నందుకు నిన్ను వెంటనే ఉద్యోగం లోంచి తీసేస్తాను. మీ అమ్మాయి పెళ్ళి అన్నావనుకో క్వార్టరు ఖాళీ చేయమంటారు. శుభమా అని తుందురుస్తుగా ఉండి చావు అని లోను పెట్టుకోవడం బావుండదు.

ఒకవేళ పెట్టినా, పి.ఎఫ్ క్లియర్ చేస్తారు. నీ పోస్టులో ఇంకొకడ్ని వేసేస్తారు. నీకేం ఒరగదు. ఏ దారీ కనబడటం లేదోయ్ సీతారాముడూ'' అన్నాడు ఆఫీసరు సానుభూతిగా

అప్పుడు సీతారాముడికి ఐడియా వచ్చేసింది.

"అయ్యా! నా పెళ్ళి అంటే ప్రభుత్వం ఒప్పుకోదుగాని మా ఆవిడ పెళ్ళి అని లోను పెడితే ఒప్పుకుంటుందేమో సార్''

"అదెలా?''

"మా ఆవిడ పెళ్ళి అని లోన్‌కి అప్లై చేయడం ఇదే మొదటిసారి ఆవిడకి ఎంత మంది మొగుళ్ళుంటే గవర్నమెంటుకేమొచ్చింది? ఉద్యోగం చేస్తున్నది నేను కదా'' అన్నాడు సీతారాముడు లోను దొరికేసిందన్నంత ఆనందంతో.

"ఒకవేళ పెళ్ళికి ఆఫీసునుండి ఎవర్నైనా వెళ్ళమని, రిపోర్టు చెయ్యమని ఆర్డరు వస్తే...'' నసిగాడు ఆఫీసరు.

"ఒకవెయ్యి పెట్టి గుళ్ళో పెళ్ళి చేసుకుంటాం సార్ ఇద్దరం... ఇకపోతే నేనే మీసాలు గొరికించేసుకుని పీటల మీద కూర్చుంటాసార్, ఇచ్చిన లోనులో వెయ్యేకదా పోతాయి'' అన్నాడు సీతారాముడు.

"అలా మీసాలు, తల చచ్చినప్పుడు గొరికించుకుంటారు కదోయ్''

ఇప్పుడు లోను తెచ్చుకోవడం చచ్చేంత చావుగా ఉందికదండీ'' అన్న సీతారాముడు సమాధానంతో... ఆఫీసరుకి తృప్తి కలిగింది.

"సరేలే ఇవన్నీ ఎందుకడుగుతున్నానంటే మనం ఏ పని చేసినా లూప్‌హోల్స్ ఉండకూడదు... అందుకు! సరేలే 'నా డిపెండెంట్ పెళ్ళాం పెళ్ళికి లోన్' అని పెట్టు, సేంక్షన్ చేస్తాను. ఇంతకీ మీ ఆవిడ నీమీద డిపెండెంటేనా?'' ఆఫీసరు ప్రశ్న.

"హండ్రడ్ పెర్సంట్ డిపెండెంట్ అండీ. గోచి మార్చే... బుర్ర గొరుక్కునో నేనే ఆవిడ్ని మళ్ళీ పెళ్ళాడాలండి. మరింకెవరూ పెళ్ళాడరు! ఆవిడ ఆడనివ్వదు!'' అంటూ ఢంకా కొట్టి మరీ చెప్పాడు సీతారాముడు గర్వంగా.

★



# అసమర్థుడూ-టెలిఫోను

"టెలిఫోను పెట్టించుకున్నారా?'' అన్న ప్రశ్న చాలా గర్వాన్ని కలిగించింది. సీతారాముడుకి "ఆ''! అనే ముఖభావపు సమాధానం బావుంది అనిపించింది. అసలు ఫోను ఇంట్లో ఉన్నందుకు ఎలా మెలగాలి, ఫోజు ఎలా కొట్టాలి. మేడ మీద వాళ్ళని ఎలా చూడాలి? ఆ చూపులో మాకే టెలిఫోను ఉంది. మేముప్రత్యేకం అని ఎలా తెలియజేయాలి? కిందాయన అసూయగా పైకి చూసినప్పుడూ, మేడమీదావిడ సీతారాముడుని చూసి, మెట్లమీద గౌరవంగా తప్పుకుంటేను సీతారాముడికి ఫోను గర్వం పెరిగింది.

క్రిందాయన మేడ మీదకి వచ్చి "ఏమండీ సీతారాముడుగారూ టెలిఫోను వచ్చిందటకదా! మా ఆఫీసరుగారితో మాట్లాడాలి'' అన్నాడు.

అప్పటి వరకూ ఊరికనే కూర్చున్న సీతారాముడు "తప్పకుండా చేయండి'' అని హుందాగా ఎదురుగా బల్ల మీద ఉన్న పత్రిక తీసి పట్టుకున్నాడు.

క్రింద క్వార్టరాయన టెలిఫోను బటను నొక్కి నొక్కి "ఏమండీ మీ టెలిఫోనులో మేనేజరు నెంబరు పలకడం లేదేం. కొత్త గదా. ఫోను పెట్టేసారుగాని, కనెక్షను ఇచ్చి ఉండరు.'' అంటూ జాలిగా సీతారాముడ్ని చూసి వెళ్ళిపోయాడు.

సీతారాముడు చేతిలో పత్రిక నలిగినా ఫోను గురించి ఏమీ తెలియకపోవడం వలన 'ఊ' అని మూలిగాడు.

మర్నాటి నుండీ అందరూ సీతారాముడ్ని పరామర్శించడం మొదలుపెట్టారు "పర్వాలేదు లెండి త్వరలో కనెక్షను ఇచ్చేస్తారు. "అని కొందరు "టెలిఫోన్ డిపార్టుమెంటు నిండా వెధవలే'' అని కొందరు ''అమ్మాఅమ్మా ఏమైనా ఇవ్వలేకపోయారా? అని కొందరు.

వాళ్ళకి ఏ సమాధానం చెప్పాలో తెలీక అలెగ్జాండర్ గ్రహంబెల్‌ని, వాడి టెలిఫోన్‌ని తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టాడు.

ఈసారి క్రిందాయన మేడమీద విజయగర్వంతో "నీకు ఫోనుంటే ఎంత? నాకు లేకపోతే ఎంత?'' అన్నట్టు చూసాడు.

సీతారాముడు ఇలా మథనపడుతుంటే, అకస్మాత్తుగా ఫోను మోగడం మొదలయింది.

సీతారాముడికి ఆనందం వేసింది. "గబగబా వెళ్ళి ఫోను ఎత్తాడు. ఆ ఫోను సీతారాముడిది కాదు. మరెవరికో, బాల్కనిలోకి వెళ్ళి పిలిచాడు. ఎవరూ పలకలేదు. గట్టిగా గొంతుచించుకు పిలిచాడు. ఎవరూ పలకలేదు కానీ, ఇందిర వచ్చేసింది. "ఎవర్ని పిలుస్తున్నారు. " అంటూ ఇందిరకి చెప్పాడు ఎవరికి ఫోను వచ్చిందో........"

"వాళ్ళిద్దరికీ చెవుడూ, కుర్రాడికి చెవుడూ మూగగూడా! వినబడదు. వెళ్ళి పిలుచుకురావాలి" అంటూ మేడెక్కింది ఇందిర.

మర్నాడు మళ్ళీ ఫోనొచ్చింది ఈసారి క్రిందాయనికి బాల్కనీలో నిలబడి పిలిచాడు. ఎంతపిలిచినా రానాయన, వెళ్ళి పిలిస్తే వచ్చాడు.

మర్నాడు క్రిందాయన, పక్క క్వార్టరు ఆయనతో, "మేడ మీదాయనకి ఫోనొస్తే పెళ్ళాన్ని పంపించి పిలిపించాడండి, నన్ను బాల్కనీలో నుండి పిలిస్తే సరిపోతుంది అనుకుంటున్నాడు. నేనలా లొంగే ఘటాన్ని కాదు" అంటూండగా సీతారాముడు విన్నాడు.

ఆ దెబ్బతో ఎవరికి ఫోనొచ్చినా పిలవడం మానేసాడు. అసలు ఫోనెత్తడం మానేసాడు. ఏ ఫోనొచ్చినా ఇందిర ఎత్తేది. ఎంత పనిలో ఉన్నా, ఫోనెత్తి, వాళ్ళని పిలిచేది. అలా ఒక రోజు క్రిందావిడ వచ్చి ఫోనులో మాట్లాడి వెళ్ళిపోతే, "ఫోను నిండా అల్లం పచ్చడే, బావున్నట్టుంది. కొంచెం పంపించండి" అంటూ వెళ్ళిపోయింది.

"ఈవిడ ఫోనులో మాట్లాడిందా? ఫోనుని నాకిందా?" అన్నాడు సీతారాముడు.

"ఏదో చేసిందిలెండి, ఊరుకోండి వింటే బావుండదు" అంటూ అరగిన్నెడు అల్లప్పచ్చడి క్రిందావిడకు పంపింది.

ఆడ మేళాం అసమర్థంగాదూ!" అని సరిపెట్టుకున్నాడు.

ఆరోజు మేడమీదావిడ ఫోను చెయ్యడానికి వచ్చింది. సీతారాముడు టి.విలో ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్ చూస్తున్నాడు. ఆవిడకి ఫోనులో సరిగ్గా వినబడలేదు. మెల్లగా వచ్చి టి.వి. సౌండు తగ్గించేసింది. సీతారాముడు టి.వి. కనబడుతోందే తప్ప వినబడటం లేదు అంతా అయోమయంగా ఉంది. ఆవిడ ఫోనులో మాట్లాడ్డం పూర్తయ్యే సరికి, టి.వి అనౌన్సరు వచ్చి, "ఇంతవరకూ భారత్ పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ చూసారు" అంది.

ఈవిడ కొంచెం నయం, సీతారాముడు డైయాగ్నల్ క్రిందావిడ వచ్చింది.

ఒకసారి "అన్నయ్యగారూ మీరు కొంచెం పక్కగదిలోకి వెళతారా" అంది.



"ఎందుకు?"

"మాఅమ్మాయి వాళ్ళాయనతో మాట్లాడుతుందట" అంది ముసిముసిగా నవ్వుతూ.

సీతారాముడికి కోపం వచ్చేసింది. ఫోను మీద, గ్రహంబెల్ మీద, వాళ్ళ అమ్మాయి మీద... "మీ అమ్మాయి మొగుడికి ఫోను చేస్తే, నేవెళ్ళిపోవడం దేనికండి కొంపదీసి రంకు మొగుడికి కాదు కద" అన్నాడు.

అబ్బే బలే జోకులేస్తారే మీరు! వాళ్ళాయనకే ఫోను చేస్తుందట"

"అయితే అందులో నా అడ్డు ఏముంది?"

"అబ్బే పరాయి మగాళ్ళంటే సిగ్గు"

"ఏం మీకు లేదా సిగ్గు మీరు బరి తెగించేసారా?"

"గొప్పగా హాస్యాలాడతారే మీరు, ఇంతవరకూ మాకు తెలీనేతెలీదు" అంటూ ఇందిరవేపు చూసింది. జాలిగా... అప్పుడు ఇందిర అంది.

"కొంచెం అవతలికెళితే ఏమైంది? వాళ్ళకి ఇబ్బంది కదూ" అని

"అసమర్ధుడికి అసమర్థపు ముండ దొరక్కపోతే సమర్ధురాలు ఎలా దొరుకుతుందీ?" అంటూ అవతలకి వెళ్ళాడు.

ఇందిర నొచ్చుకుంటూ "మీరుండగా నే ముండనెలా అవుతానండీ?" పాయింటు లేవదీసింది.

డైయాగ్నల్ క్రిందావిడ వెళ్ళిపోతూ "థాంక్స్ అండీ అన్నయ్యగారూ" అంది.

"ఇంతకీ మీ అమ్మాయి మొగుడు ఏం చేస్తున్నాడేమిటీ? అన్నాడు సీతారాముడు, సీతారాముడు మాటకి సమాధానంగా" అమెరికాలో కంప్యూటరు కంపెనీలో పనిచేస్తున్నాడు లెండి" అని వెళ్ళిపోయిందావిడ!

"ఏమిటి?ఓవర్సీస్‌కాలా? రామయ్య తాతా రక్షించు" అంటూ స్పృహ తప్పి పడిపోయాడు సీతారాముడు.

★

# అసమర్థుడూ - కలర్ టీవి

సీతారాముడు కలర్ టి.వి కొన్నాడన్న విషయం కాలనీలో కలరాలా వ్యాపించింది.

"ఏమోయ్ సీతారాముడూ కలర్ టి.వి. కొన్నావట కదా?" అన్నాడు డైయాగ్నల్ నైబర్ పలకరింపుగా "అన్నయ్యగారూ, శ్రీదేవి ఏరంగు చీర కట్టుకుందో? దాని బోర్డరు ఏమిటో? బాగా కనబడుతుందా?" అంటూ డైయాగ్నల్ డౌన్ నైబరి (నైబర్‌కి ఆడ్లింగం) ఆనందం పడిపోయింది.

"ఇంక ప్రతి ఆదివారం తెలుగు సినిమా కలర్‌లో చూడవచ్చు అన్నమాట" అని కొందరూ..." "చంద్రబాబు అంత మంచి సినిమాలు ఇవ్వద్దూ!"అంటూ కొందరూ అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఆపాటికి తెలుగు సినిమాలన్నింటినీ చీఫ్ మినిస్టరే సెలక్ట్ చేస్తున్నట్టు.....

ఆ బ్లాకులో వాళ్ళు ఎదురు చూసిన అవకాశం మొదటి ఆదివారం వొచ్చింది. ఆ ఆదివారం సినిమా 'కనకదుర్గ పూజా మహిమ'

"కాంతారావు కత్తి ఫైటు కలరులో చూస్తా"నంటూ క్రిందావిడ.

"రాజశ్రీ వయ్యారాలు కలరులో ఎలా ఉంటాయో?" అనే ఆతృతతో మేడమీదాయన సపరివారంగా వచ్చేసి సోఫాలన్నీ ఆక్రమించేసారు. సీతారావుడు వచ్చేసరికి సోఫాలన్నీ నిండుగా ఉన్నాయి. పులిలా గాండ్రించి, వీళ్ళందర్నీ భయపెడదామనుకుని, నక్కలా మూలిగి టి.వి. ముందు చాప పరుచుకుని ఇందిర, పాపతో సహా కూలబడ్డాడు సీతారాముడు. కానీ అసమర్థుడి జీవితంలో అన్నీ అనుకోనివే జరుగుతాయి.

సినిమా నలుపు తెలుపు రావడం ప్రేక్షకుల్లో నిరాశ కలిగించింది.

"నీది కలర్ టి.వి అన్నావు కదోయ్ సీతారావుడూ! మరి సినిమా బ్లాక్ అండ్ వైట్‌లో వస్తోందేం?" అన్నాడు నిరాశగా డయాగ్నల్ మేడమీది ముసిలాయన.

"టి.వి కలరుదేనండీ, సినిమా నలుపుతెలుపుది" అన్న అసమర్థుడి సమర్ధన ఎవరూ పట్టించుకోలేదు.

తెన్నేటి హేమలతగారు చెప్పినట్టు "శోభనం అంటే ఏదో అనుకున్నాను. మొన్న మా మేనత్త కొడుకూ చేసాడు' అన్న చిన్నదాన్ని ఆదర్శంగా తీసుకొని... "కలర్ టి.వి అంటే ఏదో అనుకున్నాము. బ్లాక్ అండ్ వైట్ సినిమా, బ్లాక్ అండ్ వైట్ లో వస్తే కలర్ టి.వి. ఎందుకో?" అంటూ అందరూ వెళ్ళిపోయారు.

తన కలర్ టి.వి. లో కలర్ సినిమా కలర్‌లోనూ బ్లాక్ అండ్ వైట్ సినిమా బ్లాక్ అండ్ వైట్ లోనూ వస్తున్నందుకు చిన్నపోయాడు సీతారాముడు.

దాంతో సీతారావుడికి కోపం వచ్చింది. వుడుకుమోత్తనం వచ్చింది. ఆరోజే కిందాయన ఇంటికి వెళ్ళి "నా టి.వి నన్ను మోసం చేస్తే నీ బివీ (పెళ్ళాం) నిన్ను మోసం చేస్తుందోయ్" అన్నాడు.

దానికి క్రిందాయన పంచె ఎగ్గట్టి "నా బీవి సంగతి నీకేం తెలుసూ?" అన్నాడు కోపంగా

"ఎనిమిది లోపల, ఐదు తర్వాత నువ్వెప్పుడేనా మాట్లాడేవా? లేదు. ఎందుకు? బి.వి ముందు, టి.వి ముందు మనం - అంటే నేను టివి ముందు, నువ్వు బి.వి ముందు - మాట్లాడినా ఒకటే, మాట్లాడకపోయినా ఒకటే! నా టి.వి నన్ను మోసం చేసినప్పుడు నీ బీ.వి నిన్ను మోసం చేస్తున్నట్టుకాదా?" అంటూ అర్థం పర్థం లేని పాయింట్ లేవదీసాడు. తన బి.విని ఎవరేమన్నా వొప్పుకునే వాడేమోగాని 16 వేల పెట్టి కొన్న టి.వి ని ఎవరేనా అంటే ఒప్పుకోబుద్ధి వేయలేదు సీతారామారావుకి.

ఇంకో రోజు "అంకుల్ టి.వి వాడు మిమ్మల్ని మోసం చేసేడటగా, మా అత్తగారన్నారు. కొనేటప్పుడు నన్ను తీసుకువెళ్ళాల్సింది. నేను ఎలక్ట్రానిక్స్‌లో ఇంజనీరింగ్ చేసాను కదా అంతగా మోసం చెయ్యలేరు" అన్నాడు డయాగ్నల్ క్రిందింటి అల్లుడు సీతారాముడ్ని చూసి....

సీతారాముడు ఆశ్చర్యపోయాడు. "చూడు బాబూ నువ్వు ఎలక్ట్రానిక్స్ ఇంజనీరువి, టి.వి విషయంలో నిన్నెవరూ మోసం చెయ్యలేరని నీ అహం, కానీ బి.వి విషయంలో మోసపోయావే, మీ అత్తమామలు ఐదుగురు ఆడపిల్లలకి పెళ్ళి చేసిన ఘనులు. నెత్తి మీద లక్షరూపాయలు కట్నం పెట్టేసరికి, అది జోతిర్ చక్రంలా కనబడి, అమ్మాయి దగ్గరకి వచ్చేసరికి కళ్ళు బైర్లు కమ్మాయి. నీ పెళ్ళి ముందు, నీ బివి ఎదురింటి అబ్బాయితో ఫుల్ సీరియల్ నడిపింది. ఆ సంగతి నీకు తెలుసా? మావగారు ఇచ్చిన డబ్బులు అయిపోయాయిగా, ఇప్పుడేనా తెలుసుకో! " అని వెళ్ళిపోయాడు.

ఆ రోజు సాయంకాలం ఆ కాలనీలో ఎవరూ టి.వి చూడలేదు. కారణం సీతారాముడికి డయాగ్నల్ క్రిందింటి నైబర్ ఇంట్లో పూర్తిగా ధూం ధడకా!

సీతారావుడి వుధృతం చూసిన కాలనీ వాళ్ళు, సీతారావుడి టి.విని మెచ్చుకోడం మొదలుపెట్టారు.

కాలనీ వాళ్ళందరూ ఒకరోజు మీటింగ్ పెట్టి సీతారాముడ్ని ముఖ్య అతిధిని చేసి "టి.వి -బివి'' గురించి మాట్లాడమన్నారు.

"టి.వి అంటే బివి, బివి అంటే టి.వి ఎందుకంటే ఇద్దరూ ఇంటికి వచ్చేంతవరకూ ముచ్చటగా ఉంటారు. ఇంటికి వచ్చాక వాళ్ళు చెప్పినట్టే వినాలి. టి.వి తన ప్రోగ్రామ్‌లతో మన బుర్ర దొలిచేస్తే, బివి తన వంటలతో మన కడుపును దొలిచేస్తుంది. అయితే ఒక్కటే తేడా - టి.విని మనం డబ్బెట్టి తెచ్చుకుంటాం, పాడయితే బైటపారేస్తాం.

బివి డబ్బుతో వస్తుంది. మనల్ని పాడు చేసి బైట పారేస్తుంది'' అంటూ లెక్చరు ముగించాడు సీతారాముడు.

★



# అసమర్ధ డూ-అపవిత్రతా

"పక్క క్వార్టర్లో ఎవరో కొత్తగా వచ్చారండీ'' అంది ఇందిర.

"అప్పు అడక్కుండా జాగ్రత్తపడు'' అన్నాడు సీతారావుడు.

"అలాగే అంటూ మూతి విరుచుకు వెళ్ళిపోయింది ఇందిర. పక్కింటి ఆవిడ అప్పుకి రాలేదు గాని ఒక రోజు ఆంధ్రలో వచ్చే తుఫానులా దూసుకు వచ్చింది. వచ్చీరాగానే సీతారాముడ్ని చూసి...... "ఇదేం బాగోలేదండీ''అంది. ఆవిడ్ని చూడగానే సీతారాముడు జడుసుకున్నాడు. ఎందుకంటే, ఆ కాలనీలో అలాంటి ఆడదాన్ని అసలు అంతకుముందు చూడలేదు. ఆవిడ మూతికి ఎర్రరంగు, బుగ్గలకి గులాబీరంగు, తలకి నల్లరంగు, గోళ్ళకి మెరూను రంగులతో ఒళ్ళంతా రంగుల మయంగా అయోమయంగా ఉంది.

"మీరు వేసుకున్న రంగులా?'' అని అడిగాడు సీతారాముడు. "కాదు మీ ఆవిడ్ని మీరు ఇంట్లో ఇలా కట్టేయడం, బానిసలా చూడ్డం. చాకిరీకీ తప్ప ఇంక దేనికీ పనికి రాదనుకుంటున్నారా? ఆడది! హూ! ఆడది మహాకాళి! ఓన్లీ థింగ్ ఈజ్ వియ్ హావ్ టు రిఫార్మ్ "హెర్'' అంది.

"ఆడది మహాకాళి అని మీ మేకప్పు చూస్తేనే తెలుస్తోంది! అలాగే తప్పకుండా చేయండి'' అన్నాడు గాభరాగా సీతారాముడు.

ఆనాటి నుండీ ఆవిడ అప్పుడప్పుడు ఆ కాలనీ ఆడవాళ్ళకి స్వాతంత్ర్యం గురించి నూరిపోయాలని అనుకుంది. కాని ఆవిడకే తీరిక దొరకలా. ఆవిడకి తీరిక దొరికి మీటింగ్‌కి పిలిచినప్పుడు, కాలనీలో ఆడవాళ్ళకి తీరిక దొరకలా! ఎందుకంటే ఆవిడ పొద్దున్నే లేచి పళ్ళుతోముకుని, వంటికి కోడిగుడ్డు రాసుకుని రూములో దూరి కూర్చునేది. పదింటికి తయారై, మహిళా కేంద్రానికి వెళ్ళిపోయేది. అక్కడ తన పేక ముక్కల కళని ప్రదర్శించి, కొత్త సినీమాని చీల్చిచెండాడి, కొత్త వీడియోని వీక్షించి, పాత ఆడియోని ఆడిపోసుకుని, చైనాలో చాండ్‌కైషేక్స్ ఎలా తయారు చేస్తారో తెలుసుకుని ఇంటి మొఖం పట్టేసరికి, రాత్రి పదో పదకొండో అయేది. అప్పటికి ఈ బానిసల కాలనీ (అంటే ఆవిడ ఉద్దేశ్యంలో మొగాళ్ళు ఆఫీసులోనూ ఆడాళ్ళు క్వార్టర్స్‌లోనూ) అలసి సొలసి నిద్రించేది. మళ్ళీ తెల్లవారే సరికి రొటీనుతో ఈవిడకి తీరిక ఉండేది కాదు. సమస్యలతో కాలనీ వాళ్ళకి

తీరిక ఉండేది కాదు.

అయితే ఈవిడ మొగుడు మాత్రం ఆవిడ కష్టాల్ని చూసి భోరున ఏడ్చేసాడు. రోజుకి ముప్ఫై గంటలు పెట్టనందుకు, దేవుణ్ని ఆడిపోసుకున్నాడు. కాని ఇంటిలో పనులకి, ఆవిడకి సాయంగా, ఎవరో ఒకరు ఉండాలని ఆవిడకి నచ్చచెప్పాడు. ఆవిడకీ అర్థంఅయింది. దాంతో ఆవిడ తన చెల్లెల్ని ఎడ్యుకేట్ చేస్తానంటూ తీసుకొచ్చింది. ఆ వచ్చిన చిన్నది కోడిగుడ్డు రాసుకోకుండా, వాసనేస్తోంది అంటూ, అట్టువేసుకు తినేసి, వంటికి పసుపు రాసుకు స్నానం చేసి, అక్కబావకి వండిపెట్టి, తను తిని, కాలేజీకి వెళ్ళిపోయింది.

"మొగుడి మాట నే వింటానా?'' అని ఒకసారి, 'నేను స్వతంత్ర ఆడబిడ్డగా పుట్టాను. జీవిస్తాను. అలాగే చస్తాను. నా గురించి మీకు తెలీదు. పదండి తోసుకుంటూ ముందుకు' అంటూ ఏదో పద్యం చదివి, నన్ను వెర్రిదానిలా చూసి వెళ్ళిపోయిందండీ'' అంటూ ఇందిర ఎప్పటి సమాచారం అప్పుడు సీతారాముడి అందచేస్తూనే ఉంది.

అయితే సృష్టి స్థితి లయల్లో ఈవిడ కాళికై లయని వరించి, కాలనీ ఆడాళ్ళ బానిసత్వం మీద దాడిచేస్తే ఈవిడ మొగుడు బ్రహ్మని నమ్ముకుని సృష్టిని మొదలుపెట్టేడు. బియ్యేస్సీ చదువుకుంటున్న మరదలు కడుపుతో ఉంది అని తెలుసుకుని రిఫార్మిష్టు లేడీ తండ్రి పరిగెత్తుకుంటూ వచ్చేసాడు.

రిఫార్మిష్టు లేడీకి కూడా ఏంచేయాలో అర్థం కాలేదు. రెండు రోజులు రిఫార్మ్ వాయిదా వేసింది.

"నేను నీకు పెళ్ళి చేస్తే, దానికి కడుపు రావడమేమిటీ? ఇంటిలో నువ్వేం చేస్తున్నావ్?'' అంటూ నాన్న నిలదీసేసరికి, కడుపయినందుకు మరదలూ, అవనందుకు రిఫార్మిష్టు లేడీ బోరుమన్నారు. పక్కనే ఉన్న సీతారాముడి దగ్గరకి వెళ్ళారు. ఆ ముసలి తండ్రి "సీతారాముడుగారూ, ఇదేం అన్యాయమండీ. ఇప్పుడు రెండో కూతుర్ని ఎవడు పెళ్ళాడతాడు?'' అంటూ తల పట్టుకు కూర్చున్నాడు.

సీతారాముడు దీర్ఘంగా ఆలోచించి "పెళ్ళి ఒక దానికి చేసి, ఇద్దర్ని అల్లుడింటికి పంపితే ఎలాగండీ? తప్పయిపోయింది కాబట్టి పవిత్రంగా ఉన్న పెద్ద కూతుర్నే తీసుకుపొండి వచ్చిన నష్టం ఏంలేదు'' అన్నాడు.

"ఐడియా బాగానే ఉందిగాని, ఇక్కడ కాలనీ వాళ్ళందరూ రెండో దాన్ని ఛీ కొట్టరూ?'' అంటూ సందేహం వెలిబుచ్చాడు ముసిలాయన.

"ఆ విషయం కాలనీ వాళ్ళనే అడగండి'' అన్నాడు సీతారాముడు.



దాంతో రిఫార్మిష్టు లేడీకి కోపం వచ్చింది "నేను మా ఆయనికి పెళ్ళాన్ని. ఇక్కడ ఆడాళ్ళందర్నీ మారుస్తానని మాటిచ్చాను. అందరికీ నేనంటే ఎవరో బాగా తెలుసు. ఇది నా ఇల్లు. ఈయన నా మొగుడు'' అంటూ హక్కుల రక్షణ కోసం కోలనీ ఆడాళ్ళందర్నీ పిలిచింది - చెల్లెల్ని ఇంట్లోంచి వెళ్ళగొట్టడానికి! ఆడాళ్ళందరూ వచ్చేరు. సమావేశం జరిగింది.

"ఇద్దరితోనూ కాపురం చేసుకోవోయ్'' అన్నారు కొందరు మగాళ్ళు. అంటే ఇంటాయనంటాడూ "నాకున్న జీతానికి ఒక్కర్తే ఎక్కువ - ఇద్దరు కూడానా?'' అని

"మరి ఈ పాడుపని ఎందుకుచేసావ్ అని నిలదీస్తే.''

"పాడు పనేంటి? ఇంట్లో ఎవరుంటే వాళ్ళతో సరిపెట్టుకున్నా'' కోపంగా అని ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

మొగాళ్ళ పంచాయితీ ముగిసాక ఆడాళ్ళ పంచాయితీ మొదలయింది. ఆడాళ్ళందరూ మరదల్ని పట్టుకొని....

"ఈ అమ్మాయి వజ్రమండి. మొన్న మా అమ్మాయి పురిటికి ఎంత సాయం చేసిందని, డాక్టర్లతో మాట్లాడి ఎంబులెన్స్ ఎరేంజి చేసి... అని ఒకావిడా, "అదే మా ఇంట్లోనూ కొత్త రకంగా పెళ్ళి చూపులు ఏర్పాటు చేసి, మొగపెళ్ళివారితో చాకచక్యంగా మాట్లాడి, మా అమ్మాయిని ఎక్కువ ఇబ్బంది పెట్టకుండా చేసింది చాలా చురుకైన పిల్ల'' అని ఒకళ్ళూ.

"మా అబ్బాయికి విరోచనాలు పట్టుకుని వదలకపోతే, అదేదో డీ హైడ్రేషన్ అట. అది రాకుండా ఏమిటేమిటో కలిపి ఇచ్చి వాడికి ఎంత సంరక్షణ చేసింది తర్వాత డాక్టరే మెచ్చుకున్నాడు'' అని ఒకళ్ళూ మెచ్చుకున్నారు.

అంతేకాక రిఫార్మిష్టు లేడీని ఎవరూ గుర్తుకూడా పట్టలేదు సరికదా "ఈవిడెవరూ?'' అంటూ ఆశ్చర్యపోయారు.

ఆ దెబ్బతో రిఫార్మిష్టు లేడీ బోరుమని ఏడుస్తూ "ఇదేమి ఆడాళ్ళ కట్టు అండీ, కాలనీలో నన్నెవరూ చూడలేదంటారేంటీ?'' అంటూ సీతారాముడి దగ్గరకి వచ్చింది.

అప్పుడు సీతారాముడుకి ఓ ఐడియా వచ్చింది. రిఫార్మిష్టు లేడీని తీసుకొచ్చి అద్దం ముందు కూర్చోబెట్టి, మేకప్ బాక్స్ తీసుకొచ్చాడు. కానీ సీతారాముడికి మేకప్ చేయడం తెలీదు. గోళ్ళ రంగు పెదాలకీ, పెదాల రంగు గోళ్ళకీ, తల

రంగు బుగ్గలకీ, బుగ్గల రంగు తలకీ పామేసాడు. ఆవిడ కాపరం చెడ్డ శోకంలో ఇవేం పట్టించుకోలేదు. అంతా పూర్తి అయాక ఆవిడ్ని తీసుకుని కోలనీ ఆడాళ్ళ ముందుకి వెళ్ళాడు. రంగులు అడ్డదిడ్డంగా ఉన్నా రంగులన్నీ కళ్ళకి కనబడేసరికి కోలనీ ఆడవాళ్ళు ఆవిడ్ని పోల్చుకున్నారు. "ఈవిడా అప్పుడప్పుడు కోలనీలోకి వస్తూంటుంది" అని కొందరు "ఆ వచ్చినప్పుడు ఈ బ్లాకుకే వస్తుంది" అని కొందరు అన్నారు. అంతేగాని ఈవిడే ఈ క్వార్టరులో పురుషుడికి హక్కుదారు అని వొప్పుకోలేదు. అంతేకాదు మరదలు పిల్లకి ఏమాత్రం అన్యాయం జరిగినా మర్యాద దక్కదని రిఫార్మిష్టు తండ్రికి వార్నింగిచ్చి మరీ వెళ్ళిపోయారు.

ఈవిధంగా రిఫార్మిష్టు లేడీ జీవితంలో బేసిక్ (మౌలిక) రిఫార్మ్ జరిగి తండ్రితో పాటు రైలెక్కి స్వంతింటికి వెళ్ళి పోయింది! మళ్ళీ కన్నె చెర విడిపించే వాడిని వెదుక్కుంటూ!

★



# అసమర్ధుడూ- ఐడెంటిటీ క్రైసిసూ

సీతారావుడికి తన మీద అభిమానం వున్న బంధువుల జాబితా తెలుసుకోబుద్ధి వేసింది. ఏవిధమైన పథకం వేసి ఆ విషయాన్ని తెలుసుకోవాలా? అని తెగ ఆలోచించాడు. ఆఫీసులో కూర్చుని దగ్గర బంధువుల జాబితా తయారు చేసాడు. మావగారు, పెద్దబావమరిది, చిన్నబావమరిది, బుల్లిబావమరిది, వదినెగారూ, అన్నయ్యా, తమ్ముడూ, చెల్లెలూ, మేనమామ మొత్తం బంధువుల లిష్టులో ఎంత వెదికినా తొమ్మిది మించి దొరకలేదు.

వీళ్ళలో ఎంతమందికి తనన్నా, తన కుటుంబమన్నా అభిమానం వుందో తెలుసుకోవాలంటే వాడి గల పథకం వొకటి కావాలి. దాని కోసం సాయంకాలం వరకూ ఆఫీసు డస్కు ముందు కూర్చుని మావగారి బొమ్మా, అన్నయ్యబొమ్మా, పిచ్చిగా గీస్తూ తపించిపోతున్న సీతారాముడుకి, సాయంకాలానికి మంచి ఐడియా తట్టింది.

ఆఫీసు నుండి తిన్నగా పెద్ద పోస్టాఫీసుకు వెళ్ళాడు. తొమ్మిది టెలిగ్రాం ఫారముల మీద, తొమ్మిది ఎడ్రసులూ రాసాడు. అన్నింటిమీద వొకే మెసేజ్ రాసాడు. తొమ్మిదిమందికీ టెలిగ్రాములు ఇచ్చి ఇంటికొచ్చి పడుకున్నాడు. తెల్లవారేసరికి తొమ్మిదిమందీ వస్తారు అనుకుంటూ మురిసిపోయాడు.

★ ★ ★

మర్నాడు తెల్లవారేసరికి ఎవరూ రాలేదు. సరికదా వస్తారన్న సూచనగా ఇంటి మీద కాకి వాలి అరవలేదు కూడా!

సాయంకాలం అవుతున్న కొద్దీ సీతారావుడికి నిరాశా నిస్పృహలు కమ్ము తున్నాయి. చిరాకేసింది. తన మీద వీళ్ళందరికీ ఇంత అభిమానం వుండి చచ్చిందన్నమాట! అనుకున్నాడు కసిగా.

వస్తారు వస్తారు అనుకున్నవాళ్ళెవరూ ఆరోజు తెల్లవారుతూనే బుల్లి బావమరిది వొక్కడూ దిగాడు.

తలుపు తీసిన ఇందిర ఆశ్చర్యపోయింది. "ఏరా అన్నయ్యా ఇలా వచ్చావ్" అంటూ ఆశ్చర్యపోయింది.

"జరిగిందేదో జరిగిపోయిందిలే, మనం నిమిత్తమాత్రులం, అయినా ఇంత సడన్‌గా ఎలా జరిగిందే!" అంటూ ఏడుపు మొదలు పెట్టాడు. బుల్లిబావమరిది

ముక్కు చీదుకుంటూ.

“ఆ ఏడుపెందుకూ? సడెన్‌గా జరగడం ఏమిటీ? ముందు నువ్వు లోపలికిరా” అంటూ తలుపు దగ్గర నుండి జరిగింది ఇందిర.

బుల్లిబావమరిది లోపలికి వచ్చాడు. అప్పుడే “ఇందిరా ఎవరూ వచ్చారు?” అంటూ హాలులోకి వచ్చాడు సీతారామారావు. సీతారామారావుని చూస్తూనే కెవ్వున అరచి ఇందిర వెనక్కి వెళ్ళి వణకసాగాడు బుల్లిబావమరిది.

“అదేమిటిరా బావగారిని చూసి జడుసుకుంటున్నావ్ మతిపోయిందా ఏమిటి?” అంటూ విసుక్కుంది ఇందిర.

“లెలెలె లేదు” అన్నాడు గాని సీతారామారావుని చూసి వణకడం మానలేదు. బుల్లిబావమరిది.

“ఏంవోయ్ వొక్కడవే వచ్చావా?” మిగతావాళ్ళేరి?” అంటూ అడిగాడు నవ్వుతూ.

రారా(రా రాలేదు” అన్నాడు బుల్లిబావమరిది భయంగా.

“రారు కూడానూ”అన్నాడు సీతారామారావు వెనక్కి వెళ్ళిపోతూ

సీతారామారావు గదిలోకి వెళ్ళిపోయాక, షాక్ నుండి తేరుకున్నాడు బుల్లి బావమరిది.

“బావగారు బతికే వున్నారేమిటీ?” అని అడిగాడు కాస్త ఆశ్చర్యంగా.

“ఏమిటా వెధవ మాటలు, ఆయనకేం శుభ్రంగా తింటున్నారు. ఆ సోఫాలో గుర్రెట్టి నిద్రపోతున్నారు” అంది ఇందిర కసిగా.

‘మరి టెలిగ్రాం” అన్నాడు బుల్లి బామ్మర్ది సందేహంగా

“టెలిగ్రాం ఏమిటీ?” అంది ఇందిర ఆశ్చర్యంగా

“సీతారామారావు ఎక్స్‌పైర్డ్ - ఇందిర అని నాన్నగారికి, అన్నయ్యలకి, నాకూ టెలిగ్రాం వచ్చిందే!” అన్నాడు బుల్లిబామ్మర్ది తన భయానికి కారణం వివరిస్తూ!

ఇందిర అవాక్కయిపోయింది. అప్పుడే నోట్లో టూత్‌బ్రష్ పెట్టుకొచ్చిన సీతారామారావు “అడా నేనే ఇష్టను. మీకు నామీడ, ఎంట ఇడుండో తెలుసుకుందామని” అన్నాడు.

ఇందిరకి మంటెక్కింది. నాలుక మడత పెట్టి, “ఎంట ఇడుండో తెలిషిండా!” అంది.

బుల్లి బామ్మర్ది అవాక్కయి నిలబడి ఇద్దర్నీ చూస్తున్నాడు.

బుల్లి బామ్మర్దిని చూసేసరికి వీడి వెనకాల ఇంకా ఎంతమంది దిగుతారో అన్నదిగులు పట్టుకుంది ఇందిరకి. దాంతో సీతారావుడి మీద విరుచుకుపడింది.

“మీరు పోయేది లేదు, పెట్టేది లేదు. ఇప్పుడు వీళ్ళంతా దిగుతారు. కొంప మీదకొచ్చే వాళ్ళందరికీ వండిపెట్టలేక నే చావాలి” అంటూ దీర్ఘం తీసి నెత్తి కొట్టుకుంది.

“ఆ బాధ నీకు లేదులే ఎవరూ రావడం లేదులే” అన్నాడు బుల్లి బామ్మర్ది ఇందిరని ఓదారుస్తూ.

“ఎవరూ రావడం లేదా? ఏం?” అన్నాడు సీతారావుడు ఆశ్చర్యపోతూ.

బుల్లిబామ్మర్ది చెప్పిన ప్రకారం సీతారావుడి మావగారు... ” సీతారావుడూ ఇందిరా నా మూడో భార్య చనిపోయినప్పుడు వచ్చి పరామర్శించలేదు. నన్ను వాళ్ళెవరూ పరామర్శించకుండా నేను అక్కడికి వెళ్తే బావుండదు. బుల్లోడ్ని పంపితే సరి” అన్నార్ట.

ఆ మాటతో సీతారావుడికి చిర్రెత్తుకొచ్చింది.

“దేనికి పరామర్శ? ఆర్నెల్లలో ఆయనెలాగూ పెళ్ళాడుతారు కదా. అప్పుడు ఏకంగా పెళ్లికెళ్ళి మూడో భార్యని పోగొట్టుకున్నందుకు పరామర్శ నాలుగో పెళ్ళికి శుభాకాంక్షలూ వొకేసారి చెప్దామనుకున్నాను” అన్నాడు గునుస్తూ!

బుల్లిబామ్మర్ది సాలోచనగా “హో హో” అని నాన్న ఇదీ ఆలోచించకపోలేదు. కాని ‘దేని’ ముచ్చట దానిదే’ అన్నది నాన్న అభిప్రాయం”.

“నాన్న సరే అన్నయ్య ఏవన్నాడ్రా?” అంది కుతూహలంగా తన మొగుడే పోయాడన్న మెసేజ్ గురించి మాట్లాడుకుంటున్నామన్న విషయం మర్చిపోయింది.

“నాన్న ఇలా అన్న తర్వాత నేను అన్నయ్య దగ్గరకి వెళ్ళాను. అన్నయ్యకి కూడా టెలిగ్రాం వచ్చినట్టుంది. అది టేబుల్ మీదుంది. అన్నయ్య వదినె నన్ను చూడగానే మొహాలు గంభీరంగా పెట్టేసుకున్నారు.

వదినె నీరసంగా “అన్నయ్యగారు పోయారటగా” అంది.

“ఏరా తమ్ముడూ నువ్వు వెళుతున్నావా! వెళ్ళు- ఎవరూ వెళ్ళకపోతే ఇందిర ఏమేనా అనుకుంటుంది.” అన్నాడు అన్నయ్య

“అదేమిటి అన్నయ్యా నువ్వు రావూ” అన్నాను.

"లేదోయ్ ఆయన ఆరోగ్యం బావులేదు. కడుపులో నొప్పి పెరిగిపోయింది. మొన్నే డాక్టరు హాస్పటల్లో జాయిన్‌కండీ, టెస్టులు చెయ్యాలి అన్నాడు. ఏ పనికేనా డబ్బు కావాలి కదా నిన్ననే డబ్బు కుదిరింది. ఈ రోజు హాస్పటల్‌లో జాయిన్ అవుదామనుకుంటున్నారు'' అంది వదినె.

"హాస్పటలా? జాయిన్ అవడమా?'' అంటూ ఆశ్చర్యంగా చూసాడు అన్నయ్య వదిన్ని. "అదే చెప్తున్నాను. మీరు హాస్పిటల్లో జాయిన్ అయితే ఇందిర దగ్గరకి ఎలా వెళతారూ కష్టం కదా, ఆ విషయమే మరిదిగారికి వివరించి చెపుతున్నాను.'' అంది వదినె సొండు పెంచి... దాంతో తత్వం బోధపడ్డ వాడిలా అన్నయ్య, "అవునవును నేను హాస్పిటల్లో జాయిన్ అవుతే, అక్కడకి వెళ్ళడం కుదరదు. నాకే కాదు వదినకి కూడా కుదరదు. అందుకే నువ్వు వెళ్ళడం మంచిది. అన్నాడు అన్నయ్య.

"వోరి త్రాష్టుడు వీడు నా బామ్మరిదా?'' అంటూ ఆశ్చర్యపోయాడు సీతారావుడు.

ఇందిరకు కుతూహలం ఇంకా పెరిగిపోయింది. "చిన్నన్నయ్య ఏమన్నా డేమిటి?'' అంటూ ఆత్రంగా అడిగింది.

"నేను చిన్నన్నయ్య ఇంటికెళ్ళేసరికి, చిన్నవొదినె పెరట్లో పనాపేసి పరిగెత్తుకు వచ్చింది.

అన్నయ్య సీరియస్‌గా "బావగారు పోయారటగా'' అంటూ సిగరెట్ అంటించాడు.

అగ్గిపుల్ల గీస్తున్నప్పుడు చేతులు చిన్నగా వణికాయి. బావగారు పోయారని తెలిసి చిన్నన్నయ్య బాధపడుతున్నాడనుకున్నాను.

చిన్న వదిన అది కనిపెట్టి "అదేం బాధకాదులేవోయ్. నిన్న మందెక్కువై, కక్కుకున్నారు. ఆ నీరసానికి వేళ్ళొణుకుతున్నాయి. అంతే! ''అంది.

వొదిన్ని వో నిమిషం దీర్ఘంగా చూసి నావేపు తిరిగి "వొరేయ్ వో వొందుంటే ఇవ్వు'' అన్నాడు చిన్నన్నయ్య.

నేనో వంద ఇచ్చాను. అది తీసుకుని అర బాటిలు మందు తెప్పించుకుని నా ఎదుటనే గడగడా తాగి మళ్ళీ పడకేసాడు.

వదిన మాత్రం "చూసావా ఇదీ మీ అన్నయ్య సారో(రా) ఎక్స్‌ప్రెషను. ఇంక రేపొద్దున్న వరకూ లేవరు. గేరంటీ'' అంది అని చెప్పి... "అక్కడ నుండి తిన్నగా ఇక్కడికే వచ్చేసాను'' అన్నాడు బుల్లిబామ్మర్ది ఆయాసంగా.

"వుద్ధరించావు'' అన్నాడు సీతారామారావు కసిగా.

"ఏమిటే బావగారు రానివాళ్ళ మీది కసంతా, వచ్చినాళ్ళ మీద చూపిస్తు న్నారూ'' అంటూ చిరాకు పడ్డాడు బుల్లిబామ్మర్ది.

"అది సరేరా నిక్షేపంగా ముప్పొద్దులా తింటూ, చచ్చానని టెలిగ్రాం ఇవ్వడం ఏమిటి? ఈ మనిషికి బుర్ర చెడింది.'' అంది ఇందిర.

* * *

తొమ్మిది గంటలకి టెలిగ్రాం మనియార్డరు అంటూ పోస్టుమేన్ వచ్చాడు. మనియార్డరనే సరికి సీతారావుడు ఆశగా వెళ్ళాడుగానీ, ఆ మనియార్డరు ఇందిరకి అని తెలిసి వెనక్కి వచ్చేసాడు.

పోస్టుమేన్ ఇందిర చేత సంతకం చేయించుకుని ఐదొందలు చేతిలో పెట్టాడు. మనియార్డరుతో వచ్చిన సందేశాన్ని మనియార్డరుఫారం నుంచి చింపి ఇచ్చాడు.

"ఎక్కడ నుండి నీకు మనియార్డరొచ్చింది!'' అని అడిగాడు సీతారావుడు వెటకారంగా.

"బావగారి దగ్గర్నించి'' అంది ఇందిర.

"అన్నయ్య దగ్గర్నుంచా? ఏం రాసాడో చదువు'' అన్నాడు కుతూహలంగా.

ఇందిర సందేశం చదవడం మొదలు పెట్టింది.

ప్రియమైన మరదలికి,''

"నేను పోయానన్న టెలిగ్రాం చూడగానే, నువ్వు ప్రియమైన దానివైపోయావు'' అన్నాడు సీతారామారావు కసిగా.

"మీరూరుకోండి పూర్తిగా చదవనీయండి'' అంటూ విసుక్కుంది ఇందిర.

సీతారాముడు సైలెంటైౖ ఉత్తరం వినసాగాడు.

"తమ్ముడు పోయాడన్న వార్త మమ్మల్ని దు:ఖసముద్రంలో ముంచింది. మనం నిమిత్తమాత్రులం! పనుల వల్ల తీరిక లేక రాలేకపోతున్నాను. ఈ అయిదొందలూ ఖర్చుల నిమిత్తం పంపుతున్నాను. త్వరలో రావడానికి ప్రయత్నిస్తాను. దిగులు పడకండి. మేమంతా వున్నాము.

ఇట్లు
మీ బావగారు

వోహో ఈ ఐదొందలూ నన్ను తగలెట్టడానికా, తొందరగా తమ్ముడ్ని తగలపెట్టి, నాదగ్గరకి వచ్చేయ్ అని రాయకుండా ఇలా రాసాడన్నమాట" అన్నాడు సీతారావుడు.

ఇందిరకి చిర్రెత్తుకొచ్చింది. "తమ మేనమామగారు ఏం చేస్తారో చూడాలి" అంది.

"వ్యవహారాలు తెలుస్తూనే వున్నాయిగా ఆయనేం చేస్తాడూ! టెలిగ్రాం అందుకుని ఆనందమానందమాయెనే" అని పాడుతూ గ్రామంలో రచ్చబండ దగ్గర పంచె వూడిపోయినా పట్టించుకోకుండా గంతులేస్తుంటాడు."

"ఏం ఎందుకా ఆనందం ?" అంటూ ఆశ్చర్యపోయారు శ్రోతలు.

"ఎందుకా వొకటి నేనిచ్చిన అయిదు వేల అప్పు తీర్చక్కర్లేదని. రెండు పొలాల మీద శిస్తు లెక్కలు కట్టి అప్పచెప్పక్కర్లేదు, అందుకని ఆనందం".

"ఏం ఎందుకని అప్పచెప్పక్కర్లేదు?" అంది ఇందిర ఆశ్చర్యంగా.

"నీకూ లెక్కలు రావు. ఆయనకీ లెక్కలు అర్థం కావు. ఎలాగంటే ఏడు వేల రూపాయల శిస్తు రెండు వేల రూపాయల ఖర్చు అని చెప్పి ఏడులోంచి రెండు తీసి, మిగులు మూడు అంటూ నీ చేతిలో మూడు వేలు పెడతాడు. నీకు లెక్క తెలిసి ఏడులోంచి రెండు తీస్తే మూడేమిటండీ అని అడిగావనుకో, తను లెక్క తప్పు చేసినట్టు నొచ్చుకుంటాడు. లేదా నువ్వు మూడూ పుచ్చుకున్నావనుకో నీకు లెక్కలు రావని అర్థం చేసుకుంటాడు. అంతే కానీ రైటు దారిలో ఎప్పుడూ నడవడు. అందుకే ఆ ఆనందం"

"మరి మీ తమ్ముడూ" అంటూ డౌటు వెలిబుచ్చింది ఇందిర.

"వాడు రావచ్చు, కర్మ చెయ్యాలి కదా కర్మలో కాస్త డబ్బులు మిగుల్చుకోవచ్చు. గుండు ఎలాగూ చేస్తారు కదా. ఆర్నెల్లు మంగలి ఖర్చు మిగులు అనుకుంటాడు" అన్నాడు సీతారావుడు తముడ్ని అంచనా వేస్తూ...

సీతారాముడి నోటి మాట నోటిలో వుండగానే తలుపు చప్పుడైంది. తలుపు తీసిన ఇందిరకి ఎదురుగా సీతారాముడి తమ్ముడు కనిపించాడు. ఇందిరని చూస్తూనే వాడు ఏడుపు లంకించుకున్నాడు. వాడితో పాటు వాడి పిల్లలూ, పెళ్ళాం ఏడుపు మొదలుపెట్టారు.

ఈ ఏడుపులు విన్న సీతారాముడికి నిజంగానే చచ్చిపోయినంత ఫీలింగ్ వచ్చింది. కాసేపు గుమ్మం దగ్గర ఏడిచిన తర్వాత లోపలకొచ్చిన సీతారాముడి



తమ్ముడు సీతారాముడ్ని చూసి కౌగలించుకొని, "పెద్దన్నయ్యా! అన్నయ్య పోయాడు." అంటూ మళ్ళీ ఏడుపు మొదలుపెట్టాడు.

ఆ ఏడుపు విన్న ఇందిరకి వళ్ళు మండింది. "ఆయన మీ పెద్దన్నయ్య కాదు. టెలిగ్రాంలో చచ్చిపోయిన అన్నయ్యే" అంది కసిగా. సీతారావుడి తమ్ముడు కంగుతిని ఏడుపాపేసి సీతారాముడ్ని ఎగాదిగా చూసి, "అదేంటి అన్నయ్యా నీ రుణం తీర్చుకుందామని, నీకు ఘనంగా కర్మ చేద్దామని అంత దూరం నుండి వస్తే ఇంత నిరాశపరుస్తావా? ఏమైనా సరే నీ రుణం తీర్చుకోకుండా నే వెళ్ళను" అన్నాడు దృఢంగా.

"అదేమిట్రా బ్రతికుండగా కర్మ చేసేస్తావా?" అని ఆశ్చర్యపోయాడు సీతారాముడు.

"యస్ ఫర్ ఎ చేంజ్ ! ప్రపంచంలో అన్నీ వొకేలా వుంటే, మొనాటనస్‌గా వుంటుంది. అందుకే బతికుండగా నేను నీకు కర్మ చేసేస్తాను. బ్రతికుండగా కర్మ చేయించుకున్న ఘనత నీకు, చేసిన ఘనత నాకు వస్తుంది. ఇద్దరం 'లిమ్కా బుక్ ఆఫ్ ఇండియన్ రికార్డ్స్' లో శాశ్వతంగా వుండిపోతాం" అన్నాడు ఏకబిగిన సీతారావుడి తమ్ముడు.

ఈ ఐడియా సీతారాముడికి కొత్తగా, విప్లవాత్మకంగా వుండి నచ్చింది.

"ఇందిరా పెద్దన్నయ్య పంపిన ఐదొందలూ వీడికిచ్చేయ్ ఆపనేదో మొదలెడతాడు" అన్నాడు.

ఇందిర ఇద్దరు పిచ్చివాళ్ళని చూసినట్టు చూసింది. ఇద్దరూ ఎలా చస్తే మనకేం అనుకుందో ఏమో అయిదొందలూ తీసి సీతారాముడి తమ్ముడికి ఇచ్చేసింది.

ఇదంతా గమనిస్తున్న సీతారావుడి బుల్లిబామ్మర్ది ఏదో పనున్నట్టు బైటకి వెళ్ళిపోయాడు. గంటలో తిరిగొచ్చాడు.

అన్నయ్యని చూసి "ఇద్దరు పిచ్చివాళ్ళని చూసావురా, బతికుండగా కర్మ చేసేస్తున్నాడు వాడు, చేయించేసుకుంటున్నారు ఈయనా" అంటూ నెత్తి కొట్టుకుంది ఇందిర.

"అది సరేనే కర్మయ్యాక పన్నెండోరోజు నీ మొహం చూసి తెల్లచీర పెట్టాలి కదా! అదొట్టుకొచ్చా చూసి బావుందో లేదో చెప్పు" అంటూ తను తెచ్చిన తెల్లచీర చూపించాడు సీతారావుడి బుల్లి బామ్మర్ది.

తెల్లచీర చూసేసరికి, పుండు మీద పుల్ల చల్లినట్టుగా అయింది ఇందిరకి.

వళ్ళంతా కంపరం ఎత్తింది. ఇల్లంతా వెదికి పెద్ద కర్ర వొకటి పట్టుకొచ్చింది.

"పెద్దవాడివయితే అయ్యావుగానీ మొగుడు సలక్షణంగా వుంటే తెల్లచీర పెడతావట్రా" అంటూ సీతారావుడి బుల్లిబామ్మర్దినీ... "బతికుండగా కర్మ చేస్తావట్రా" అంటూ సీతారాముడి తమ్ముడ్నీ, వాడి ఫేమిలీని ఇంట్లోంచి తరిమేసింది. వాళ్ళందరూ వెళ్ళిపోయాక తలుపేసి వచ్చి, ఆయాసంగా గోడకి ఆనుకుని కూర్చుని "ఇలాంటి మొగుడ్ని ఇచ్చావేమిటి దేవుడోయ్!" అని బుర్ర కొట్టుకు ఏడవసాగింది.

అంతవరకూ మౌనంగా వున్న సీతారావుడు "నువ్వెందుకు ఏడుస్తావ్ నేనేడవాలి" అన్నాడు.

"ఎందుకూ?" అంటూ దీర్ఘం తీసింది ఇందిర.

"లిమ్కా బుక్ ఆఫ్ ఇండియన్ రికార్డ్స్ లో పేరు పడే అవకాశం పోయింది." అన్నాడు సీతారావుడు విచారంగా మొహం పెట్టి.

★

రచన 1998-1999

రచయిత ఇతర రచనలు

# గృహ నిర్మాణ శాస్త్రం (వాస్తు)

**ఈ పుస్తకంలో .....**

- గృహనిర్మాణ సాంకేతిక విషయములకు సులభమైన వివరణ
- బంకమన్ను నేలల్లో ప్రత్యేకమైన పునాదులు
- ఇంట్లో చెమ్మ నివారించుటకు పరిష్కారములు
- ఇరవై ప్లానులు, వాటి ఎస్టిమేటులు, వాటి ముఖద్వారము, ఏ దిక్కుగా వచ్చిన వాస్తు సరిపోవును అన్న విషయ వివరణ.
- ప్రాచీన వాస్తు, దాని అంగములు
- ఇటిక కట్టు, రాతి కట్టు వాటి సాంకేతిక విరవణ.
- గృహములో నిర్మించు బాత్రూము, కిచెను నందు ఏర్పరచుకొను సదుపాయముల గురించి సాంకేతిక పరిచయం
- పలురకములు గచ్చు నిర్మాణ పద్ధతులు

వెల: రు 100 (పోస్టేజి అదనం)

**హాపీహోమ్ పబ్లికేషన్స్**

**HIG-II-39 SFS (Upstairs)**
**(Near Saibaba temple)**
**Housing Board Colony, P.M. Palem,**
**VISAKHAPATNAM - 530 041**
**velcherucs@rediffmail.com**